thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 189 కరీంనగర్ మంగళవారం, 16 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.



## బండి సంజయ్‌పై కేటీఆర్ రూ.10 కోట్ల పరువు నష్టం దావా

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి సంచలనానికి తావిచ్చే పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భారీ పరువు నష్టం దావా వేశారు. బండి సంజయ్ తనపై చేసిన వ్యాఖ్యలు తప్పుడు ఆరోపణలతో నిండిఉన్నాయని, అవి తన రాజకీయ, వ్యక్తిగత ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని కేటీఆర్ ఆరోపించారు. సోమవారం కేటీఆర్ తరఫు న్యాయవాదులు సిటీ సివిల్ కోర్టులో రూ.10 కోట్ల పరువు నష్టం దావా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు డిసెంబర్ 15వ తేదీన విచారణ జరపనుంది. బండి సంజయ్ తాజాగా ఫోన్ ట్యాపింగ్ వివాదంపై కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమని ఇప్పటికే కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. అయినప్పటికీ బండి సంజయ్ తనపై రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు కొనసాగిస్తున్నారని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. తనపై చేస్తున్న ఈ ఆరోపణలు ప్రజల్లో తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేలా ఉన్నాయని, ముఖ్యంగా తన ప్రజా ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ కోర్టులో స్పష్టం చేశారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపణ. రాజకీయంగా పోటీ చేయడం వేరే విషయం, కానీ తప్పుడు ఆరోపణలతో ప్రతిష్ఠను మసకబార్చే ప్రయత్నం అసహ్యకరమని కేటీఆర్ వైఖరి. బండి సంజయ్‌పై కేటీఆర్ వేసిన ఈ భారీ దావా ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఇరుపార్టీల మధ్య మాటల యుద్ధం, ఆరోపణలు-ప్రత్యారోపణలు మరోస్థాయికి చేరాయి. ఈ కేసు విచారణ ఎటువంటి మలుపు తిరుగుతుందన్నది అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.




## వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం కీలక ఆదేశాలు

వక్ఫ్ (సవరణ) చట్టం-2025లో కీలక ప్రొవిజన్‌ను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాంను అనుసరించిన వ్యక్తి మాత్రమే ఆస్తిని వక్ఫ్ చేయడానికి అవకాశం ఉంటుందన్న దానిని నిలిపివేసింది.

ఒక వ్యక్తి ఇస్లాంను అనుసరిస్తున్నట్లు నిర్ణయించేలా నిబంధనలు తయారుచేసేవరకు ఇది అమల్లో ఉండదని చెప్పింది. అదే సమయంలో వక్ఫ్(సవరణ)చట్టం-2025పై మొత్తంగా స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజార్టీలో ఉండాలని కోర్టు పేర్కొంది. బోర్డ్ లేదా కౌన్సిల్‌లో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు ఉండాలని చెప్పింది. ఇక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిమే ఉండటం మంచిదని పేర్కొంది.

**గౌరవంగా జీవించే పరిస్థితులు కల్పించాలి...** ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను పూర్తిగా నిలిపివేయాలని దాదాపు 100కు పైగా పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ముస్లింల ఆస్తిని మెల్లగా లాగేసుకునేందుకే అని వీటిల్లో ఆరోపించాయి. ఇక కేంద్రం మాత్రం పబ్లిక్, ప్రైవేటు ఆక్రమణలకు గురికాకుండా రక్షించడానికి అని వాదించింది. వాస్తవానికి ఈ కేసు ఏప్రిల్‌లో పార్లమెంట్ ఈ బిల్లును క్లియర్ చేసిన గంటల్లోనే సుప్రీంకోర్టుకు చేరింది. ముఖ్యంగా కోర్టులతో వక్ఫ్ ఆస్తిగా గుర్తించినవి, వ్యక్తులు, డీడ్ల ఆధారంగా వక్ఫ్ అయిన ఆస్తుల డీనోటిఫై అధికారాలను దీనిలో ప్రశ్నించారు.





## పల్లెల్లో వెలుగులు నింపాలి

## సోలార్ పవర్ వినియోగం సాధ్యాసాధ్యాలను పరిశీలించండి

## అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్: రాష్ట్ర మంతా ఎల్ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని, పల్లెల్లో వెలుగులు నింపాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం (సెప్టెంబర్ 15) పంచాయతీ రాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీ విభాగాలకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వీధి దీపాలకు సంబంధించి గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న LED లైట్లు వెలుగుతున్నాయా లేదా, కొత్తగా ఎన్ని అవసరం ఉన్నాయో పక్కాగా అంచనా వేయాలని, ప్రతి పోల్ లెక్కించేలా సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్‌బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అదుపుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రంలో అన్ని ఎల్ఈడీ లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ నివేదించింది. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని చెప్పారు. కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించాలని చెప్పారు. ఎల్ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్సుల ఏర్పాటు, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెల రూ. 8 కోట్ల కరెంటు బిల్లు అవుతున్నందున, సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం సూచించారు.



## టైం కలిసిరావట్లేదబ్బా!

## భారత్‌కు వ్యతిరేకంగా ఏం చేసినా ట్రంప్‌కు కలిసిరాని కాలం!!

## భారత్ - రష్యా స్నేహాన్ని అడ్డుకునే యుక్తులన్నీ చిత్తు!!

రష్యా చమురు, ఆయుధ కొనుగోళ్ల విషయంలో భారత్‌పై ట్రంప్ కోపం ఇంకా చల్లారినట్టు కనిపించడం లేదు. ఈ క్రమంలో ఈయూ, జీ7, నాటో సహా పలు దేశాలపైనా ఆయన ఒత్తిడి చేస్తుండడం చూస్తున్నాం. అమెరికాలాగే ఆ దేశాలకు భారతీయ వస్తువులపై సుంకాల మోత మోగించాలంటూ సూచిస్తున్నారాయన. అయితే ఈ విషయంలో ఆయనకు చేదు అనుభవమే ఎదురవుతోంది!. తాజాగా ఈ పరిణామంపై రష్యా స్పందించింది. భారత్‌తో తమ సంబంధాలు స్థిరంగా కొనసాగుతున్నాయని.. ఇరు దేశాల సంబంధాలను దెబ్బ తీయాలనే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లో ఫలించబోవని స్పష్టం చేసింది. ఈ క్రమంలో అమెరికాకు మెత్తగా మొట్టికాయలు వేసింది. "ఇండియా-రష్యా సంబంధాలు స్థిరంగా, ధైర్యంగా ముందుకు సాగుతున్నాయి. ఈ బంధాన్ని భంగం చేయాలనే ప్రయత్నాలు విఫలం కాక తప్పదు. అమెరికా, నాటో దేశాల ఒత్తిడిని ఎదుర్కొంటూ రష్యా చమురు కొనుగోలు కొనసాగిస్తున్నందుకు ఇండియాను అభినందించాల్సిందే. బాహ్య బెదిరింపులు, విమర్శలు ఉన్నా, ఇండియా తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం అని రష్యా విదేశాంగ శాఖ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొంది. ఇండియా వైఖరి.. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇండియా-రష్యా స్నేహబంధం స్ఫూర్తి, సంప్రదాయాలపై ఆధారపడి ఉంది. ఇది అంతర్జాతీయ వ్యవహారాల్లో వ్యూహాత్మక స్వయం ఇండియా నిర్ణయాన్ని ప్రతిబింబిస్తోంది. ఇరు దేశాలు మిలిటరీ ఉత్పత్తులు, అంతరిక్ష మిషన్లు, అణు శక్తి, రష్యన్ చమురు పరిశోధనలో భారత పెట్టుబడులు వంటి రంగాల్లో పనిచేస్తున్నాయి. నూతన చెల్లింపు వ్యవస్థలు, జాతీయ కరెన్సీల వినియోగం, పరస్పర రవాణా మార్గాల అభివృద్ధి వంటి అంశాల్లో కూడా సహకారం కొనసాగుతోంది అని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం భారత ఉత్పత్తులపై తొలుత 25% ప్రతీకార సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. అటుపై రష్యా చమురు, రక్షణ సామాగ్రి కొనుగోళ్ల నేపథ్యంతో పెనాల్టీ కింద మరో 25% శాతం విధించారు. ఈ టారిఫ్‌లను భారత్ అన్యాయంగా పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం జాతీయ ప్రయోజనాల, మార్కెట్ అవసరాల ఆధారంగా జరుగుతోందని భారత్ స్పష్టం చేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో.. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. రష్యా భారత్ ఆర్థిక వ్యవస్థలు డెడ్.. వాటి గురించి పట్టించుకోవాల్సిన అవసరం తనకు లేదంటూ సంచలన కామెంట్ చేశారు. అయినప్పటికీ.. అమెరికా ఒత్తిడికి తలవంచే ప్రసక్తే లేదని, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే హక్కు తమ దేశానికి ఉందని భారత్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగానే ఉక్రెయిన్ శాంతి చర్చల్లో భాగంగా అలస్కాలో పుతిన్‌తో భేటీ తర్వాత ట్రంప్ స్వరం కాస్త తగ్గింది. ఉక్రెయిన్ డీల్ కుదిరితే భారత సుంకాల విషయంలో ఆలోచన చేయొచ్చని అన్నారాయన. అయితే.. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరాలంటే.. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై రాయితీలు ఇవ్వలేమని కుండబద్దలు కొట్టేసింది. ఈ క్రమంలో.. ఈ రంగాలను రెడ్ లైన్స్‌గా %తీవ్రం శ్రీఅవం%గా అభివర్ణించింది. మరోవైపు.. ఎగుమతిదారులపై ప్రభావం తగ్గించేందుకు భారత ప్రభుత్వం ఆర్థిక మద్దతు ప్యాకేజీలు ప్రకటించే అవకాశముందనే విశ్లేషణ నడిచింది. ఈలోపు ట్రంప్-మోదీల పరస్పర సోషల్ మీడియా సంభాషణతో ఈ చర్చలు ముందుకు సాగవచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది.




నల్గొండ: ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు తీర్పు ఇచ్చింది. దోషి దోమల రాముకు 21 ఏళ్లు జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధించింది. ఈ ఘటనపై 2018 ఫిబ్రవరిలో చిట్యాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. 2022 నుంచి నల్గొండ పోక్సో కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి సోమవారం తీర్పు వెలువరించారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.




హైదరాబాద్: ప్రైవేట్ ఇంజనీరింగ్, వృత్తి విద్యా సంస్థల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌పై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై ఇప్పటికే సానుకూల చర్యలు చేపడుతున్నప్పటికీ బంద్ పాటించడంపై రేవంత్ రెడ్డి సర్కార్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంజనీరింగ్ కాలేజీల విద్యా ప్రమాణాలపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ కమిషన్ ఒక రిపోర్ట్‌ను సమర్పించిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ఆ నివేదికను మరోసారి పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా యాజమాన్యాలు సమ్మె విరమించి కాలేజీలు యథావిధిగా నడిపించాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే నేడు చర్చలు జరిపారు. అయితే, కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం మరోమారు చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది.




తిరుపతి: మహిళల భాగస్వామ్యం లేకుండా వికసిత్ భారత్ సాధించలేమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. కొన్నిచోట్ల పాఠశాలలు దూరంగా ఉండటం వల్ల కొందరు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. అలాంటి చోట సాంకేతిక సహాయంతో బాలికలు విద్యావంతులు అయ్యేలా చూడాలన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో రెండో రోజు ఆయన మాట్లాడారు. మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, క్రీడా రంగాల్లో మరింత ముందుకి తీసుకువచ్చేలా రెండు రోజుల పాటు చర్చలు జరిగాయన్నారు. "ప్రతి మహిళకు భద్రత, ఆత్మ నిర్భరత అందించాలి. పంచాయతీ స్థాయిలో కంప్యూటర్ సెంటర్ ఉండేలా చూడాలి. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఎకనామిక్ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం సాధిస్తే.. భారత్ ఆర్థికంగా వృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతి మహిళకు పని కల్పించి, ఆర్థికంగా స్వతంత్రులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ఈ కమిటీలు ప్రణాళికలు రూపొందించాలి. దేశంలోని ఆఖరి మహిళకు కూడా ఫలితాలు అందేలా ప్రణాళికలు ఉండాలి.

పంచాయతీ, మున్సిపాలిటీ నుంచి పార్లమెంట్ వరకు ప్రతి ఒక్కరూ మహిళల వృద్ధి కోసం కృషి చేయాలి. గ్రామీణ స్థాయి నుంచే మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. అన్ని రాష్ట్రాల్లో విమెన్ కమిటీలు ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థిక, సామాజిక స్వావలంబన సాధించకపోతే మనం వికసిత్ భారత్ కల సాకారం చేసుకోలేం" అని ఓం బిర్లా అన్నారు.


## సీఎం రేవంత్ నివాసం ముట్టడికి యత్నం.. పోలీసుల అదుపులో అంగన్వాడీలు

కొడంగల్: వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లా నలుమూలల నుంచి 300 మంది అంగన్వాడీ కార్యకర్తలు.. సీఎం నివాసం ముట్టడి కోసం కొడంగల్ వచ్చారు. స్థానిక బస్టాండ్‌లో నిరసన తెలిపారు. అనంతరం సుమారు 40 మంది సీఎం ఇంటి ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

## ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల బంద్‌కు భాజపా మద్దతు: రామచందర్‌రావు

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ప్రైవేటు కళాశాలలకు ఉందని చెప్పారు. విద్యావ్యవస్థను గత ప్రభుత్వం చెడగొట్టిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా యాజమాన్యాలతో చర్చించి వారికి సహకారం అందించాలని కోరారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. విద్యపై ప్రభుత్వ వైఖరిని భాజపా తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.






## మేధా పాఠశాల సీజ్.. విద్యార్థుల భవితవ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

బోయిన్‌పల్లి: అల్ప్రాజోలం తయారీ కేసులో సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని మేధా పాఠశాలను అధికారులు ఆదివారం సీజ్ చేశారు. ఈ సమాచారం తెలియక సోమవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి పాఠశాలకు వచ్చారు. పాఠశాల సీజ్ అయినట్లు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. టీసీ ఇస్తే ఇతర పాఠశాలలో చేర్పించుకుంటామని తెలిపారు. పాఠశాలలో మత్తు పదార్థాలు తయారు చేయడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరారు. ఇప్పటికే పాఠశాలకు 70 శాతం ఫీజులు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఏం జరిగిందంటే?...** మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మలేల జయప్రకాశ్‌గౌడ్(39) హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లి సాయికాలనీలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో మేధా పేరుతో పాఠశాల నిర్వహిస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో అల్ప్రాజోలం తయారీ దందాకు తెరలేపాడు.

తయారీ ఫార్ములాను గురువారెడ్డి అనే వ్యక్తి ఇచ్చాడు. స్కూలు రెండో అంతస్తులోని రెండు గదుల్లో పరికరాల సాయంతో తయారుచేసి, మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని వివిధ ప్రాంతాల్లోని కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఈగల్ బృందం శనివారం ఆకస్మిక తనిఖీలు చేసింది. జయప్రకాశ్‌గౌడ్, అతడికి సహకరిస్తున్న బోయిన్‌పల్లికి చెందిన పెంటమోల్ ఉదయ్ సాయి(23), గౌటె మురళి(23)లను అదుపులోకి తీసుకుంది. ఆదివారం అధికారులు పాఠశాలను సీజ్ చేశారు.




హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై పల్టీలు కొట్టి కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఇన్ఫోసిస్ ఉద్యోగిని సౌమ్యా రెడ్డి మృతిచెందగా.. మరో ఏడుగురికి గాయాలయ్యాయి.

ఇన్ఫోసిస్ ఉద్యోగులు సరళ మైసమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా అబ్దుల్లాపూర్‌మెట్ ఓఆర్ఆర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో నంద కిశోర్, వీరేంద్ర, ప్రనీష్, అరవింద్, సాగర్, ఝాన్సీ, శ్రుతి ఉన్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలు సౌమ్యా రెడ్డి స్వస్థలం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాలగా గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## రేవంత్ పాలనలో సంక్షేమం బందు, అభివృద్ధి బందు: హరీష్ రావు



రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా ఆగిపోయాయని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బందు చేశారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బందు అయిపోయాయని హరీష్ రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ తీరు వల్ల చాలా సమస్యలు మొదలయ్యాయని విమర్శిస్తూ ట్వీట్ చేశారు. 'బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బందు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బందు. విద్యార్థులకు నిరుద్యోగ భృతి బందు. జాబ్ క్యాలెండర్ బందు. ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు బందు. నిధుల లేక గ్రామాల్లో పారిశుధ్యం బందు. డీజిల్ పోయించేందుకు కూడా డబ్బులు లేక చెత్త ఎత్తే ట్రాక్టర్లు బందు. రైతులకు రుణ మాఫీ బందు. పంట బోనస్ బందు. వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా బందు. పంట పండిద్దామంటే చివరకు అన్నదాతకు యూరియా బందు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం బందు, అభివృద్ధి బందు. ఎక్కడ చూసినా బందు, బందు, బందు.' అని హరీష్ రావు ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు విసిగి వేసారి పోయారని, ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ డ్రామాలను బందు పెట్టే రోజులు ఇక దగ్గర్లోనే ఉన్నాయని కామెంట్ చేశారు.

## ఓటర్లతో ముచ్చట పెట్టి.. అమలు కానీ హామీలు..



హైదరాబాద్,సెప్టెంబర్ 15: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని ఆ నియోజకవర్గంలోని కేడర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో సదరు నియోజకవర్గంలోని వెంగళరావు నగర్ సిగ్మెంట్‌కు చెందిన పార్టీ కేడర్‌తో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటూ వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటర్లతో ముచ్చట పెట్టి.. అమలు కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను వారికి గుర్తు చేయాలని సూచించారు. అలాగే కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని సైతం ఓటర్లకు వివరించాలని స్పష్టం చేశారు. గతంలో పీజేఆర్, కేసీఆర్, గోపినాథ్ కొట్లాడినట్లు ఉప ఎన్నికల్లో కొట్లాడాలంటూ బీఆర్ఎస్ క్యాడర్‌కు స్పష్టం చేశారు. భయపడితే నాయకులు కాలేరని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై ఎన్నో కేసులు పెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కేటీఆర్ అరెస్ట్ అవుతారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోందని.. అందుకు తాను భయపడడం లేదని కుండ బద్దలు కొట్టారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే.. మీ ఇళ్లు కూల్చడానికి మీరే లైసెన్స్ ఇచ్చినట్లు అవుతుందని హెచ్చరించారు. హైడ్రా పేరు మీద సీఎం రేవంత్ రెడ్డి కొన్ని వేల ఇళ్లు కూలగొట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు వ్యతిరేకంగా పని చేయటమే ఇందిరమ్మ రాజ్యమా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావు నగర్ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్ పార్టీలో పంచాయితీలు ఉన్న మాట వాస్తవమని ఆయన అంగీకరించారు. అవన్నీ మైక్ ముందు చెబితే బాగుండదన్నారు. ప్రతి ఇంటిలో పంచాయితీ ఉంటుందని.. అలానే వెంగళరావు నగర్ బీఆర్ఎస్ పార్టీలో సైతం ఉందన్నారు.

మనం బయటపడి కొట్లాడుకుంటే.. కాంగ్రెస్, బీజేపీ రెడీగా ఉన్నాయని.. జాగ్రత్త అంటూ బీఆర్ఎస్ కేడర్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ అప్రమత్తం చేశారు. పంచాయితీ పెద్దగా తనను పెడితే తనతో కాదని స్పష్టం చేశారు. ఏమైనా ఉంటే.. మీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సుధీర్ రెడ్డి సమక్షంలో ఆయా ఇబ్బందులను సరి చేసుకోవాలంటూ కేడర్‌కు సూచించారు. ఎన్నికల హామీలు అమలు చేయమంటే .. తనను కోసుకుని తినమంటూ సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారంటూ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని తాను గతంలో ఎప్పుడూ చూడలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు కన్పించరంటూ జోస్యం చెప్పారు. పేదలకు గులాబీ జెండానే దిక్కు అంటూ వారికి గుర్తు చేశారు. కేసులకు భయపడొద్దు.. కార్యకర్తలను కాపాడుకుంటామంటూ బీఆర్ఎస్ క్యాడర్‌కు ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## నిలిచిపోనున్న ఆరోగ్య శ్రీ సేవలు..

హైదరాబాద్ : ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో.. తెలంగాణలో మరోసారి ఆ సేవలను నిలిపివేయనున్నట్లు ప్రైవేట్ నెట్ వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ సోమవారం నాడు హైదరాబాద్‌లో ప్రకటించింది. మంగళవారం.. అంటే సెప్టెంబర్ 16వ తేదీ అర్ధరాత్రి నుంచి ఈ సేవలను నిలిపివేయనున్నట్లు వెల్లడించింది. ఆరోగ్య శ్రీ సేవల ద్వారా ప్రైవేట్ ఆసుపత్రులకు రూ.1400 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపింది. ఈ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఎటువంటి సానుకూల ప్రకటన రాలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో సమ్మె నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. నిధులు లేమి కారణంగా.. హాస్పిటల్స్ నడిపించే పరిస్థితి లేదని ప్రైవేట్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. బిల్లులు పొందాల్సిన జాబితాలో దాదాపు 400 హాస్పిటల్స్ ఉన్నట్లు సమాచారం. గత ఏడాదిగా హాస్పిటల్స్‌కు ప్రభుత్వం నగదు చెల్లించడం లేదని యాజమాన్యాలు వాపోతున్నాయి. అయితే ఈ అంశంపై ఆగస్టు 31వ తేదీనే ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశామని హాస్పిటల్స్ యాజమాన్యం తెలిపింది. ఆ రోజు అర్ధరాత్రి నుంచే సేవలు బంద్ చేస్తామని ప్రభుత్వాన్ని స్పష్టం చేశామని.. దీంతో ఆరోగ్య శాఖ మంత్రి రంగంలోకి దిగి ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపింది. అయినా ఇప్పటివరకూ నిధులు రాకపోవడంతో సమ్మెకు దిగబోతున్నట్లు వెల్లడించింది. కానీ రెండు వారాలు గడిచినా.. ఆ నిధులు ఇప్పటి వరకు విడుదల చేయలేదని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సేవలను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఏడాది జనవరిలో సైతం ఇదే విధంగా ఆరోగ్య శ్రీ సేవలను సదరు అసోసియేషన్ నిలిపివేసిన విషయం విదితమే.



చురకలు



# మలేరియా వ్యాధి పట్ల అవగాహన అవసరం

## – సెప్టెంబర్ 16... సర్ రోనాల్డ్ రాస్ వర్ధంతి



ప్రాణాంతక వ్యాధి మలేరియా పట్ల ప్రజలలో అవగాహన పెంచడం, చికిత్స చేయడం, నివారించడం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం అత్యవసరం. మలేరియా అనే పేరు "మల అరియ" అనే ఇటాలియను పదాల నుండి పుట్టింది. "మల అరియ" అంటే చెడిపోయిన గాలి అని అర్థం. చిత్తడి నేల ఉన్న చోట్ల మలేరియా అధికంగా ఉండటం వలన ఈ జ్వరాన్ని చిత్తడి జ్వరం అని కూడా పిలిచేవారు. సర్ రోనాల్డ్ రాస్ (13 మే, 1857 %-% 16 సెప్టెంబర్, 1932) (బ్రిటిష్ వైద్యుడు, శాస్త్రవేత్త. ఆయనకు మలేరియా పారసైట్ జీవితచక్రానికి చెందిన పరిశోధనకు 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రదానం చేయబడింది. 1897 లో ఒక దోమ యొక్క జీర్ణశయాంతర ప్రేగులలో మలేరియా పరాన్నజీవిని ఆయన కనుగొన్నప్పుడు మలేరియా దోమల ద్వారా వ్యాపిస్తుందని బుజువు చేసింది. ఈ వ్యాధిని ఎదుర్కొనే పద్ధతికి పునాది వేసింది. భారతీయ వైద్య సేవలో 1881 లో ప్రవేశించి 25 సంవత్సరాలు పనిచేశాడు. తన సేవలోనే అతను సంచలనాత్మక వైద్య ఆవిష్కరణ చేశాడు. 1895 మార్చి 20న ఆయన లండన్ నుండి బయలుదేరి, ఏప్రిల్ 24న సికింద్రాబాదు చేరాడు. కస్టమ్ ఆఫీసులో తన సామాను క్లియర్ కావడానికి ముందే, అతను నేరుగా బొంబాయి సివిల్ హాస్పిటల్ కి వెళ్లి, మలేరియా రోగుల కోసం వెతుకుతూ రక్త నమూనాలు సేకరించడం ప్రారంభించాడు. రాస్ మే 1895 లో దోమల కడుపు లోపల మలేరియా పరాన్నజీవి ప్రారంభ దశలను గమనించి నప్పుడు తన పరిశోధనలో మొదటి ముఖ్యమైన అడుగు వేశాడు. 1896 జూన్‌లో ఆయనను సికింద్రాబాద్‌కు బదిలీ చేశారు. రెండు సంవత్సరాల పరిశోధన వైఫల్యం తరువాత, జూలై 1897 లో అతను సేకరించిన లార్వా నుండి 20 వయోజన "గోధుమ" దోమలను సంవర్ధనం చేయగలిగాడు. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రాన్ని సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త సికింద్రాబాదు నగరంలో పరిశోధన చేస్తున్నప్పుడు 1897 ఆగస్టు 20న కనుగొన్నారు. తద్వారా ఆయనకు 1902లో నోబెల్ బహుమతి లభించింది. రోనాల్డ్‌రాస్.. మలేరియా పరాన్న జీవికి ప్లాస్మోడియం అని పేరు పెట్టారు. రొనాల్డ్ రాస్ భారతదేశం లోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని అల్మోరాలో జన్మించాడు. ప్రస్తుతం "మినిస్టర్స్ రోడ్"గా పిలిచే రహదారిని 2000 సంవత్సరం వరకు "సర్ రోనాల్డ్ రాస్ రోడ్" అనేవారు. మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన కలుగుతుంది. మనుషుల్లో ఆడ అనోఫిలస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. పరాన్నజీవిని కలిగివున్న ఆ దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులలో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ప్రపంచంలో ఏటా 500 మిలియన్ల జనాభా మలేరియా జ్వరాల బారిన పడి వారిలో 2.7 మిలియన్ల మంది మరణిస్తున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్లాస్మోడియం" అనే ప్రోటోజోవా పరాన్నజీవి మలేరియా వ్యాధి కారకము. ప్రోటోజోవాలు ఏకకణజీవులు. వీటి నిర్మాణము బ్యాక్టీరియా కంటే క్లిష్టమైనది. బ్యాక్టీరియా చాలా సులువయిన నిర్మాణము కలిగి ఉంటాయి. వివిధ ప్లాస్మోడియం స్పీసీస్లు మనుషులలో వివిధ రకాల మలేరియాలను కలుగజేస్తాయి. అందులో ...ప్లాస్మోడియం ఫాల్సిపారం, ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం మలేరియై, ప్లాస్మోడియం ఒవేల్, ప్లాస్మోడియం సెమీ ఒవేల్, ప్లాస్మోడియం నోవెల్సి ముఖ్యమైనవి. దోమ మనుషులను కరిచినపుడు అవి మనుషులలో చేరి వారి కాలేయంలో విభజన చెంది తదనంతరం ఎర్ర రక్తకణాలను నాశనం చేస్తాయి. ఎర్ర రక్తకణాలలో చేరిన 48 నుండి 72 గంటలలో ఈ పరాన్నజీవులు విభజన చెంది చిట్లిపోతాయి.దీనివలన ఫ్లూ, వణుకుతో కూడిన జ్వరం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘ శ్వాస, రక్తలేమి చిహ్నాలు మరియు స్పృహ కోల్పోవడం జరుగుతుంది. చలి జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పిగా ఉండటం, దగ్గు, చెమటలు పట్టడం, వాంతులు, విరేచనాలు, నీరసంగా ఉండటం, ఆయాసం మొదలైనవి మలేరియా లక్షణాలు. ప్రారంభ దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం వల్ల మెరుగైన చికిత్స అందించ వచ్చు. దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య ఈ లక్షణాలు కనిపిస్తాయి. రక్త నమూనాలను సేకరించి మైక్రోస్కోపిక్ ల్యాబొరేటరీ టెస్టులు లేదా ఆర్డీటీ టెస్టుల ద్వారా మలేరియా వ్యాధిని నిర్ధారిస్తారు. 1946నుండి మలేరియా అదుపు చేయడానికి డి.డి.టి వినియోగం మొదలయ్యింది. 1953లో 7 కోట్ల పైగా ప్రజలు మలేరియా బారిన పడ్డారు. 8 లక్షల వరకు మరణాలు అందువలన సంభవించాయి. అప్పుడు 1958లో జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్లు రక్తపరీక్ష చేసి మలేరియా అని నిర్ధారిస్తారు. వ్యాధిగ్రస్తుని నుండి సేకరించిన రక్తం బొట్టును ఒక సన్నటి గాజు పలకపై ఉంచి, దానిపై గింసా ద్రావకం వేస్తారు. దీనివలన దాక్టర్లు సూక్ష్మదర్శిని (మైక్రోస్కోపు) కింద మలేరియా జీవులను చూడ గలుగుతారు. మలేరియా బారిన పడిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే.. వ్యాధి సోకకుండా జాగ్రత్త వహించడం మేలు. దోమలు ఉండకుండా చూసుకోవాలి. ఇందుకోసం పరిసరాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. మస్కిటో రిపెల్లెంట్స్ (క్రీములు, స్ప్రేలు వాడటం ఉపకరిస్తుంది. ఘాటైన వాసనలు వెదజల్లే మొక్కలు, పుష్పాలను దోమలు ఇష్టపడవు. కాబట్టి బంతి రోస్‌మేరీ, పుదీనా మొక్కలను ఇంటి పరిసరాల్లో పెంచడం వల్ల దోమలు రాకుండా ఉ ంటాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఎక్కువగా ద్రవాహారం తీసుకోవడం ముఖ్యం. తద్వారా రోగ నిరోధక వ్యవస్థ బలోపేతమై, రోగాలు బారిన పడకుండా ఉంటాం. వీధుల్లో అమ్మే అపరిశుభ్ర ఆహారం తీసుకోవడం మానేయాలి. అధిక ప్రొటీన్లు ఉన్న పాలు పెరుగు, మజ్జిగ మలేరియా వ్యాధి ఉన్నవారు కణజాలాన్ని అధికంగా కోల్పోవడం వలన మలేరియా ఉన్నవారు తమ ఆహార ప్రణాళికలో ప్రోటీన్లను చేర్చుకోవాలి. అధిక ప్రోటీన్ మరియు అధిక చెక్కెరలు ఉన్న ఆహార పదార్థాలు కణజాల నిర్మాణానికి దోహద పడతాయి. అధిక ప్రొటీన్లు ఉన్న పాలు, పెరుగు, మజ్జిగ, చేపలు, లస్సీ, చికెన్ సూప్, గుడ్లు మొదలైనవి తీసుకోవాలి. ఎలాక్ట్రోలైట్స్ మరియు నీటిని కోల్పోవడం మలేరియా వ్యాధి ఉన్నవారిలో సర్వ సామాన్యం. కనుక పండ్ల రసాలు, సూపులు, గంజి, కొబ్బరి నీరు, పప్పు నీరు మొదలైనవి తీసుకోవడం శ్రేయస్కరం. బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్ల విటమిన్ ఎ, విటమిన్ సి సమృద్ధిగా కలిగిన బీట్ రూట్, క్యారెట్, బొప్పాయి, నిమ్మ జాతి పండ్లయిన నారింజ, బత్తాయి, ద్రాక్ష, అనాసపనస, నిమ్మ మొదలైన ఆహార పదార్థాలతో పాటు బి- కాంప్లెక్స్ విటమిన్లు తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494.**

# పంటల రక్షణలో సంక్షోభం - ఎరువుల కోసం రైతుల పోరాటం

**యూరియా కొరత : తెలంగాణ రైతు వ్యథ - యూరియా కొరతతో తెలంగాణ రైతు కన్నీటి సేద్యం...**



తెలంగాణ రాష్ట్రం వ్యవసాయం ఆధారంగా జీవించే రైతుల సమాజం. పంటల సాగు, దిగుబడి పెంపు, ఆర్థిక భద్రత అన్నీ ఎరువులపై ఆధారపడి ఉంటాయి. వాటిలోనూ యూరియా ఎరువు అత్యంత కీలకం. నైట్రోజన్‌ను ప్రధానంగా అందించే ఈ ఎరువు లేకుండా వరి, పత్తి, మక్కజొన్న, సోయాబీన్ వంటి ప్రధాన పంటల వృద్ధి అసాధ్యం. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లోనే రాష్ట్రం యావత్తు యూరియా కొరతతో కుదేలైంది. రైతులు ప్యాక్స్ కేంద్రాల ముందు రోజంతా, రాత్రంతా క్యూలలో నిలబడి టోకెన్ల కోసం పోటీ పడుతున్న దృశ్యాలు సాధారణమయ్యాయి. ఇది కేవలం సరఫరా లోపం కాదు, రైతు జీవనాధారంపై గంభీరమైన దెబ్బ. ఇది కేవలం ఎరువు సమస్య మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యవసాయ భవిష్యత్తుపై గంభీరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. రాష్ట్రానికి ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. అందులో సెప్టెంబర్ నాటికే కనీసం 3.5 లక్షల టన్నులు రైతులకు చేరుకోవాలి. సెప్టెంబర్ మొదటి వారంలో మాత్రమే 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చింది. స్టాక్‌గా లభించినది కేవలం 90 వేల టన్నులే. ప్రతిరోజు 10 వేల టన్నుల చొప్పున 2 లక్షల టన్నుల యూరియా వస్తోందని వ్యవసాయ మంత్రి తుమ్మల చెబుతున్నారు. ఈ తీవ్ర లోటు కారణంగా ప్రభుత్వం కేంద్రాన్ని ఆశ్రయించి రెండు లక్షల టన్నుల అదనపు సరఫరా పంపాలని డిమాండ్ చేసింది. కేంద్రం దేశవ్యాప్తంగా 314 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరుగుతోందని చెబుతున్నప్పటికీ, తెలంగాణకు మాత్రం అవసరానికి తగ్గ కేటాయింపు జరగక పోవడంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయి. జిల్లాల వారీగా చూస్తే నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉంది. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే సుమారు 30 వేల మంది రైతులు వరి పంటల కోసం యూరియాపై ఆధారపడి ఉన్నారు. ఈ జిల్లాకు నెలకు కనీసం 25 వేల టన్నుల అవసరం ఉండగా, అందినది కేవలం 8 వేల టన్నులే. జగిత్యాలలో 20 వేల టన్నుల అవసరానికి 6 వేల టన్నులు మాత్రమే లభించాయి. పత్తి పంటలు ఎక్కువగా సాగు అయ్యే ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో మక్కజొన్న పంటలకు కావలసిన యూరియా కేవలం 40 శాతం మాత్రమే అందింది. ఈ గణాంకాలు రైతుల ఆవేదనకు బలమైన సాక్ష్యం. రాష్ట్రానికి వచ్చే యూరియా రేక్‌లో 60 శాతం ప్రాథమిక వ్యవసాయ, సహకార సంఘాలకు, 40 శాతం ప్రైవేటు డీలర్లకు కేటాయిస్తున్నారు. యూరియాను సక్రమంగా పంపిణీ చేయటంలో పీఏసీఎస్ సిబ్బంది పలు చోట్ల విఫలమవుతుండగా, ప్రైవేటు డీలర్లు మాత్రం అధిక ధరలకు బహిరంగ మార్కెట్లో యూరియా అమ్ముకుంటున్నారు. ప్యాక్స్ కేంద్రాల వద్ద క్యూలలో నిలిచే రైతుల సంఖ్య కూడా ఆందోళనకరంగా ఉంది. చాలా కేంద్రాలలో రోజుకు కనీసం 400%-%500 మంది రైతులు రాత్రంతా బస చేస్తూ ఎరువు కోసం ఎదురు చూస్తున్నారు. మెదక్ జిల్లా తూఫ్రాన్ ప్యాక్స్ వద్ద ఒకే రోజున 700 మంది రైతులు టోకెన్ల కోసం రాత్రంతా క్యూలో నిలబడ్డారు. నిజామాబాద్ జిల్లా బీబీ నగర్ ప్యాక్స్ వద్ద మహిళలు, వృద్ధులు కూడా ఎరువు కోసం కష్టపడు తున్నారు. 45 కిలోల యూరియా బస్తా వాస్తవ ధర రూ.2,234. కేంద్ర ప్రభుత్వం 1,968 రూపాయల సబ్సిడీ ఇస్తోంది. అంటే.. రైతులకు ఒక్కో బస్తా రూ.266 మాత్రమే పడుతోంది. బస్తా బ్లాక్ మార్కెట్‌లో 450-500 రూపాయలకు అమ్మ బడుతోంది. కొన్ని ప్రాంతాల్లో 550 రూపాయల వరకు ధర పెరిగింది. ఉదాహరణకు, వరంగల్ అర్బన్ జిల్లాలో రైతులు ఒక్కో బస్తా కోసం 520 రూపాయలు చెల్లించాల్సి వచ్చింది. కరీంనగర్ జిల్లాలో 500 రూపాయలకు పైగా విక్రయాలు నమోదయ్యాయి. ఈ అదనపు ఖర్చు రైతుల భారం మరింత పెంచింది. ఈ సమస్యకు పలు కారణాలు ఉన్నాయి. రామగుండం ప్లాంట్ తరచూ నిలిచిపోవడం స్థానిక సరఫరాకు తీవ్ర దెబ్బతీసింది. దేశవ్యాప్తంగా ఇతర ప్లాంట్లలో గ్యాస్ సరఫరా లోపాలు, మరమ్మతులు, ఆర్థిక ఇబ్బందులు ఉత్పత్తి తగ్గించాయి. అంతర్జాతీయంగా చైనా ఎగుమతులపై పరిమితులు, గ్లోబల్ టెండర్ల ఆలస్యం వల్ల దిగుమతులు మందగించాయి. రైలు రేకుల కొరత, పోర్టు నిర్వహణలో ఆలస్యం కూడా సరఫరా చక్రాన్ని అడ్డుకున్నాయి. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిది అన్న ప్రశ్న ప్రాముఖ్యం సంతరించుకుంది. కేంద్రం దేశవ్యాప్తంగా ఉత్పత్తి సమృద్ధిగా ఉందని చెబుతుండగా, రాష్ట్రానికి సరిపడా కేటాయింపులు జరగకపోవడమే కారణమని రాష్ట్రం ఆరోపిస్తోంది. పరిశ్రమలు ప్లాంట్లను సమయానికి నడపకపోవడం, స్థానిక పంపిణీ వ్యవస్థలో అవకతవకలు, డీలర్ల బ్లాక్ మార్కెట్ కలిసి రైతుల సమస్యను మరింత పెంచాయి. కాబట్టి ఈ సంక్షోభానికి కేంద్రం, రాష్ట్రం, పరిశ్రమలు, స్థానిక పంపిణీ వ్యవస్థ అన్నీ బాధ్యత వహించాల్సి ఉంది. పరిష్కారం తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక చర్యల్లో ఉండాలి. తక్షణం కేంద్రం రెండు లక్షల టన్నుల అదనపు సరఫరా పంపాలి. రైల్వే రేకుల కేటాయింపుకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిలిచిపోయిన ప్లాంట్లను పునఃప్రారంభించాలి. రాష్ట్రం పంపిణీలో పారదర్శకత తీసుకువచ్చి చిన్న, మధ్యతరహా రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మధ్యకాలంలో దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి, గ్యాస్ సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవాలి, దిగుమతులను సమయానికి భద్రపరచాలి. దీర్ఘకాలికంగా యూరియా మీదే ఆధారపడకుండా సమతుల్య ఎరువుల వినియోగం, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, నానో యూరియా వంటి ఆవిష్కరణలను విస్తృతంగా ప్రోత్సహించాలి. తెలంగాణలో యూరియా కొరత తాత్కాలిక సమస్యగా కనిపించినా, దీని వెనుక ఉన్న లోపాలు వ్యవసాయ భవిష్యత్తుపై దీర్ఘకాలిక ప్రభావం చూపగలవు. రైతుల కష్టాలను రాజకీయ ఆరోపణలకు పరిమితం చేయకుండా సమన్వయం, పారదర్శకత, స్థిర వ్యూహాలతోనే ఈ సంక్షోభాన్ని అధిగమించ వచ్చు. రైతుకు సమయానికి ఎరువు అందితేనే పంట నిలుస్తుంది, పంట నిలిస్తేనే రాష్ట్రం, దేశం ఆహార భద్రత భద్రమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# కృష్ణయ్య బాల్య చేష్టలకు ప్రతీక ఉట్ల పండుగ





"వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనమ్ దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్"... జగద్గురువు, జగన్నాటక సూత్రధారి, పురాణ పురుషుడైన శ్రీకృష్ణుడు తాను స్వయంగా అవతార పురుషుడనని తెలిపిన క్రమంలో ఆయన బాల్య క్రీడలు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయి. అవి ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. అలా కృష్ణాష్టమి జన్మ సంబంధం అయినది కనుక, ఆ పురాణ పురుషుని బాల్య క్రీడలైన ఉట్ల మీది పాలు, పెరుగు, వెన్న, దొంగిలించడాన్ని, అనుకరించే జ్ఞప్తికి తెచ్చే ఉత్సవాలు నిర్వహించడం సముచితం. అందుకే జగద్గురువు అయిన శ్రీకృష్ణుడు బాల్యంలో గొల్లల ఇళ్ళల్లో పెరిగి పెరుగు, పాలు, వెన్నను దొంగిలించిన దుడుకు చేష్టలకు నిదర్శనంగా ఉట్ల పండుగ జరపడం ఆనవా యితీగా వస్తున్నది. కృష్ణాష్టమి లేదా గోకులాష్టమి పర్వదినాన్ని జన్మాష్టమి పేరుతో జరుపు కుంటారు. కృష్ణాష్టమి ఉట్ల పండుగ అనీ, ఉట్ల సంబరం అనీ, ఉట్ల జాతర లేదా తిరునాళ్ళు అనీ పిలువ బడుతుంది. ఉట్ల సంబరానికి సంబంధించి... రెండు స్తంభాలు పాతి వాటికి అడ్డంగా పైన ఒక వాసం కడతారు. స్తంభాలకు అలంకారంగా కొబ్బరి ఆకులు చుడతారు. అరటి మొట్టలు స్తంభాలకు ఆన్చి కడతారు. ఆడ్డవాసానికి మామిడి ఆకుల తోరణాలు కట్టి, కాయలు, పువ్వులు, పండ్లు వేలాడ తీస్తారు. వాసానికి నడుమను ఒక్క ఉట్టి కట్టి దానిలో ఒక పెరుగు ముంత పెడతారు. ఆ ఉట్టి పైకి క్రిందికి లాగడానికి గిలక (పుల్లీ) ఉంటుంది. ముంతలో పెరుగు పోస్తారు. డబ్బులు వేస్తారు. గొల్లలు కృష్ణవేషం ధరించి వచ్చి ఎగిరి ఆ ముంతని అందుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తారు. ఆ ముంత వారికి అందకుండా ఉట్టిని గిలక సహాయంతో కొందరు పైకి లాగుతూ, క్రిందికి దింపుతూ ఉంటారు. కొందరు స్తంభాల మొదట్లో కడవలలో నీళ్లు ఉంచుకుని వాటిని వెదురు పిచికారీ గొట్టాలతో పెరుగు బుడ్డి అందుకోబోయే వారి మీద కొడుతూ వుంటారు. రంగురంగుల బుక్కా కూడా వారి మీద బలంగా చల్లుతారు. ఈ సాంప్రదాయ ఆచారం ప్రస్తుతం కొంత మార్పుతో సామాన్య ప్రజలు కూడా పల్లె పల్లెనా అనుసరించడం చూస్తూనే ఉన్నాం. జన్మాష్టమి అంటే పిల్ల వాడైన కృష్ణుడి రూపం సంబంధించి, యావత్ భారత దేశంలో ఎంతో మంది తమ పిల్లలకు కృష్ణుడి రూప అలంకరణ చేసి మురిసి పోతుంటారు. అమ్మాయిలకు గోపికల, రాధ వేషం వేసి ఆనంద డోలికల్లో తేలి ఆడుతుంటారు. ఇళ్ల ముంగిళ్ళలో కృష్ణుడి పాదాల గుర్తులు వేసి పూజిస్తూ ఉంటారు. భాగవత కృష్ణుని బాల్యచేష్టలు నిజంగా ముగ్ధ మోహనాలు. లోకకల్యాణ కారకాలు. శ్రీకృష్ణుడు దొంగిలించినది వెన్నకాదు. గోపికల హృదయాలలోని పవిత్రమైన ప్రేమను. అశాశ్వతమైన రాగ ద్వేషాలలో చిక్కుకున్న జీవులకు ముక్తిని ప్రసాదించడమే పాలు, పెరుగు కుండలను పగుల గొట్టడం. పెరుగుతో తడిసిన పాదముద్రల ఆధారంగానే కృష్ణుణ్ణి గోపికలు పట్టుకొన గలిగారు. భగవంతుని పాదాలను ఆశ్రయిస్తే, భగవ దనుగ్రహం తప్పక దొరుకు తుందనేది పురాణ గాథల ద్వారా స్పష్టం అవుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494.**

# మిసెస్ చికాగో యూనివర్స్ గా ధర్మపురి చెందిన సౌమ్య బొజ్జా



సౌమ్య బొజ్జా 'మిసెస్ చికాగో యూనివర్స్ 2026' కిరీటాన్ని సొంతం చేసుకుని తెలుగు ప్రజలకు గర్వకారణమయ్యారు. అమెరికా న్యూజెర్సీలోని రాయల్ ఆల్బర్ట్స్ ప్యాలెస్ వేదికగా సెప్టెంబర్ 12, 2025న నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అందాల పోటీలో ఆమె విజయం సాధించడం విశేషం. చికాగోలో నివసిస్తున్నప్పటికీ ధర్మపురి మూలాలు కలిగిన సౌమ్య విజయం జగిత్యాల జిల్లాకు చెందిన ప్రజలను ఆనంద పరిచింది. అంతర్జాతీయ వేదికపై తెలుగువారి ప్రతిభను చాటిన ఆమె విజయ కథ ఒక ప్రేరణాస్పద గాథగా నిలిచింది. సౌమ్య బొజ్జా వ్యక్తిగత జీవితాన్ని పరిశీలిస్తే, ఆమె వాసు బొజ్జా సతీమణి. ధర్మపురి నివాసి, గాయత్రీ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్ ఒఝుల, శ్రీమతి సావిత్రి దంపతుల కుమార్తెగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ లో ఆఫీసర్ గా పని చేసి దివంగతులైన ధర్మపురి నివాసి బొజ్జా బాపురావు, రుక్మిణి దంపతుల చిన్న కోడలు ఆయన సౌమ్య చిన్ననాటి నుంచే చురుకు దనంతో, కళాత్మకతతో ప్రత్యేకతను సంతరించు కున్నారు. 1985 జనవరి 22న ముంబైలో జన్మించిన సౌమ్య, విద్యాభ్యాసాన్ని బెంగళూరు, నాగపూర్, ముంబై, దహనులో పూర్తి చేశారు. వివాహానంతరం అమెరికాకు వెళ్లిన ఆమె, యూనివర్సిటీ ఆఫ్ మిల్వాకీ నుండి ఫైన్ ఆర్ట్సులో బ్యాచిలర్ డిగ్రీ సాధించి తన ప్రతిభకు విద్యార్హతలను జోడించారు. ప్రస్తుతం ఆమె ఒక బహుళ జాతి సంస్థలో వెబ్ డిజైనర్‌గా పనిచేస్తూ, తన సృజనాత్మక నైపుణ్యాలను వృత్తి రంగంలో కూడా విజయవంతంగా ప్రదర్శిస్తున్నారు. అందాల పోటీల్లో సౌమ్య బొజ్జా ప్రవేశం ఒక్కసారిగా జరగలేదు. మే 4, 2025న నిర్వహించిన 'మిసెస్ భారత్ ఇల్లినాయిస్ 2025' పోటీలో కిరీటాన్ని గెలుచుకోవడం ద్వారా ఆమె ఈ రంగంలో తన ప్రతిభను నిరూపించారు. ఆ విజయమే ఆమెకు ప్రేరణగా మారి, మరింత ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడానికి దోహద పడింది. ఈసారి అంతర్జాతీయ వేదికపై 'మిసెస్ చికాగో యూనివర్స్ 2026' కిరీటం సొంతం చేసుకోవడం ద్వారా తన ప్రతిభను మరోమారు ప్రపంచానికి పరిచయం చేశారు. సౌమ్య కేవలం అందాల పోటీలతోనే ఆగిపోలేదు. చిన్నప్పటి నుంచే డ్యాన్స్, కొరియోగ్రఫీ పట్ల మక్కువ కలిగిన ఆమె, ఆ అభిరుచిని ఫ్యాషన్ రంగంలో విస్తరించారు. చికాగోలో "వస్త్రం బై సౌమ్య" పేరుతో ఒక ప్రత్యేక ఫ్యాషన్ బొటిక్ స్థాపించి, తన సృజనాత్మకతను వ్యాపార రంగంలోనూ విస్తరించారు. ఆమె రూపొందించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవడం వల్ల, ఫ్యాషన్ ప్రపంచంలోనూ ఆమె పేరు ప్రతిష్టలు పొందింది. అంతేకాక, 2025 న్యూయార్క్ ఫ్యాషన్ వీక్‌లో ఫ్యాషన్ డిజైనర్‌గా అడుగు పెట్టబోతున్నది మరొక గర్వకారణం. కుటుంబ బాధ్యతలు, వృత్తి కర్తవ్యాలు, కళాత్మక అభిరుచులతో పాటు సౌమ్య బొజ్జా సామాజిక సేవలోనూ ముందంజలో నిలుస్తున్నారు. గృహ హింస బాధితులకు సహాయం అందించడం, వారికి మానసికంగా తోడుగా నిలవడం ద్వారా ఆమె సమాజానికి కూడా తన వంతు సేవ చేస్తున్నారు. ఈ లక్షణం ఆమెను కేవలం ఒక అందాల రాణిగానే కాకుండా, మానవతా విలువలను కాపాడే స్ఫూర్తిదాయక వ్యక్తిత్వంగా నిలబెడుతోంది. సౌమ్య బొజ్జా విజయ గాథ ప్రతి ఒక్కరికీ ప్రేరణనిచ్చే విధంగా ఉంది. ప్రతిభ, కృషి, పట్టుదల, అంకితభావం కలిస్తే ఏ రంగంలోనైనా విజయాన్ని అందుకోవచ్చని ఆమె నిరూపించారు. ధర్మపురి నుంచి అమెరికా వరకు వ్యాపించిన ఆమె ప్రయాణం, సాధించిన విజయాలు సమాజంలో మహిళల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేవిగా నిలుస్తున్నాయి. ఆమె సాధనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకొందాం...

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# జీ7 సుంకాల బెదిరింపు భారత్ కోసం కొత్త సవాలు

ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుండి ప్రపంచ రాజకీయాలు, ఆర్థిక సమీకరణాలు కలతపెట్టే మార్గంలో నడుస్తున్నాయి. రష్యా దాడులను అణిచివేయాలంటే ఆ దేశంపై అంతర్జాతీయ ఒత్తిడి పెరగాలని అమెరికా దృఢంగా నమ్ముతోంది. కానీ ఆ ఒత్తిడి రష్యాకు మాత్రమే కాకుండా, రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపైనా పరోక్షంగా మోపాలని వాషింగ్టన్ భావించడం గమనార్హం.

**అమెరికా వ్యూహం – భారత్‌కు దెబ్బ?..** అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన ప్రకారం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై ప్రత్యేక టారిఫ్‌లు విధించాలన్న ఆలోచన ఇప్పుడు జీ7 అజెండాపైకి వచ్చింది. భారత్ చవక ధరలకు రష్యా చమురును కొనుగోలు చేస్తూ ఆర్థిక స్థిరత్వాన్ని కొంతవరకు నిలబెట్టుకుంటున్న సమయంలో ఇలాంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. చమురు ధరలు పెరగడం, దిగుమతి వ్యయం అధికమవడం సహజమే. ఇది నేరుగా వినియోగదారుల జేబులకు భారమవుతుంది.

**జీ7 దేశాల పాత్ర...** జీ7 సభ్య దేశాలు సుంకాల అంశంపై అమెరికా వైఖరికి సానుకూలంగా స్పందించాయన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. రష్యా యుద్ధం ముగియాలన్న లక్ష్యం సరైనదే కావచ్చు. కానీ దాని భారాన్ని భారత్, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై మోపడం ఎంతవరకు సమంజసం? అంతర్జాతీయ వాణిజ్యం రాజకీయ ఆయుధంగా మారిపోతే, ప్రపంచ స్థాయిలో కొత్త విభజనలు తప్పవు.

**గతంలోనూ ఇదే ప్రతిపాదన...** ట్రంప్ ఇంతకు ముందు ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాల ముందు ఇదే ప్రతిపాదన ఉంచినప్పటికీ, భిన్నాభిప్రాయాల కారణంగా అది ముందుకు సాగలేదు. ఇప్పుడు జీ7 దేశాలు అమెరికాకు మద్దతు ఇస్తున్న సంకేతాలు రావడం, రాబోయే కాలంలో మరింత ఆర్థిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు.

**భారత్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు...** భారతదేశం తన శక్తి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ వ్యూహాలను రూపొందించుకోవాలి. రష్యా చమురు ఆధారంపై కొంత వరకు తగ్గించే దిశగా ప్రయత్నాలు చేయక తప్పదు. అంతేకాదు, జీ7 ఒత్తిడిని ఎదుర్కొనేందుకు డిప్లొమాటిక్‌గా బలమైన వాదనను ప్రపంచ వేదికలపై ఉంచాలి. జీ7 సుంకాల బెదిరింపు కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది భౌగోళిక రాజకీయాల కొత్త సవాలు. అమెరికా ప్రయోజనాల కోసం రూపొందిన ఈ వ్యూహం భారత్‌కు కొత్త ఆర్థిక భారంగా మారే అవకాశం ఉంది. ప్రశ్న ఏమిటంటే రష్యాను అణచడంలో ప్రపంచం ఏకతాటిపైకి రావడం అవసరమేమో కానీ, దాని ఖరీదు భారత్ వంటి దేశాలే చెల్లించాలా? అన్నది ఆలోచించాలి.

# భూమి రక్షణ కవచాన్ని పరి రక్షించు కుందాం - సెప్టెంబర్ 16... ఓజోన్ దినోత్సవం

భూమిని ప్రమాదకరమైన కిరణాల నుంచి కాపాడే రక్షణ కవచం ఓజోన్. మరి అలాంటి ఓజోన్‌కే రక్షణ లేకుండా పోతుండడం బాధాకరం. ఈ విషయం భవిష్యత్ తరాలను భయ పెడుతుండడం అత్యంత సహజం. ఓజోన్ పొర గురించి సైన్స్ విద్యార్థులకు చాలా బాగా తెలుసు. మిగిలిన వారికే దీని విలువ గురించి, దీని ప్రభావం గురించి తెలియక చాలా 'పొర'పాట్లు చేస్తున్నారు. వీటిపై అందరికీ అవగాహన కలిగించేందుకు, ఓజోన్ పొరను కాపాడు కోవడంతో పాటు ఇతర బలమైన కారణాల రీత్యా సెప్టెంబర్ 16వ తేదీని ఓజోన్ డే (ఓజోన్ దినోత్సవం)గా నిర్ణయించారు. ఇంతకీ ఓజోన్ పొర అంటే ఏమిటి.. దాన్ని ఎందుకు జాగ్రత్తగా కాపాడుకోవాలో తెలుసుకుందాం. భూమికి రక్షణ కవచంగా నిలిచేది 'ఓజోన్ పొర' అని సైంటిస్టులు తేల్చారు. ఈ భూమిపై జీవరాశి ఉండటానికి ప్రధాన కారణం ఓజోనే. ఇది భూమి చుట్టూ ఒక గొడుగులా ఆవరించి కవచంలా ఉండి మనల్ని కాపాడుతుంది. ఈ పొర గనుక లేకపోతే భూమి అగ్ని గుండంగా మారి ఉండేది. ఓజోన్ అనేది మూడు పరమాణువులతో కూడిన ఆక్సిజన్ అణువు (ట్రై అటామిక్ ఆక్సిజన్ మాలిక్యూర్). ఇందులో ఉన్న అన్ని ఆక్సిజన్ పరమాణువులు రసాయనికంగా ఒకే లక్షణం ఉన్నవి కావు. కానీ మనం శ్వాస క్రియలో పీల్చే సాధారణ ద్విపరమాణుక ఆక్సిజన్ అణువులో మాత్రం రెండు పరమాణువులు ఒకే విధమైనవి. భూవాతావరణాన్ని నేలమీద నుండి పైకి పోయేకొద్దీ అక్కడున్న భౌతిక ధర్మాల ఆధారంగా వీటిని కొన్ని పొరలుగా విభజించారు. నేలకు దగ్గరగా 20 కిలోమీటర్ల లోపే ఉన్న పొరను "ట్రొపోస్ఫియర్" అని, 20 కిలోమీటర్ల నుండి 50 కిలోమీటర్ల మధ్యన ఉన్న పొరను "స్ట్రాటో ఎక్సోస్పియర్ (స్ట్రాటో ఆవారణము) అని, ఆ తర్వాత "మీసో స్పియర్", "థర్మోస్పియర్", "ఎక్సోస్పియర్" అనే పొరలు సుమారు 5 వందల కిలో మీటర్ల వరకు వివిధ మార్గాల్లో విస్తరించి ఉన్నాయి. మన సాధారణ ఆక్సిజన్ అణువులు స్ట్రాటోస్పియర్లో ఓజోన్ అణువులుగా మారతాయి. ఇంత కీలకమైన పొరకు 1980లో రంధ్రం పడినట్లు సైంటిస్టులు గుర్తించారు. ఆ సమయంలోనే సూర్య కిరణాలు భూమి మీద నేరుగా తాకుతున్న విషయం బయట పడింది. అప్పటినుండి సైంటిస్టులు దీన్ని పరిరక్షించేందుకు సెప్టెంబర్ 16న దాదాపు 24 దేశాల ప్రతినిధులు మాంట్రియల్ నగరంలో సమావేశమై, ఓజోన్ పొర రక్షణ గురించి చర్చించారు. ఇందులో సుమారు 100 రకాల రసాయనాల వాడకాన్ని 2030 నాటికి అభివృద్ధి చెందిన, 2040 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పూర్తిగా అరికట్టడమే లక్ష్యం. 1987 సెప్టెంబర్ 16న మాంట్రియల్ ప్రోటోకోల్ పైన ప్రపంచ దేశాలు సంతకం చేశాయి. ఈ ఒప్పందంపై సంతకం చేసిన తేదీకి




గుర్తుగా 'ఓజోన్ లేయర్ డే'ని నిర్వహించాలని తీర్మానించారు. భూమి మీద కాలుష్యం దెబ్బంటున్న కారణంగా ఓజోన్ పొరను పరిరక్షించడం లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి ఏటా సెప్టెంబర్ 16న 'ప్రపంచ ఓజోన్ పొర సంరక్షణ రోజు'గా పాటించాలని 1994లో ప్రకటించింది. సూర్యుని నుండి విడుదలయ్యే సూర్యరశ్మిలో అతినీల లోహిత కిరణాలను అడ్డుకుంటూ వాటి నుంచి భూమిపై ఉన్న జీవజాలాన్ని రక్షిస్తున్నదే ఓజోన్ పొర. ప్రోటో ఆవరణానికి కింద 15 నుంచి 50 కి.మీ మందంగా ఉండే పొరనే ఓజోను పొరగా పిలుస్తారు. ఇది అతినీల లోహిత కిరణాలను వడపోసి సూర్యరశ్మిని భూమిపైకి పంపుతుంది. ఇది భూమి చుట్టూ వేసి గొడుగులా ఆవరించి ఉండి, ఒక కవచంలా కాపాడుతుంది. ఇప్పుడు ఓజోను పొర మానవ తప్పిదాలకు కనుమరుగై పోతుంది. అధిక ఇంధన వాడకం, మితి మీరిన రసాయనాలు ఉపయోగించడం, చెట్లు నరికి వేయడం, వంటి అంశాలు ఓజోన్ పొరను నాశనం చేస్తున్నాయి. ఈ ఓజోన్ పొర క్షీణత వల్ల మూలకణ మరియు పొలుసల కణ క్యాన్సర్లు, ప్రాణాంతక పుట్ట కురుపు, కంటి శుక్లాలు వంటి రోగాల బారిన ప్రజలు పడే అవకాశం ఉంది. కాలుష్య కారకాల నుండి ఓజోన్‌ను రక్షించేందుకు ఐక్యరాజ్య సమితి కొన్ని ప్రణాళికలు రూపొందించింది. దానినే మాంట్రియల్ ప్రోటోకోల్ అంటారు. స్ట్రాటోస్ఫియర్ పొరలో గాలిలోని ఆక్సిజన్ అణువులు ఓజోన్ అణువులుగా మారుతుంటాయి. అయితే ఆక్సిజన్ అణువులు ఓజోన్ అణువులుగా మారాలంటే అతి నీలలోహిత కిరణాలు కావాలి. సూర్యకాంతిలో దృశ్యకాంతితో పాటు ఎంతో తీవ్రతతో అతినీల లోహిత కాంతి, పరారుణ కాంతి కూడా కలిసి ఉంటుంది. అయితే అందులో అతి నీలలోహిత కాంతి బాగా శక్తివంతమైంది. కాబట్టి జీవ జాతులకు ప్రమాద కరమైంది కూడా.

అలాంటి ప్రమాదకర అతినీల లోహిత కాంతిని ఆక్సిజన్ అణువులు శోషించు కోవడం ద్వారా ఓజోన్ అణువులుగా మారతాయి. అంటే ఓజోన్ ఏర్పడ్డం వల్ల అతినీల లోహిత కాంతి భూమి వైపు చేరే మోతాదు గణనీయంగా తగ్గిపోతుంది. అదే సమయంలో ఓజోన్ కూడా తిరిగి ఆక్సిజన్‌గా వియోగం చెందుతుంది. అందుకోసం కూడా తన ఉద్దీపన కొరకై అతి నీలలోహిత కాంతి అవసరంబీ అంటే ఓజోన్ తయారీలో లాగానే దాని విఘటనంలో కూడా అతి నీలలోహిత కాంతి ఖర్చవుతుంది. అంటే సూర్యుని కాంతిలోని ప్రమాదకర అతినీల లోహిత కాంతిని ఓజోన్ తన ఉత్పత్తి ప్రక్రియలోనూ, తన విఘటన ప్రక్రియలోనూ ఉపయోగించు కుంటోందన్న మాట. మరో మాటలో చెప్పాలంటే ఓజోన్ ఉనికి భూమి మీద ఉన్న జీవ జాలానికి డాలు లేదా కవచంలాగా ఉపయోగపడ్తుంది. ఓజోన్ పొర తనకున్న సహజ మందాన్ని ఏదైనా కారణం వల్ల పోగొట్టుకొన్నా, లేదా పూర్తిగా వినాశనం చెందినా ఓజోన్ పొరకు చిల్లు ఏర్పడింది అంటాము. ఓజోన్ తరిగిపోయే క్రమంలో ఏర్పడేది ఆక్సిజన్ అణువులు, ఆక్సిజన్ నవజాతపరమాణువులు. ఇవి తిరిగి ఓజోన్‌గా మారగలవు. అయితే ఓజోన్ విఘటనం ఈ విధంగా కాకుండా ఇతర మార్గాల్లో ధ్వంసం అయితే %ూ%2 అణువులు, %ూ% పరమాణువులు ఏర్పడవు. ఈ రోజుల్లో మనం తీసుకునే ప్రతీ నిర్ణయమూ ఓజోన్ పొరను దెబ్బ తీస్తోంది. భూతాపం పెరిగినా, వానలు కురవక పోయినా, అడవులు తగ్గిపోయినా, కాలుష్యం ఎక్కువైనా... ఇలాంటి అనర్థాలన్నీ ఓజోన్ పొరను దెబ్బతీసేవే. పాలపై మీగడలా... ఈ ఓజోన్ అనే వాయువు... సమస్యేమిటంటే... పెరుగుతున్న భూతాపం వల్ల నానాటికీ ఓజోన్ వాయువు తగ్గిపోతోంది. ఇలాగే పొర విచ్ఛిన్నం అవుతూ పోతే... కోట్ల మంది ప్రజలు, జంతువులు, పక్షులు, చెట్లు అన్నిటి పైనా వ్యతిరేక ప్రభావం పడుతుంది. చర్మంపై తీవ్రమైన సూర్య కిరణాలు పడి... కేన్సర్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. అంతేకాదు... పిల్లలు పుట్టే అవకాశాలు కూడా తగ్గిపోతాయి. ఓజోన్ పరరక్షణ కోసం... భూతాపాన్ని తగ్గించేందుకు వీలయ్యే అన్ని చర్యలూ చేపట్టాలి. పర్యావరణాన్ని రక్షించే చర్యలు తీసుకోవాలి. చెట్లు నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం బలమైన చట్టాలు తేవాలి. అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాళ్లూ నిర్మించేటప్పుడే... 33 శాతం మొక్కలు, చెట్లు పెంచేందుకు స్థలం ఉండేలా నిబంధనలు తేవాలి. సంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచడం ద్వారా... భూతాపాన్ని తగ్గిస్తూ... ఓజోన్ పొరను కాపాడేందుకు వీలవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సంగీత సామ్రాజ్ఞి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి - సెప్టెంబర్ 16...ఎం. ఎస్. జయంతి




'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి లేదా ఎం.ఎస్.గా పేరుగాంచిన మదురై షణ్ముఖ వడివు సుబ్బులక్ష్మి (1916 సెప్టెంబర్ 16 %–% 2004 డిసెంబర్ 11) కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని, నటి. ఆమె భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పురస్కారాన్ని పొందిన మొట్ట మొదటి సంగీత కళాకారిణి. ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి. తన జీవిత కాలంలో సంగీత ప్రపంచంలో బహుశా ఎవరూ సాధించని రికార్డులు, రివార్డులు ఆమె పాదాక్రాంత మయినాయి. ఆమె సంగీత ప్రపంచంలో ఎక్కని 'శిఖరం లేదు, పొందని బహుమానం లేదు. అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఎన్నో సుబ్బులక్ష్మి గాత్రానికి దాసోహ మంటూ ఆమె ముందు వాలాయి. తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో న్యాయవాది సుబ్రహ్మణ్య అయ్యర్, వీణావాద్య విద్యాంసురాలు షణ్ముఖవడివు అమ్మాళ్ కు 1916 సెప్టెంబర్ 16 న జన్మించింది. చిన్నప్పుడు ఆమెను ముద్దుగా కుంజమ్మ అని పిలిచేవారు. తల్లి ఆమె తొలి గురువుగా 10 ఏళ్ళ ప్రాయం నుంచే సంగీత ప్రస్థానం ప్రారంభమైంది. సుబ్బులక్ష్మి శుద్ధ సంప్రదాయ కుటుంబంలో జన్మించి, భారతీయ సంప్రదాయాన్ని, సంస్కారాన్ని అమితంగా ప్రేమించింది. చదువు మానేసి అక్క, అన్నదమ్ములతో కలసి సంగీత సాధన చేసి, సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ వద్ద సంగీతంలో శిక్షణ పొంది తన ప్రతిభకు స్పష్టమైన రూపునిచ్చి, తదనంతర కాలంలో జాతి గర్వించతగ్గ అంతర్జాతీయ సంగీత సామ్రాజ్ఞిగా ఎదిగింది. 1926 లో 10 సంవత్సరాల వయసులో గుడిలో పాటలు పాడడంతో తన తొలి సంగీత ప్రదర్శన మొదలైంది. నాటి నుండి సంగీత ప్రియులను తన మధుర స్వరంతో సంగీతంలో ఓలలాడిస్తూనే ఉంది. అప్పుడే తను మొట్టమొదటి సారిగా హెచ్.ఎం.వి కోసం ఆల్బమ్ అందించింది. సుబ్బులక్ష్మిలోని ప్రతిభను గుర్తించిన తల్లి మధురై నుంచి చెన్నైకి మకాం మార్చటంతో ఆమె జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ఆమె 1933 లో మద్రాస్ సంగీత అకాడెమీలో తన మొట్ట మొదటి సంగీత కచేరీకి శ్రీకారం చుట్టింది. ఆనంద వికటన్ పత్రిక సీనియర్ ఎగ్జిక్యూటివ్, స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది అయిన త్యాగరాజన్ సదాశివన్ తో 1940 లో ఆమె ప్రేమవివాహం అయింది. 1938 సంవత్సరంలో "సేవా సదనం" సినిమా ద్వారా సుబ్బులక్ష్మి సినీ సంగీత ప్రపంచంలో అడుగు పెట్టింది. తమిళ సినిమాలలో గాయనిగా తెరపై కూడా కనిపించి ప్రేక్షకులను అలరించింది. 1940 వ సంవత్సరంలో "శకుంతలై" అన్న తమిళ సినిమాలో ఆమె తొలిసారిగా గాయక నటిగా తెరపై కనిపించింది. 1945 వ సంవత్సరంలో నిర్మించ బడిన 'మీరా' చిత్రం హిందీలో పునర్నిర్మించ బడి కూడా విజయవంతం కావడంతో సుబ్బులక్ష్మి పేరు భారతదేశ మంతటికీ సుపరిచిత మయింది. 'మీరా' సినిమాలోని ఆమె నటనకు, గాన మాధుర్యానికి జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు లభించాయి. అది ఆమె ఆఖరి సినిమా. నుదుటి మీద ఎర్రటి కుంకుమ బొట్టు, చేతుల నిండా గాజులు, కళ్లకు నిండుగా కాటుక, కొప్పు నిండా మల్లెపూలు, చేతిలో తంబూర పట్టుకొని నిండైన విగ్రహంతో, భారతీయతకు ప్రతీకగా ఒంటినిండా పట్టుచీరతో సంగీత కచేరీ ప్రారంభించగానే శ్రోతలు ఆమె గాన లహరిలో మునిగిపోయే వారు. కర్ణాటక గానం ధ్యానంలా సాగేది. సుబ్బు లక్ష్మి పాడుతుంటే స్వయంగా అమ్మవారే పాడుతున్నట్లు భావించేవారు. పదికి పైగా భాషల్లో ఎన్నో కృతులను, కీర్తనలను, శాస్త్రీయ, లలిత గీతాలను, భజనలు, జానపద గేయాలు, మరాఠీలో అభంగాలు, దేశభక్తి గేయాలు కూడా పాడారు. ఏ భాషలో పాడినా అదే తన మాతృభాష అన్నట్లుగా స్పష్టమైన భాషా నుడికారంతో భావయుక్తంగా ఆలపించడం సుబ్బులక్ష్మి ప్రత్యేకత. శృతి, లయ, ఆలపనతో పాటు భావాన్ని, భక్తిని సమ పాళ్ళలో వ్యక్తీకరించడంతో పాటు పామరులను సైతం శాస్త్రీయ సంగీతంతో మెప్పించడం ఆమెకు మాత్రమే సాధ్యం. సంక్లిష్ట సమాసాలతో కూడిన సంస్కృత భాషలోని భావం దెబ్బతినకుండా అలవోకగా ఆలపించడం ఆమె సాధన ద్వారా సాధించుకున్న గొప్ప వరం. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి వంటి సంగీత దిగ్గజాలు రూపొందించిన గీతాలకు సుబ్బులక్ష్మి తన గాత్రం ద్వారా ప్రాణం పోశారు. మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన "వైష్ణవ జనతో, తేనె కహెరే, జో పీర్ పరాయీ జానేరే" వంటి గీతాలకు ప్రాణం పోసిన వ్యక్తి ఆమె. గాంధీజీ ప్రార్థన సమయములో ఆ పాటను పాడించుకునే వారు. భజనను మొక్కుబడిగా పాడటం వేరు, అలా పాడుతూ పూర్తిగా దైవ చింతనలో లీనమవడం వేరు అని మహాత్మా గాంధీ ఆమెను ప్రశంసించారు. ఐక్య రాజ్య సమితిలో పాడిన గాయనిగా చరిత్ర సృష్టించారు సుబ్బులక్ష్మి. ఆ సందర్భంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక సుబ్బులక్ష్మిని ప్రశంసిస్తూ తన సంగీతంతో సందేశాన్ని వినిపించగల సమర్థురాలిగా పేర్కొన్నాయి. రాయల్ ఆల్బర్ట్ హాల్, లండన్లో ప్రదర్శన యిచ్చినపుడు ఇంగ్లండ్ రాణిని కూడా తన్మయురాలిని చేసి ఆమె ప్రశంసలు పొందింది. భారత ప్రభుత్వం 1954 పద్మభూషణ్ బిరుదు, సంగీత కళానిధి ది మ్యూజిక్ అకాడమి చెన్నై, తమిళనాడు 1965 మొట్ట మొదటి సారిగా అందుకున్న గాయకురాలు. డాక్టరేట్ శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం అంధ్రప్రదేశ్ 1971, డాక్టరేట్ ఢిల్లీ యూనివర్సిటి ఢిల్లీ 1974 , రామన్ మెగసెసే పురస్కారం, ఫిలిప్పీన్స్ ప్రభుత్వం 1974, పద్మవిభూషణ్ భారత ప్రభుత్వం 1975, డాక్టరేట్ బెనారస్ యూనివర్సిటీ ఉత్తర ప్రదేశ్ 1980, డాక్టరేట్ యూనివర్సిటి ఆఫ్ మద్రాస్ తమిళనాడు 1987, కాళీదాస్ సన్మాన్ మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1988 , ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా అవార్డు లాంటివి ఎన్నో ఆమెను వరించాయి. అత్యున్నత పురస్కారం భారతరత్నను 1998లో మొట్టమొదటి సారిగా అందుకుని చరిత్ర సృష్టించిన స్త్రీ. జీవిత సాఫల్య పురస్కారం ఢిల్లీ ప్రభుత్వం 2004 ఎం.ఎస్.సుబ్బులక్ష్మి తనకు పురస్కారం క్రింద వచ్చిన 11 లక్షల రూపాయల నగదును స్వర్గీయ కంచి ఆచార్య చంద్ర శేఖరేంద్ర సరస్వతీ స్మృతి కట్టడానికి విరాళ మిచ్చారు. ఇంటింటా పవిత్ర సుమ సుగంధాలను వెదజల్లిన ' సుప్రభాత ' గీతమై ప్రతి ఇంటా ఆధ్యాత్మిక భావనలను విరజిమ్మిన విష్ణు సహస్రనామ నిత్యస్తోత్రమై ఈ ధరణీతలాన్ని కొన్ని దశాబ్దాల పాటు పులకింప చేసిన కర్ణాటక శాస్త్రీయ సంగీత స్వరధార 2004, డిసెంబర్ 11న శాశ్వతంగా మూగబోయింది. కాని ఆమె గొంతు మాత్రం విశ్వం ఉన్నంత కాలం ప్రపంచం అంతా మారు మోగుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494.**

# తొలి తెలుగు టాకీ చిత్రానికి 94 ఏళ్లు - సెప్టెంబర్ 15, 1931న విడుదలైన తొలి భక్తప్రహ్లాద

తెలుగు తొలి టాకీ చిత్రం భక్త ప్రహ్లాద విడుదలై తొమ్మిది దశాబ్దాలు అయింది. తెలుగునాట పౌరాణిక నాటకాల ప్రభావం ఎక్కువగా ఉండటంతో సురభి బృందం ప్రదర్శిస్తున్న 'భక్తప్రహ్లాద' నాటక బృందంతో 1931లో తొలి టాకీ చిత్రంగా నిర్మించారు. హిందీలో తొలి టాకీ 'ఆలం ఆరా' అర్దేషిర్ ఇరానీ తీశారు. ఆయనకు తెలుగులో, తమిళంలోనూ కూడా చిత్రాలు నిర్మించాలని కోరిక కలిగింది. హెచ్.ఎమ్.రెడ్డి తెలుగువాడు గనక తెలుగు 'భక్తప్రహ్లాద'ను , తమిళ 'కాళిదాసు'ని ఆయనకు అప్పగించారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు రచించిన "భక్త ప్రహ్లాద" నాటకాన్ని సురభి నాటక సమాజం వారు వేస్తుండేవారు. ఆ నాటక సమాజం వారిని బొంబాయి పిలిపించి, వారితో చర్చించి, సినిమా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. 'భక్త ప్రహ్లాద' చిత్రం హెచ్.ఎం. రెడ్డి దర్శకత్వంలో, వల్లూరు వెంకటసుబ్బారావు హిరణ్య కశిపుడిగా నటించారు. తర్వాత ఈయన 'మునిపల్లె సుబ్బయ్య'గా పిలవబడ్డారు. సురభి సమాజంలో అత్యధిక పారితోషికం తీసుకునే వి.వి. సుబ్బారావు హెచ్.ఎం. రెడ్డి హిరణ్యకశిపునిగా నటించేందుకు ఒప్పించారు. ఆనాటి రంస్థల ప్రముఖుడు పి.ఎస్.ఆర్. ఆంజనేయులు ఈ చిత్రం రూపకల్పనలో సహకరించారు. అలాగే 'భక్త ప్రహ్లాద' చిత్రంలో లీలావతి పాత్రను అనువజ్ఞురాలైన సురభి కమలాబాయి పోషించారు. తెలుగు తెర తొలి కథానాయికగా కమలాబాయి ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. టైటిల్ పాత్రను సురభి కళాకారులైన రాములమ్మ, రంగారావుల ఏకైక సంతానమైన మాస్టర్ కృష్ణారావు పోషించారు. కృష్ణారావుకు ఇదే తొలి, చివరి సినిమా కూడా. ఇంద్రునిగా దొరస్వామి నాయుడు, బ్రహ్మగానూ, చండామార్కుల్లో ఒకనిగానూ చిత్రపు నరసింహారావు నటించారు. ప్రహ్లాదుని సహాధ్యాయి అయిన ఓ మొద్దబ్బాయిగా తర్వాతి కాలంలో దర్శకునిగా మారిన ఎల్.వి.ప్రసాద్ నటించారు. ఎల్.వి.ప్రసాద్ మొట్టమొదటి తమిళ టాకీ కాళిదాసులో కూడా నటించారు. హెచ్.ఆర్.పద్మనాభశాస్త్రి, సంగీతంబీ ... .చందాల కేశవదాసు, గీత రచన... గోవర్ధన్ భాయి పటేల్, ఛాయాగ్రహణం...భారత్ మూవీ టోన్, నిర్మాణ సంస్థగా 108 నిమిషాల నిడివి గల చిత్రం సెప్టెంబర్ 15, 1931న విడుదల అయింది. ఆ రోజులలో నటీనటులంతా దాదాపు 20 గంటలు పనిచేస్తుండేవారు. రోజు మొత్తం మీద ఏ మూడు నాలుగు గంటలో వారికి విశ్రాంతి దొరికేది. కమలాభాయి ఆచిత్రంలో నటించడానికి ముందు మాట్లాడుకున్న పారితోషికం (500) రూపాయలు కాగా, అవి ఆమె ఖర్చులకే అక్కడ సరిపోయాయి. ఆవిడ అవస్థ చూసి చిత్ర నిర్మాత కమలాబాయికి ప్రత్యేకంగా వెయ్యి నూట పదహార్లు, రైలు ఖర్చులు ఇచ్చి పంపించారు. ఒరిజినల్ 'భక్త ప్రహ్లాద' నాటకంలోని పద్యాలు, పాటలు ఉపయోగించు కోవడమే కాకుండా చందాల కేశవదాసు ఈ చిత్రం కోసం పాటలను, దర్శకులు హెచ్.ఎం. రెడ్డి ప్రత్యేకంగా రాయించారు. 'పరితాప భారంబు భరియింప తగునా, తనయా ఇటులను తగదుర పలుక' పాటలను కమలాభాయి పైన, 'భీకరమగు నా ప్రతాపంబునకు భీతిలేక అటు చూసేదవా' అనే పాటను వల్లూరు వెంకట సుబ్బారావుపై చిత్రీకరించారు. ఈ పాటలను రాసిన చందాల కేశవదాసు తొలి గీత రచయితగా తెలుగు చలన చరిత్రలో స్థానం సంపాదించు కున్నారు. అలా నిర్మిత మైన భక్తప్రహ్లాద తొలి తెలుగు టాకీ చిత్రం సెప్టెంబర్ 15, 1931న విడుదలైనది. అప్పుడు




చిత్ర నిర్మాణ వ్యయం 20వేల రూపాయలు. చిత్రం సంపూర్ణ విజయవంత మయ్యింది. 1942 లో కూడా ఇదే పేరుతో తెలుగులో సినిమాల వచ్చింది. 1942 లో శోభనాచల ప్రొడక్షన్స్ వారు చిత్రపు నారాయణరావు దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మించారు. అది తెలుగులో వచ్చిన రెండవ చిత్రం. మరింత ఆధునిక సాంకేతిక విలువలతో కూడుకుని ఉంది. వేమూరి గగ్గయ్య, గరికపాటి వరలక్ష్మి, రాజేశ్వరి, నారాయణ రావులు ప్రధాన పాత్రలు పోషించారు. భక్త ప్రహ్లాద 1967 లో చిత్రపు నారాయణ మూర్తి దర్శకత్వంలో వచ్చిన మూడవ సినిమాలో హిరణ్య కశిపుడిగా ఎస్.వి. రంగారావు, ప్రహ్లాదుడిగా రోజారమణి, ప్రహ్లాదుడి తల్లిగా అంజలీ దేవి నటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494.**

చురకలు



# చరిత్ర ఘనం.. వసతి గగనం

వేములవాడ : పై చిత్రంలో కనిపిస్తున్న భవనంలో నాలుగేళ్ల క్రితం వరకు ఆలయానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర సంస్కృత కళాశాల కొనసాగేది. ఈ భవనం పెచ్చులూడుతుందని పరిశీలించిన అధికారులు కళాశాలను ఖాళీ చేయించి దేవస్థానానికి చెందిన జాతర గ్రౌండ్‌లోని డార్మెంటరీ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ శిథిల భవనంలో దాదాపు 40 వసతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతం కావడంతో కమర్షియల్ భవన నిర్మాణం చేయాలని నిర్ణయించి అలానే వదిలేశారు. అప్పటినుంచి నిరుపయోగంగా ఉంది.

**అధిక అద్దెలతో ఆందోళన**

రాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి ఆలయ వసతి గదులు లభించక ప్రైవేటు లాడ్జిల్లో అధికంగా అద్దెలు చెల్లించి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆలయంలో జరిగే వివిధ వేడుకల సందర్భంగా భక్తులకు గదులు లభించడం గగనంగా మారింది. భీమేశ్వరసదన్, పార్వతీపురం, శ్రీ లక్ష్మీగణపతి కాంప్లెక్స్, నందీశ్వర, అమ్మవారి కాంప్లెక్స్‌లలో దాదాపు 436 వరకు గదులున్నాయి. ప్రతిరోజు స్వామివారి దర్శనానికి వేలల్లో వచ్చేవారికి ఇవి ఏమాత్రం సరిపోవడంలేదు.



**ప్రతిపాదనలకే పరిమితం**

ఆలయానికి చెందిన శంకరపురం కాంప్లెక్స్ శిథిలమైన ప్రాంతంలో నూతనంగా వసతి గదులు నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలో భాగంగా గదులు నిర్మించాలని ఈ కాంప్లెక్స్‌ను పర్యాటక శాఖకు అప్పగించారు. దాదాపు రూ.4 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. ఇందుకు సంబంధించి అధికారులు ఎన్‌వోసీ కూడా ఇచ్చారు. అయినా ప్రతిపాదన దశలోనే నిలిచిపోవడంతో కాంప్లెక్స్ వలనపడింది. ముఖ్యంగా రాజన్న ఆలయంలో మహాశివరాత్రి, శివ కల్యాణం, ఇతరత్రా ఉత్సవాల సందర్భంలో ప్రైవేటు వసతి గదుల నిర్వాహకులు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం**

పర్యాటక శాఖ అధికారులకు ఆలయం ద్వారా శంకరపురం కాంప్లెక్స్ వద్ద కొత్తగా వసతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. సంస్కృత కళాశాల వద్ద ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలనేది పరిశీలిస్తున్నాం. రెండు నెలల్లో కార్యాచరణ రూపొందిస్తాం. రాజేశ్, ఆలయ ఈఈ వేములవాడ

# బస్తాపై.. నిఘానేత్రం

నల్గొండే: జిల్లావ్యాప్తంగా యూరియా కొరత రైతులను వేధిస్తోంది. ఎరువుల కోసం తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు యూరియా కొరత ఎందుకు వచ్చిందనే దానిపై వ్యవసాయశాఖ అధికారులు దృష్టి సారించారు. సాధారణంగా ఎకరం భూమిలో ఏ పంట సాగు చేసినా.. రెండు నుంచి మూడు బస్తాల యూరియా అవసరం అవుతుంది. ఈ లెక్కన పదెకరాలు ఉన్న రైతు సగటున 25 సంచులు వినియోగిస్తారు. కానీ కొంతమంది ఎక్కువ మొత్తంలో యూరియా కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. కొనుగోళ్లపై విచారణ జరపాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో.. నెలలో 20 బస్తాల కంటే ఎక్కువ కొనుగోలు చేసిన రైతుల జాబితా తీసుకొని.. రైతుకు ఎంత భూమి ఉంది.. ఏయే పంటలు వేశారు.. ఎక్కువ మొత్తంలో ఎందుకు తీసుకున్నారో అనే అంశాలపై విచారణ చేస్తున్నారు.

**ఇదీ విధానం..**

ఎరువుల విక్రయాలపై పర్యవేక్షణతో పాటు అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్



(ఎంఎఫ్ఎంఎస్)ను ప్రవేశపెట్టింది. వ్యాపారులతో పాటు సంఘాలకు పాయింట్ ఆఫ్ సేల్(పీఓఎస్) మిషన్లు సరఫరా చేశారు. ఇందులో రైతుల ఆధార్ నంబర్ నమోదు చేసి వారి వేలిముద్రలు తీసుకొని ఎరువుల విక్రయిస్తారు.

ఇలా జరుగుతోంది

ఎరువులు తీసుకెళ్లేందుకు రైతు రాకపోయినా.. ఆధార్‌కార్డు నంబరు నమోదు చేస్తే వారి చరవాణికి ఓటీపీ వెళ్తుంది. ఇది చెబితే యూరియా ఇస్తున్నారు. దీంతో రైతుల పేరిట కొందరు తీసుకెళ్తున్నారు. ఒక్కో రైతు ఒక రోజులో 20కి మించి, సీజన్ మొత్తంలో 50 సంచులకు మించి తీసుకునే వీల్లేదు. ఈ మేరకు నెలవారీగా ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసే 20 మంది రైతుల జాబితాను తీసుకొని విచారణ జరిపేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

**సమాచారం తీసుకున్నాం**

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి నల్గొండ

ఎరువుల విక్రయాలపై విచారణకు ఆదేశాలు వచ్చాయి. ఎక్కువ మొత్తంలో యూరియా తీసుకున్న రైతులపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఏవోలకు సూచించాం. యూరియా పంపిణీలో వ్యవసాయాధికారులు పాల్గొంటున్నందున విచారణలో జాప్యం జరిగే అవకాశం ఉంది.

# ఇస్తినమ్మా.. కమీషన్, తీసుకుంటినమ్మా.. కమీషన్



కరీంనగర్ : ఏడాది కిందట కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తలకు గాయమైన వ్యక్తిని తీసుకు వచ్చిన అంబులెన్స్ డ్రైవర్‌ను మంచిర్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడి వైద్యులు సూచించిన ఆస్పత్రికి కాకుండా కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి రోగిని తీసుకొచ్చాడు. న్యూరో సంబంధిత వైద్యులు అందులో లేక చికిత్సలో జరిగిన జాప్యంపై బాధితుడి సంబంధీకులిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ప్రసవం కోసం శస్త్రచికిత్సకు తీసుకెళ్లే సమయంలో డెలివరీ కిట్ పేరిట రూ.7-8 వేల సామగ్రిని కొనిపిస్తున్నారు. మెడికల్ దుకాణం నుంచి లోపలికి వెళ్లిన ఆ కిట్ తిరిగి అదే దుకాణానికి చేరుతుందనే ఆరోపణలున్నాయి. ఎముకలు, నరాలు, మెదడు సంబంధిత ఏ చిన్న బాధతో వెళ్లినా రక్త, వత్ర పరీక్షలతోపాటు సీటీ స్కానింగ్, ఎంఆర్ఐ చేయిస్తున్నారని రోగులు వాపోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,019 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా చాలా వాటిల్లో వైద్య సేవలు ఇష్టారాజ్యమనే పంథా కనిపిస్తోంది. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడమే కాకుండా అవసరమున్నా లేకున్నా వ్యాధి నిర్ధారణల పేరిట పలు రకాల పరీక్షలు, స్కానింగ్‌లు చేయిస్తున్నాయి. చిన్న నొప్పి, జ్వరం కారణమేదైనా అయిదారు రకాల రక్త పరీక్షలతోపాటు స్కానింగ్‌ల రూపంలో రోగి నుంచి కనిష్ఠంగా రూ.2 వేలు భారం వేస్తున్నారు. ఇక ఇన్ పేషెంట్‌లుగా చేరిన వారి నుంచి గదుల అద్దె, చికిత్స ఖర్చును వేలల్లో వేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో ముందుగానే రూ.25 నుంచి రూ.50 వేలు కడితేనే ఆస్పత్రిలో చేర్చుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తేనే ఇలాంటి అక్రమ వసూళ్లకు తెరపడుతుంది.

తమ వద్దకు వచ్చే రోగులను వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సిఫార్సు చేస్తే ఆ కేంద్రాలు వైద్యులకు కొంత కమీషన్ అందజేస్తుంటాయి. తమ వ్యాపారం కోసం నిర్వాహకులు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అయితే కొందరు వైద్యులు అవసరం లేకున్నా పరీక్షలు రాస్తూ.. ల్యాబ్‌ల నుంచి కమీషన్లు దండుకుంటూ రోగులపై అనవసర భారం వేస్తున్నారు. వైద్యుల్లో చాలా మంది రాసే ప్రిస్క్రిప్షన్‌లోని రాత వారు సూచించిన మెడికల్ దుకాణ నిర్వాహకులకే అర్థమవుతుంది. వేరే దుకాణంలో తక్కువ ధరకు దొరికితే రోగులు కొందామనుకున్నా ఆ రాత అర్థం కాక మళ్లీ వైద్యులు సూచించిన దుకాణంలోనే కొనాల్సిన పరిస్థితి. కొందరు వైద్యులే సొంతంగా మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుండగా, కొన్ని ఆస్పత్రుల వద్ద వేరేవారు ఏర్పాటు చేసుకుని వైద్యులకు కొంత కమీషన్ చెల్లిస్తున్నారు.

**ఇలా ఆరోపణలనేకం..**

ఒక రోగిని ఎవరైనా సిఫార్సు చేస్తే బిల్లులో 10-20 శాతం వరకు కమీషన్ ఇస్తున్నారు.

గ్రామాల్లోని ఆర్ఎంపీలు ఆస్పత్రులకు సిఫార్సు చేస్తే 30 శాతం వరకు ఇస్తున్నారు.

అంబులెన్స్‌ల డ్రైవర్లు కొన్ని ఆస్పత్రులకే రోగులను తీసుకెళ్లి వాటాలు తీసుకుంటున్నారు.

సిఫార్సులతో రోగులను తెప్పించుకుంటున్న ఆస్పత్రుల యాజమాన్యాలు ఆ భారం రోగులపై వేసి వసూలు చేస్తున్నాయి.

వైద్యుడు రాసిన ప్రతి స్కానింగ్‌లో 20-30 శాతం కేంద్రాల నుంచి వాటాగా ఆ ఆస్పత్రులకు వెళ్తుంది.

# గృహ యోగం.. వరించేదెవరిని?



కరీంనగర్ : సొంత ఇల్లు, భూమి(ఇల) లేక కష్టాలు పడుతున్న వారికి ప్రభుత్వం శుభవార్త వినిపించింది. వారి కల నెరవేరేలా అందుబాటులో ఉన్న రెండు పడక గదుల ఇళ్లను కేటాయించడానికి కసరత్తు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను తీసుకొని సర్వే చేపడుతున్నారు.

**వేలల్లో దరఖాస్తులు**

కరీంనగర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలో సొంత ఇల్లు కట్టుకోవడానికి స్థలం లేనివారు ఇందిరమ్మ ఇళ్ల కోసం 29,515 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్థలమున్న వారికే కేటాయిస్తోంది. రెండో దశ కింద సొంత స్థలం, ఇల్లు లేనివారిని ప్రత్యామ్నాయంగా చూడాలని ఆలోచిస్తోంది. వీరిని గుర్తిరచడానికి నియోజకవర్గ స్థాయిలో సర్వే చేపడుతున్నారు. బల్దియా పరిధిలో సర్వే చేసేందుకు ఉద్యోగులతో గృహ నిర్మాణ సంస్థ అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేటాయించిన డివిజన్లలో ఇంటి నంబర్ల ఆధారంగా ఒకట్రెండు రోజుల్లో సర్వే చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు కూడా జారీ చేశారు.

**మరమ్మతులకు రూ.2.36 కోట్లు**

నియోజకవర్గంలోని చింతకుంట, కమాన్‌పూర్, ఆరెపల్లి ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల ఇళ్లను నిర్మించారు. వీటిని కొందరు లబ్ధిదారులకు కేటాయించగా కొన్ని మిగిలాయి. నగర శివారులోని చింతకుంటలో అయిదు అంతస్తుల భవనంలో 600కుపైగా రెండు పడక గదుల ఫ్లాట్లను నిర్మించారు. కానీ భవనం లోపల కొన్ని పనులు మిగిలిపోయాయి. వీటిని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించి రూ.2.36 కోట్లు కేటాయించింది. ఇందులో నగరపాలక సంస్థ ద్వారా రూ.36 లక్షలు, డీఎంఎఫ్‌టీ కింద రూ.2 కోట్లను మంజూరు చేశారు. ఎల్-2లో పేదలను గుర్తించి అందుబాటులో ఉన్న ఇళ్లను లక్కీ డ్రా ద్వారా ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

**వివరాల సేకరణ**

అసంపూర్తిగా ఉన్న రెండు పడక గదుల ఇళ్లను రెండు, వడు నెలల్లో పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. స్థలం, సొంతిల్లు లేని లబ్ధిదారుల దరఖాస్తులు పెద్ద సంఖ్యలో వచ్చాయి. వాటిని పరిశీలించి పూర్తి స్థాయిలో అర్హులైన పేదలను గుర్తించేందుకు సర్వే చేయిస్తున్నాం.

ఎస్.రాజేశ్వర్, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గృహ నిర్మాణ సంస్థ

# కుంటలు మాయం.. కట్టడి శూన్యం



పెద్దపల్లి : జిల్లాలో సాగు నీటి వనరులు కబ్జాదారుల కబంధహస్తాల్లోకి చేరుతున్నాయి. ఆయకట్టుకు నీరందించే చెరువులు, కుంటలు మాయమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నివాస గృహాల నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణను పట్టించుకోవడం లేదు. ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంకు లెవల్) గుర్తించడంలో జాప్యంతో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నాయి.

**కనిపించని హద్దులు** చెరువు, కుంటల శిఖం తర్వాత ఎఫ్‌టీఎల్ భూమితోపాటు బఫర్‌జోన్ ఉంటుంది. చెరువు పూర్తిగా నిండిన సమయంలో నీరు నిలిచే ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ హద్దుగా గుర్తిస్తారు. తర్వాత 90 మీటర్ల పొడవున్న ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా వ్యవహరిస్తారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల సమన్వయ లోపంతో హద్దులు కేటాయించడంలేదు. గతేడాది చెరువుల సర్వే మొదలు పెట్టినప్పటికీ ఆదిలోనే హంసపాదు అన్నట్లు మధ్యలోనే నిలిపివేశారు. జిల్లాలో వంద ఎకరాల్లోపు 832, వంద ఎకరాలపైన 107 చెరువుల్లో 55,332 ఆయకట్టు సాగవుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

మంథని మండలం వెక్లాస్‌పూర్ ఎర్రకుంట కబ్జాకు గురైంది. చెరువు కట్టను తొలగించి చదును చేశారు. 50 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి పెద్ద చెరువు సుమారు 150 ఎకరాల్లో ఉంది. చెరువు కింద ఆయకట్టు 300 ఎకరాల విస్తీర్ణం ఉంది. శిఖంలో సుమారు 25 ఎకరాలు కబ్జాకు గురైంది. ఈ చెరువులో నీరుంటే వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. కమాన్‌పూర్ మండలం గుండారం జలాశయ శిఖం భూమి కబ్జాకు గురవుతోంది. హద్దులు నిర్ణయించకపోవడంతో ఆక్రమణదారుల ఆగడాలకు హద్దు లేకుండా పోతుంది. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి చెరువు వెయ్యి ఎకరాల శిఖముంది. 2 వేలకు పైగా ఆయకట్టు సాగవుతోంది. 30 ఎకరాలు కబ్జాకు గురికావడంతో ఆయకట్టు రైతులతోపాటు చేపల పెంపకానికి నష్టం కలుగుతోంది.

చర్యలు తీసుకుంటాం కబ్జాకు గురవుతున్న సాగునీటి వనరులకు సంబంధించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తున్నాం.

శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ

# సెల్లార్లు అద్దెకు.. జరిమానా ప్రజలకు..!

నల్గొండ : జిల్లాలోని ప్రధాన పురపాలికల్లో సెల్లార్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పార్కింగ్ పేరిట నిర్మాణ అనుమతులు తీసుకుని ధనార్జనే ధ్యేయంగా వ్యాపార సముదాయాలకు వినియోగిస్తున్నారు. జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాలైన నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ, చిట్యాల, నకిరేకల్‌లో సెల్లార్లు లీజులకు ఇచ్చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు కాలరాసి ఆసుపత్రులు, ల్యాబ్‌లు, దుకాణాలు, వ్యాపార సామగ్రి భద్రపరుచుకునేందుకు ఉపయోగించడంతో వాహనాల పార్కింగ్‌కి సదుపాయం లేకుండా పోయింది. జిల్లా కేంద్రమైన నల్గొండలోనే ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి సుమారు 42 భవన సముదాయాల్లోని సెల్లార్లు ఖాళీ లేకుండా చేశారు. దీంతో స్థలం లేక వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా నిత్యం ట్రాఫిక్ అంతరాయం చోటు చేసుకుంటుంది.

**తనిఖీలు శూన్యం!**

భవన నిర్మాణ సమయంలో సంబంధిత కమిషనర్ పేరుమీద కొంత స్థలాన్ని మార్టిగేజ్ చేస్తారు. నిర్మాణం పూర్తైన తర్వాత మార్టిగేజ్ రిలీజ్ చేస్తారు. ఆ తర్వాత సెల్లార్లు పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారా.. ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారా అనే అంశాలపై ఇప్పటి వరకు తనిఖీలు లేవు. దీంతో భవన నిర్మాణదారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న మాదిరిగా మారిపోయింది.



మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డు, డాక్టర్స్ కాలనీ, నల్గొండ, ఖమ్మం ప్రధాన రహదారుల వెంట భారీ భవనాల నిర్మాణంలో నిబంధనలు పాటించలేదు. దీంతో పట్టణవాసులు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. జిల్లాలోనే ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న మిర్యాలగూడ పట్టణానికి నిత్యం వందలాది మంది తమ అవసరాల కోసం వచ్చి వెళ్తుంటారు. దుకాణాలు, ఆసుపత్రులు, ఇతర వాణిజ్య సముదాయాలకు వచ్చే వారు తమ వాహనాలను రహదారుల వెంట పార్కింగ్ చేసి వెళ్తుండగా.. ట్రాఫిక్ పోలీసులు భారీగా జరిమానాలు విధిస్తున్నారు. దీంతో తప్పు చేసేది ఒకరైతే.. మరొకరు జరిమానా చెల్లించాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. గతంలో జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విజిలెన్స్ తనిఖీలు చేస్తుండగా.. కొన్నేళ్లుగా ఈ విధానం అమలు చేయడం లేదు.

దేవరకొండ పట్టణంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. వాణిజ్య సముదాయాల నిర్మాణంలో కొన్ని చోట్ల సెల్లార్‌లు అద్దెకిచ్చారు. దేవరకొండలో అతిపెద్ద బహుళ వాణిజ్య సముదాయం ఓ కాంప్లెక్స్‌లో దాదాపు 100కు పైగా దుకాణాలు, ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌లు, లాడ్జింగ్ ఉన్నా.. పార్కింగ్‌కు సెల్లార్ లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలిపివేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు.

# దోమల సొమ్ము..దొంగలపాలు..!

సూర్యాపేట : హుజూర్‌నగర్ పురపాలికలో 28 వార్డుల్లో 38 వేల జనాభా ఉంది. పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించిన బడ్జెట్ నుంచే దోమల నివారణకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.2 లక్షల వరకు వెచ్చించినట్లు అధికారులు తెలిపారు. కానీ, పట్టణ ప్రజలు సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నారు. దోమల నివారణ చర్యలు సరిగా చేపట్టకుండానే చేసినట్లు చెబుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలోని బల్దియాల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నామని ఆయా పుర అధికారులు చెబుతున్నారు. నిబంధనల మేరకు ఫాగింగ్ చేస్తున్నామంటున్నారు. కానీ, కొన్ని పట్టణాల్లో ఆ పనులు కానరావడం లేదు. కేటాయించిన బడ్జెట్‌ను ఖర్చు చేసినట్టు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో అంతగా లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐదు మున్సిపాలిటీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ.16 లక్షల బడ్జెట్‌ను కేటాయించారు.

మలాథియాన్, టెమోఫాస్ రసాయన మందులు, ఫాగింగ్ చేసేందుకు యంత్రాల్లో వినియోగించే పెట్రోలు, డీజిల్ కొనుగోలు, ఆయిల్ బాల్స్, యంత్రాల మరమ్మతు ఇలా దోమల నివారణ చర్యలకు రూ.9.25 లక్షలు ఖర్చు చేశారు. రికార్డుల్లో ఆయా పనులకు లెక్కలు సక్రమంగానే కనిపించినా బడ్జెట్‌లో గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. ఆరు నెలల వ్యవధిలో సగానికిపైగా బడ్జెట్‌ను వెచ్చించినా.. మశకాల వ్యాప్తి మాత్రం తగ్గలేదని ఆయా పట్టణాల ప్రజలు వాపోతున్నారు. వాటి విజృంభణతో అవస్థలు పడుతున్నామంటున్నారు.

1.32 లక్షల జనాభా కలిగిన సూర్యాపేట పురపాలికలో 48 వార్డులున్నాయి. ఈ ఏడాది దోమల నివారణకు రూ.4 లక్షల బడ్జెట్‌ను కేటాయించారు. ఇప్పటి వరకు రసాయన మందులు, వాటి పిచికారీ, ఫాగింగ్ చేసేందుకు అవసరమైన పెట్రోలు, డీజిల్ కొనుగోలుకు రూ.1.5 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ, చాలా వార్డుల్లో పొగ పెట్టడం లేదు. దోమల విజృంభణతో ప్రజలు



జ్వరాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా కుడకుడ రోడ్డులో ఉన్న వార్డుల్లో, శివారు కాలనీల్లో ఇంతవరకు ఫాగింగ్ చేసినట్లు కనిపించలేదని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. ప్రస్తుతం ఖర్చు చేసిన బడ్జెట్‌ను చూస్తుంటే అందులో పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఈ మూడింట పర్వాలేదు:** నేరేడుచర్ల, కోదాడ, తిరుమలగిరి పురపాలికల్లో దోమల నివారణకు ఇప్పటి వరకు రూ.5.75 లక్షలు ఖర్చు చేసినట్లు ఆయా మున్సిపాలిటీల అధికారులు పేర్కొన్నారు. నిర్దేశించిన సమయాల్లో ఫాగింగ్ చేస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. కానీ, ఖర్చు చేసిన బడ్జెట్‌లో తేడాలున్నట్లు సమాచారం.

**ప్రణాళిక ప్రకారం ఫాగింగ్ చేస్తాం**

హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

కొన్ని వార్డుల్లో ఫాగింగ్ చేస్తున్నాం. ఇకపై అన్ని వార్డుల్లో ఫాగింగ్ నిర్వహణ సరిగా జరిగేలా చర్యలు చేపడతాం. అందుకు ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తాం.

# పెర'గాలి' స్వచ్ఛత!

హైదరాబాద్: నగరంలో వాయునాణ్యత మెరుగుపరిచేందుకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్(ఎన్‌సీఏపీ) కింద 2019 నుంచి ఇప్పటి వరకు రూ.727.18 కోట్లు మంజూరయ్యాయి. అందులో వినియోగించింది కేవలం రూ.484.56 కోట్లు మాత్రమే. గత ఐదేళ్లలో రూ.వందల కోట్లు వెచ్చించినా వాయునాణ్యత మెరుగుపరచడంలో నగరం వెనుకబడి ఉంది. ఇటీవల వెల్లడించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్–2025 ర్యాంకులే అందుకు నిదర్శనం.



**ఇలా చేస్తే బాగు**

ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెంచేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వడం జీహెచ్‌ఎంసీ చేపట్టిన గ్రీన్‌బెల్ట్, వేస్ట్ ప్రాసెసింగ్, ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం పెరగాలి. ఎన్‌సీఏపీ నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఘనపు మీటరు గాలిలో పీఎం–10, ఘనపు మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములుగా ఉండాలి. 2017–18లో 110 మైక్రోగ్రాములుగా నమోదవ్వగా.. ప్రస్తుతం 82 మైక్రోగ్రాములకు చేరుకుంది.

**ర్యాంకు ఎలా నిర్ధారిస్తారంటే..** జనాభా ఆధారంగా 10లక్షలకు పైబడిన, 3 నుంచి 10లక్షలు, 3లక్షల లోపు నగరాలుగా విభజించి కాలుష్య నియంత్రణ చర్యల ఆధారంగా ర్యాంకు నిర్దేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఉద్గారాలు, పరిశ్రమల కాలుష్యంపై ప్రజలకు అవగాహన కల్పించడం, సూక్ష్మధూళి కణాల నియంత్రణ, వాయునాణ్యత పెంపు వంటి వాటి ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు. అందులో మిలియన్ ప్లస్ జనాభా ఉన్న 41 నగరాల్లో హైదరాబాద్‌కి 22వ ర్యాంకు రాగా..ఇందోర్ మొదటి స్థానం దక్కించుకుంది.

# గురువులకూ డిజిటల్ పాఠాలు

వెల్గటూరు : : ఈ చిత్రంలోని ఉపాధ్యాయులంతా పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం పాఠశాల సముదాయ సమావేశాల్లో కొంగొత్త పాఠాలు నేర్చుకుంటున్నారు. వెల్గటూరు ఉన్నత పాఠశాలలో జరిగిన సముదాయ సమావేశాల్లో చోటు చేసుకున్న సన్నివేశం ఇది. కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)పై అవగాహన కల్పించేందుకు భవిష్యత్తు సంసిద్ధతా కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేసేందుకు విస్తృత చర్యలు చేపట్టారు.

కొవిడ్ అనంతర పరిస్థితులు విద్యా బోధనలో గణనీయ మార్పులు తీసుకువచ్చాయి. ప్రధానంగా కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ పాఠాలతో విద్యార్థులకు డిజిటల్ సాధనాల వాడకంపై ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను డిజిటల్ పాఠాల వైపు ఆకర్షితులను చేయడంతోపాటు పాఠశాల స్థాయి నుంచే సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ స్థాయి బోధన అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఇందులో భాగంగా కాంప్లెక్స్‌కు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున గత నెలలో జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు.

క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు డిజిటల్ బోధన కోసం సముదాయ సమావేశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 'ఫ్యూచర్ రెడీనెస్ ఆఫ్ తెలంగాణ ఫర్ ఏఐ' పేరుతో 1–5 తరగతుల విద్యార్థులకు గణిత బోధన కోసం ప్రత్యేక సిలబస్ రూపొందించారు. వెనుకబడిన (సీ గ్రేడ్) పిల్లల కోసం సిలబస్‌తో సంబంధం లేకుండా తెలుగు, గణితం



నేర్చుకోవడానికి ఏఎక్స్‌ఎల్‌ను అమలు చేస్తున్నారు.

1, 2 తరగతుల పిల్లలు విద్యా సంవత్సరం మొత్తంలో నాలుగు గంటల సమయాన్ని ఏఐ బోధన కోసం వెచ్చించాలి. ఇందులో రెండు గంటలు థియరీ రెండు గంటలు సాధన(ప్రాక్టికల్స్) ఉంటాయి. విద్యార్థుల శాశ్వత విద్యా సంఖ్య(పెన్ నంబర్)తో ఉపాధ్యాయులు తమ ఎంప్లాయ్ ఐడీతో సంబంధిత వెబ్‌సైట్, యాప్‌లలో లాగిన్ కావాల్సి ఉంటుంది.

3–5 తరగతుల విద్యార్థులు విద్యా సంవత్సరంలో 10 గంటలు ఏఐ బోధనకు వెచ్చించాలి. సీగ్రేడ్ విద్యార్థులు మాత్రం వడు నెలల్లో 20 నిమిషాలకు ఒక పీరియడ్ చొప్పున 20 కాలాంశాలు ఏఎక్స్‌ఎల్‌లో తెలుగు, గణితం నేర్చుకోవాలి.

దీని కోసం జీ–కంప్రిస్(%G-compris%) ఎడ్యు ఆక్టివ్8(యాప్‌లు, కోడ్‌మిత్ర వెబ్‌సైట్‌ను రూపొందించారు.

వీటి ఆధారంగా చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్ విద్యపై అవగాహన పెంపొందించుకుంటారు. దీంతోపాటు గణిత సామర్థ్యాలు, తార్కిక, సృజనాత్మక ఆలోచనలు, చిత్రాలు, పటాలు గీయడంలో నైపుణ్యాలను సాధిస్తారు.

# నీరు చెప్పింది నిజం

నల్గొండ: చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రా పేరుతో రాజధానిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా.. జిల్లాలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. ఎఫ్‌టీఎల్‌లోనే అనధికారిక లేఅవుట్ నిర్మించినా.. అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోంది. భువనగిరి పట్టణానికి ఆయువు పట్టైన పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు చెబుతున్నప్పటికి.. వాటికి తిలోదకాలు ఇస్తూ స్థిరాస్తి వెంచర్ ఏర్పాటు చేశారు. పక్కా రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మించి విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. లేఅవుట్ పరిధిలో ప్లాట్లు నీటిలో మునిగిపోయాయి. రెండు పెద్దవర్షాలు పడితే నిండిపోయే ఈ చెరువులో ఏకంగా లేఅవుట్లు నిర్మించి కొల్లగొట్టినప్పటికీ హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, పురపాలక, నీటిపారుదల శాఖాధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.లేఅవుట్‌కు 2012 సంవత్సరంలో అప్పటి కలెక్టర్, జిల్లా నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ) జారీ చేశారు. 2021లో చెరువులో అక్రమ లేఅవుట్‌పై ప్రచురితమైన కథనానికి స్పందించిన అప్పటి భువనగిరి నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు లేఖలు రాసినా స్పందన లేకపోవడం గమనార్హం.

# నమ్మకంగా చేరి.. పనికానిచ్చేస్తున్నారు!



హైదరాబాద్: "జూన్‌లో కాచిగూడలో ఓ వ్యాపారి ఇంట్లో పనివాళ్లుగా చేరిన నేపాలీలు నమ్మకంగా మెలిగారు. ఆహారంలో మత్తు పదార్థం కలిపి రూ.కోట్ల విలువైన సొత్తు దోచుకెళ్లారు. నిందితులు ఇప్పటికీ దొరకలేదు."“ఫిబ్రవరిలో నారాయణగూడ ఠాణా పరిధిలో ఓ వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. నిందితులు రూ.కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, రూ.25 లక్షల నగదు చోరీ చేశారు. పనివాళ్లలా వచ్చిన నిందితులు ఇంట్లో యజమానులు లేని సమయం చూసి దోపిడీ చేశారు." డబ్బు, నగల కోసం కూకట్‌పల్లిలో ఇద్దరు పనివాళ్లు ఇంటి యజమానురాలిని దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. నగరంలో ఈ తరహా నేరాలు తరచూ వెలుగుచూస్తున్నాయి.

జీతం తక్కువని.. పనివాళ్లలా చేరి చోరీలు చేస్తున్న ఉదంతాల్లో నిందితులు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉంటున్నారు. వారు సెలవులు తీసుకోకుండా ఇళ్లు, దుకాణాలు, పరిశ్రమల్లో తక్కువ జీతానికే పనిచేస్తుంటారు. ఈ కారణంతో యజమానులు వారి కనీస వివరాలు సేకరించకుండా పనిలో పెట్టుకోవడం పెద్ద సమస్యగా మారుతోంది. నగరంలో నిర్మాణ రంగంతో పాటు అపార్టుమెంట్లలో పనిచేసేందుకు స్థానికంగా మానవ వనరుల కొరత ఉండటంతో.. ఇతర రాష్ట్రాల నుంచి ఎంతోమంది ఉపాధి కోసం వస్తున్నారు. వీరు వచ్చే ముందే అప్పటికే ఇక్కడ ఉన్న తమ పరిచయస్థుల సాయంతో నేరుగా యజమానుల వద్ద చేరుతున్నారు. ఏ పని చెప్పినా చేస్తూ కొన్నాళ్లు నమ్మకంగా ఉంటున్నారు. బంగారం, డబ్బు భారీగా ఉన్నట్లు గమనిస్తే... ఇంట్లో ఎవరూ లేని సమయం, వృద్ధులు ఉన్నప్పుడు దాడి చేసి దోచుకుంటున్నారు. కొన్ని ముఠాలు దోపిడీల కోసమే పనివాళ్లలా చేరుతున్నారు. మహిళలు యజమానుల్ని వలపు వలతో మోసగించి దొంగిలిస్తున్న ఘటనలూ నమోదవుతున్నాయి.

**నిఘా నామమాత్రం**

నగరానికి ఉపాధి, వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారి మీద నిఘా నామమాత్రంగా ఉంటోంది. కొత్త వ్యక్తుల రాకపోకల మీద సెక్టార్, బీట్ స్థాయిలో పోలీసులు స్థానికుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాల్సి ఉన్నా ఆ ప్రక్రియ జరగడం లేదు. వాస్తవానికి నగరానికి వచ్చి గదులు అద్దెకు తీసుకునేవారి వివరాలను హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు కచ్చితంగా సేకరించాలి. బస చేసేవారి వివరాలు తూతూమంత్రంగా సేకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**జాగ్రత్తలివీ...**

కొత్త వ్యక్తుల్ని పనిలో పెట్టుకునే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. కచ్చితంగా నేపథ్యం తెలుసుకోవాలి.

తెలిసిన వారు సూచించినా.. ఆధార్‌కార్డు, తాజా ఫొటోలు, స్వగ్రామం అన్ని వివరాలు సేకరించాలి. పరిమితులేంటో నిర్దేశించాలి.


బంగారు ఆభరణాలు, నగదు ఎక్కువ మొత్తంలో ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలి.

పనిలో పెట్టుకోవాలనుకున్న వ్యక్తి నేపథ్యం తెలుసుకోవడానికి.. అతడి ఆధార్‌కార్డు సమాచారంతో హ్యాక్ ఐ యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే పదిరోజుల్లో వివరాలు అందిస్తామని పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులు

| | |
|---|---|
| 2023 | 116 |
| 2024 | 173 |

# మత్తు ఉచ్చు.. ఇంటింటా చిచ్చు



హైదరాబాద్: మాయదారి మత్తు ఇంటింటా చిచ్చుపెడుతోంది. హాయిగా సాగుతున్న కాపురాలను కుప్పకూల్చుతోంది. చదువులో టాపర్లు.. ర్యాంకర్లను కిందపడేస్తుంది. కార్పొరేట్ సంస్థల్లో ఉన్నతోద్యోగులను బానిసలుగా మార్చుతోంది. మహానగరం నలువైపులా వ్యాపిస్తున్న డ్రగ్స్ ఆందోళన కలిగిస్తోంది. మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కిన తమ వారిని ఏదో విధంగా బయటపడేసి కాపాడమంటూ రోజూ హెచ్‌న్యూ, ఈగల్ పోలీసులకు వందలాది ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. దారికి రాకుంటే జైల్లో ఉంచైనా మహమ్మారి నుంచి కాపాడాలని ప్రాధేయపడుతున్నారంటూ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

**తెలంగాణ ఈగల్ లెక్కలు**

తెలంగాణ ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్) ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 15,847 కేసుల్లో 32,546 మందిని అరెస్ట్ చేశారు. రూ.150 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈగల్ గణాంకాల ప్రకారం కొనుగోలుదారుల వివరాలిలా ఉన్నాయి.

**మత్తు ప్రపంచంలో మాయలెన్నో..**

ఇప్పటివరకూ కేవలం ఒత్తిడి నుంచి ఉపశమనం.. కొత్త ఆనందాన్ని వెతుక్కునేందుకు డ్రగ్స్ రుచిచూస్తున్నట్టు భావించారు. తాజాగా పట్టుబడిన 20 మంది పురుషుల్లో 12 మంది శృంగార సామర్థ్యం కోసం గంజాయి, ఎండీఎంఏ వాడుతున్నట్టు చెప్పటంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. అదంతా అపోహ అంటూ వైద్యుల ద్వారా వారికి కౌన్సెలింగ్ ఇప్పించాల్సి వచ్చిందని పోలీసు అధికారి ఒకరు తన అనుభవాన్ని పంచుకున్నారు. డేటింగ్‌యాప్‌లు, వాట్సప్ గ్రూపుల్లో పరిచయాలతో సహజీవనం సాగిస్తున్న జంటల్లో అధికశాతం మాదకద్రవ్యాల అలవాటు ఉన్నవారే ఉన్నట్టు దర్యాప్తులో గుర్తించారు. హైటెక్ సిటీలో ఇటీవల ఈగల్ బృందం గంజాయి కొనుగోలు చేస్తున్న 100 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు భార్యాభర్తలు కలిసే మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్టు గుర్తించారు. కొనుగోలుదారులపై కేసు నమోదు చేసి కౌన్సెలింగ్‌కు కుటుంబ సభ్యులను రప్పించినపుడు తమ ఇంట్లోనే డ్రగ్స్ తీసుకునే వ్యక్తులున్నట్టు తెలిసి కన్నీరు పెట్టుకుంటున్నారు.

# పుష్కరాల ఏర్పాట్లకు కసరత్తు



ధర్మపురి : గోదావరి పుష్కరాలు 2027 జులైలో జరగనున్నాయి. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ధర్మపురి, కోటి లింగాల, మంథని, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో పుష్కరఘాట్లు, వసతుల కల్పనపై ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాల్లో హడావుడిగా చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించింది. సమయం ఉన్నందున గోదావరి పుష్కరాల నిర్వహణను చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. 2015లో వచ్చిన గోదావరి పుష్కరాల్లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సమేతంగా ధర్మపురిలో పుష్కర స్నానాలు చేసి పూజలు చేశారు. ఈ నెల 17న రాష్ట్ర స్థాయి అధికారులతో ధర్మపురిలోనే పుష్కరాల ఏర్పాట్ల సన్నద్ధతపై ప్రత్యేక సమావేశం జరగనుంది. ఉమ్మడి జిల్లాలో ఎర్దండి, వాల్గొండ, వెంకట్రావుపేట, బోర్నపల్లి, కమ్మునూర్, రాజారాం, దమ్మన్నపేట, ధర్మపురి, కోటిలింగాల, రాయపట్నం, గోలివాడ, గోదావరిఖని, సుందిల్ల, మంథని, కాళేశ్వరం పుష్కర కేంద్రాలను ప్రాథమికంగా గుర్తించగా ఏర్పాట్లపై చర్చించనున్నారు.

**ధర్మపురి**

ఘాట్లు: 4 హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 70 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : కోటికి పైగానే

ప్రస్తుత పరిస్థితులు: నాలుగు ఘాట్లకు స్వల్ప మరమ్మతు చేపట్టాల్సి ఉంది. 20 తాగునీటి ట్యాంకులు వృథాగా ఉన్నాయి. దుస్తులు మార్చుకునే గదులు లేవు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. మురుగు గోదావరిలో కలుస్తోంది.

పట్టాల్సిన పనులు: నది వద్దకు రహదారి అధ్వానంగా ఉంది. ధర్మపురికి రవాణా పరంగా ఇబ్బందులు ఉన్నాయి. పట్టణంలో అన్ని రహదారులను విస్తరించాలి. పురాతన తితిదే ధర్మశాల వద్ద నూతన వసతి గృహాలను ఏర్పాటు చేయాలి.

**కోటిలింగాల**

ఘాట్లు: 2 హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 30 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : 40 లక్షలు

ప్రస్తుత పరిస్థితులు: దుస్తులు మార్చుకునే గదులను శాశ్వతంగా నిర్మించాలి. 20 మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. తాగు నీటి కోసం శాశ్వత ప్రాజెక్టు చేపట్టాలి.

చేపట్టాల్సిన పనులు: ఆలయం వరకు రహదారి విస్తరణ చేపట్టాలి. నూతన విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయాలి.

**మంథని**

ఘాట్లు: ఒకటి

హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 12 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : 24 లక్షలు

ప్రస్తుత పరిస్థితులు: గోదావరి తీరంలో మరిన్ని స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయాలి. దుస్తులు మార్చుకునే గదులు, తాగు నీటి సమస్యలు ఉన్నాయి.

చేపట్టాల్సిన పనులు: రహదారి విస్తరణ చేపట్టాలి. విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేయాలి.

**గోదావరిఖని**

ఘాట్లు: ఒకటి

హాజరైన భక్తులు(2015 పుష్కరాలు): 10 లక్షలు

వచ్చే పుష్కరాలకు భక్తుల అంచనా : సుమారు 20 లక్షలు

ప్రస్తుత పరిస్థితులు: పుష్కర స్నానాలకు అనుకూలంగా ఘాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు ఉన్నాయి. గత పుష్కరాల సందర్భంగా హైదరాబాద్ ప్రాంతం నుంచి ఎక్కువ మంది వచ్చి స్నానాలు చేశారు.చేపట్టాల్సిన పనులు: రాజీవ్ రహదారి నుంచి పుష్కరఘాట్ వద్దకు రహదారికి మరమ్మతు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సదుపాయాలు కల్పించాలి. **అద్భుతంగా తీర్చిదిద్దుతాం** రానున్న గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పుష్కరక్షేత్రాల అభివృద్ధికి సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. ఇప్పటికే ధర్మపురిపై రాష్ట్ర స్థాయిలో సమీక్ష జరిగింది. కోటిలింగాల, గోదావరిఖని, మంథని పుణ్యక్షేత్రాలను పుష్కరాలలోపు అద్భుతంగా తీర్చిదిద్దుతాం. ధర్మపురి దేవస్థానంలో ఆగమ పండితులు, వేద పండితుల సలహాలు స్వీకరించి దేవస్థానాన్ని అభివృద్ధి పరుస్తాం. లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి

# డబుల్ ధమాకా

భగత్‌నగర్ :"డబుల్ ధమాకా అంటే ఇదే కాబోలు.. దసరా వచ్చిందంటే ఆయా కంపెనీలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించడం తెలిసిందే. విజయాలను తీసుకొచ్చే విజయదశమికి కొత్త వాహనాలు, వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ప్రజల సెంటిమెంటును దృష్టిలో పెట్టుకొని కంపెనీలు రాయితీలతో ఆకర్షిస్తుంటాయి. కంపెనీలు ప్రకటించే ఆఫర్లతోపాటు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును ఈనెల 22 నుంచి వర్తింపజేయడంతో రెండు విధాలుగా వినియోగదారులకు కలిసిరానుంది. వాహనాలు, వస్తువులు, గృహోపకరణాల ధరలు తగ్గే అవకాశముంది. ఇప్పటికే పలు వాహన తయారీ కంపెనీలు జీఎస్టీ తగ్గింపుతో రూ.లక్ష నుంచి రూ.1.40 లక్షల వరకు ధరలు దిగివచ్చే అవకాశం ఉందంటూ ప్రకటనలు జారీ చేస్తున్నాయి.

**బుకింగ్ ఫుల్.. డెలివరీ నిల్**

కరీంనగర్‌లోని ఓ ప్రముఖ వాహన విక్రయ సంస్థ యజమాని తెలిపిన ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం ఈనెల 3న జీఎస్టీ తగ్గింపు ప్రకటన ఇచ్చిన నాటి నుంచి వాహనాల బుకింగ్ జోరుగా సాగుతోందని.. ప్రస్తుతం వాహనాల డెలివరీ జరగడంలేదన్నారు. ఇప్పటి వరకు 50 వాహనాలు కొనుగోలు చేసిన వారు ఈనెల 22 తర్వాత డెలివరీ ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. వివిధ మోడల్ కార్లను రోజుకు




సగటున 4 నుంచి 5 విక్రయిస్తే, జీఎస్టీ తగ్గింపుతో రాబోయే రోజుల్లో రోజుకు 8 నుంచి 10 వాహనాలు అమ్మే అవకాశముందని అంచనా వేస్తున్నామన్నారు.

**విపణిలో స్తబ్ధత..**

ఆన్‌లైన్ విక్రయాలు జరిపే సంస్థలు ఇప్పటికే పండగ ఆఫర్లను ప్రకటించి వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పేరొందిన కంపెనీల షోరూంలలో ఆఫర్ ప్రకటనలు జారీ చేయడానికి సిద్ధమవుతున్నాయి. వినియోగదారులు వస్తువుల ధరలు ఏమేర తగ్గుతాయా? అని అంచనా వేస్తూ కొనుగోలుకు ఎదురుచూస్తున్నారు. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో స్తబ్ధత నెలకొంది. వ్యాపారాలు వెలవెలబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు ప్రకటన జారీ నుంచి పలువురు కొనుగోలును వాయిదా వేస్తున్నారు. ఏదిఏమైనా ఈ దసరా పండగ కొనుగోలుదారులకు కలిసిరానుంది.

# స్థానికంగా కీమోథెరపీ

గోదావరిఖని : రాష్ట్రంలోని 34 బోధనాసుపత్రుల్లో డేకేర్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లోని క్యాన్సర్ బాధితులకు ఊరట కలగనుంది. సంగారెడ్డిలో మంగళవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వర్చువల్‌గా ప్రారంభించగా అందుబాటులోకి వచ్చాయి. కీమోథెరపీ చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా బోధనాసుపత్రిలోని డేకేర్ కేంద్రాల్లో చికిత్స పొందనున్నారు. దీంతో క్యాన్సర్ బాధితులకు దూరాభారం తప్పనుంది. ఉమ్మడి జిల్లాలోని గోదావరిఖని, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్‌లోని బోధనాసుపత్రుల్లో డేకేర్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.




**20 పడకలు..** ప్రతి బోధనాసుపత్రిలో 20 పడకలతో క్యాన్సర్ బాధితుల కోసం డేకేర్, పాలియేటివ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇద్దరు జనరల్ సర్జన్లతో పాటు అయిదుగురు నర్సింగ్ అధికారులకు ఇటీవల హైదరా బాదులోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కేంద్రాల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఆసుపత్రి జనరల్ సర్జరీ విభాగాధిపతిని నోడల్ అధికారిగా నియమించారు. క్యాన్సర్ నిర్ధారణతో పాటు ప్రధాన చికిత్స ఎంఎన్‌జే ఆసుపత్రిలో అందిస్తారు. ఒక పర్యాయం కీమోథెరపీ ఇచ్చాక బాధితులను సంబంధిత జిల్లాలోని బోధనాసుపత్రికి పంపిస్తారు. ఎంఎన్‌జే ఆసుపత్రి వైద్యులు ఇచ్చిన మార్గదర్శనం(ప్రిస్క్రిప్షన్) ప్రకారంగానే డేకేర్ కేంద్రాల్లోని వైద్యులు చికిత్స అందిస్తుంటారు. పరిస్థితి తీవ్రతను బట్టి అవసరమైతే మళ్లీ వారిని ఎంఎన్‌జే ఆసుపత్రికి పంపిస్తారు. ఉదయం ఆసుపత్రిలో చేర్చుకొని కీమోథెరపీ చికిత్స ఇచ్చి సాయంత్రం ఇంటికి పంపిస్తారు. క్యాన్సర్ తీవ్రతతో చివరిదశలో ఉన్నవారికి పాలియేటివ్ కేర్ కేంద్రంలో చేర్చుకొని చికిత్స అందిస్తారు.

# క్రిప్టో కరెన్సీ పేరిట మోసం

కరీంనగర్ : క్రిప్టో కరెన్సీ పేరిట మోసాలు చేస్తూ నగదు వసూలు చేసిన నలుగురు నిందితులను కరీంనగర్ పోలీసులు పట్టుకున్నారు. మెటా ఫండ్ అనే నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో ప్రజల్ని మభ్యపెట్టిన వారిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీఎస్ సీఐ ప్రకాశ్ కథనం మేరకు.. కరీంనగర్‌కు చెందిన పలువురిని హైదరాబాద్‌కు చెందిన వరాల లోకేశ్వర్‌రావు అనే వ్యక్తి కరీంనగర్‌లో కొందరి మధ్యవర్తుల ద్వారా మోసగించాడు. మెటా ఫండ్ యాప్‌లో పెట్టుబడి పెడితే పెట్టిన దానికి వడింతలు లాభం వస్తుందని నమ్మించాడు. ఇతనికి కరీంనగర్‌కు చెందిన బూర శ్రీధర్, తులసి ప్రకాశ్, దాసరి రమేశ్, దాసరి రాజులు సహకరించారు. వీరంతా కలిసి నగరంలోని 8 మంది బాధితుల నుంచి రూ.54.65 లక్షలు వసూలు చేశారు. స్థానికంగా ఉన్న శ్రీరామ టింబర్ డిపోలో ఈ నగదుని తీసుకుని బాధితులకు నకిలీ ఐడీలను అందించారు. అయితే కొన్నాళ్లకు మోసపోయామని తెలుసుకున్న బాధితులు ఈ నలుగురిని సంప్రదించగా తమకు తెలియదనడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో జులై 17న ఈ నలుగురిపై కరీంనగర్ రెండో ఠాణాలో కేసు నమోదవగా నిందితులు పరారయ్యారు. హైదరాబాద్, విజయవాడలో పలుచోట్ల ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. మొదట ఈ కేసును రెండో ఠాణా పోలీసులు దర్యాప్తు చేశారు. ఎక్కువ మంది ఉండే అవకాశం ఉండటంతో సీపీ గౌష్ ఆలం ఈ కేసుని సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న లోకేశ్వర్ రావు పరారీలో ఉండగా.. అతనికి సహకరించిన బూర శ్రీధర్, తులసి ప్రకాశ్, దాసరి రమేశ్, దాసరి రాజులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరు పర్చారున్యాయవర్తి ఆదేశాలతో వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# పదేళ్లలో 18 మంది

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే బదిలీపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన కె.వినోద్‌రెడ్డి బదిలీపై దేవాదాయశాఖ హైదరాబాద్ కార్యాలయానికి డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న రాధాబాయి ఈ నెల 13న ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను చేపట్టారు.

**మొదటి నుంచీ ఇంతే..**

మొదటిసారిగా 1956లో ఆలయానికి కార్యనిర్వహణాధికారిని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 80 మంది ఈవోలుగా బాధ్యతలు నిర్వహించారు. కొందరు రెండు, మూడు దఫాలుగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ వారు సైతం ఏడాదిలోపే బదిలీ అయ్యారు. 1956 నుంచి 1965 వరకు రూప్‌లాల్ ముంతాజియం ఒక్కరే పదేళ్లపాటు ఈవోగా బాధ్యతలు నిర్వహించగా.. మిగిలిన వారిలో ఏ ఒక్కరూ చాలాకాలం పని చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. పదేళ్లలో 18 మంది ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. ఈవో రాజేశ్వర్ 2014 నుంచి 2017 వరకు విధులు నిర్వహించారు. అనంతరం 2019 వరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. క్రిష్ణప్రసాద్ 2020 నుంచి 2022 వరకు తిరిగి 2022 నుంచి 2024 బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత రామక్రిష్ణారావు కేవలం 36 రోజులు మాత్రమే ఈవోగా ఉన్నారు. ఆ తరువాత వినోద్ కుమార్ నెలపాటు విధులు నిర్వహించిన అనంతరం ఆగస్టు 2024 నుంచి 13 జూన్ 2025 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. 17 జనవరి 2022 నుంచి 9 ఆగస్టు 2022 వరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించి ఎనిమిది నెలల్లోనే బదిలీ అయ్యారు.

**పట్టు సాధించేలోపే..**

ఆలయ కార్యనిర్వహణాధికారుల బదిలీల వెనుక అనేక కారణాలున్నా



యని ప్రచారం జరుగుతోంది. పైస్థాయి అధికారుల ప్రమేయం, రాజకీయ ఒత్తిళ్లు, ఆలయంలో ప్రొటోకాల్ వివాదాలు, విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న అవకతవకల వంటివి కారణంగా భావిస్తున్నారు.

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆలయంలో అనేక సంస్కరణలు చేపట్టారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉన్న కొద్దికాలంలో భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేసి భక్తులు మన్ననలు పొందారు. సంస్కరణలు గిట్టని కొందరు ఆలయ ఉద్యోగులు, నాయకులు ఇక్కడి నుంచి సాగనంపారపనే ఆరోపణలు ఉన్నాయి. ఈవోలుగా వచ్చిన వారు ఆలయంలోని వివిధ విభాగాలపై అవగాహనకు వచ్చి పట్టు సాధించేలోపే బదిలీ కాలవడంతో భక్తులకు మెరుగైన సేవలు అందలేకపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన వినోద్‌కుమార్ పట్టు సాధించి సంస్కరణలు చేస్తున్న క్రమంలో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రాధాబాయికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో వేలల్లో వచ్చే భక్తులకు ఏ మేరకు సేవలు అందుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఆలయానికి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలనే డిమాండ్ భక్తుల్లో, స్థానిక నాయకుల్లో వినిపిస్తోంది.

# చెరువులను చెరబట్టారు

పెద్దపల్లి: ఇటుక బట్టీ నిర్వాహకులు చెరువులను చెర బడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించి వాటి విధ్వంసానికి పాల్పడుతున్నారు. చెరువులో పూడిక తీస్తున్నారని నీటిపారుదలశాఖ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గనులశాఖ, గ్రామానికి చందాలిస్తున్నారని గ్రామాభివృద్ధి కమిటీలు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలోని చెరువులు రూపం కోల్పోతున్నాయి. యంత్రాలతో తోడటమే కాకుండా, జలాశయాల్లోని మట్టిని పూర్తిగా తరలించేందుకు చెరువుల మధ్యలో రోడ్లు నిర్మించారు. ఎక్కడ, ఎంత లోతులో తీయాలనే అంశాలేవి బట్టీ నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది.

**అంతటా అదే దోపిడీ**

ఉమ్మడి జిల్లాలో ఇటుక తయారీ పరిశ్రమకు సంబంధించి పెద్దపల్లి ప్రాంతంలో నాణ్యమైన చెరువు మట్టితోపాటు ఎన్టీపీసీ బూడిద అందుబాటులో ఉండటంతో.. ఈ ప్రాంతంలో 200కుపైగా ఇటుక తయారీ పరిశ్రమలున్నాయి. వీటికి అవసరమైన మట్టిని సమీప చెరువుల నుంచి తరలిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ తరలింపు ప్రక్రియ తరుచూ వివాదస్పదమవుతోంది. చెరువులో ఒక మీటరు కంటే ఎక్కువ లోతు మట్టి తీయొద్దనే నిబంధన ఎక్కడ అమలు కావడంలేదు. భారీ యంత్రాలతో తరలించడంతో కనీసం పది నుంచి 20 అడుగుల గుంతలు ఏర్పడుతున్నాయి.

**రెట్టింపు పరిమాణంలో తరలింపు**

తాజాగా పెద్దపల్లి మండలం బొంపల్లిలోని రాచర్లకుంటలో ఏకంగా రోడ్డును నిర్మించి, మట్టిని తరలిస్తున్నారు. వర్షం నీరు చెరువులోకి రాకుండా చుట్టూ కందకాలు తవ్వి, నీటిని బయటకు పంపించేందుకు కచ్చా కాలువలు తవ్వారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో చెరువుల నుంచి అనుమతించిన దాటికంటే రెట్టింపు పరిమాణంలో మట్టిని తరలిస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో చెరువులతోపాటు మానేరు జలాశయం నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. గతేడాది ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి మట్టి తరలించడం వివాదానికి దారితీసింది.

**భారీగా వసూళ్లు**

బట్టీ నిర్వాహకుల బలహీనతను ఆసరా చేసుకొని మట్టి ధరను రెట్టింపు చేయడంపై ఉన్న దృష్టి చెరువు పరిరక్షణపై లేకుండా పోతుంది. నిబంధనల ప్రకారం మట్టి లేదా ఇసుకకు క్యూబిక్ మీటర్ చొప్పున రేటు నిర్ణయించి పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో టిప్పర్(సుమారు 40 మెట్రిక్ టన్నులు)కు రూ.వెయ్యి వరకు చెల్లిస్తే సరిపోతుంది. అయితే పెద్దపల్లిలో మాత్రం దాదాపు రూ.2700 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు బావుల మాదిరిగా మారిపోయి, దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. చెరువుల్లో మోటార్లు పెట్టుకొని రైతులు సాగు చేసే దుస్థితి వచ్చినా ఆశ్చర్యం కలగకపోవచ్చు.

# అధ్వానంగా అంతర్గత రోడ్లు



సిరిసిల్ల : ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట జ్యోతినగర్‌లోనిది. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలుగా మారుతుండగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బురద కారణంగా అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమై ఏళ్లు గడిచినా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇది సిరిసిల్ల నుంచి పెద్దబోనాల వెళ్లే రోడ్డు. ఈ దారిగుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు అధ్వానంగా మారుతుంది. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.సిరిసిల్ల మున్సిపాల్టీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన, లింకు, విలీన గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు కావడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడమే కాకుండా, రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. విలీన గ్రామాల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. చంద్రంపేట, జ్యోతినగర్, ఇప్పల్లపలి, పెద్దూరు తదితర గ్రామాల్లో ఇప్పటికీ చాలాచోట్ల మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. బురద రోడ్ల మీదనే ప్రయాణాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీలో కనిస మౌలిక వసుతులు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**బురదతో అవస్థలు**

చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. బురద రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్లు నిర్మాణం చేపడతామని అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ చంద్రంపేట

సీసీ నిర్మాణం చేపట్టాలిపట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లపై వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. బురద రోడ్లపై ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాజు, 12వ వార్డు

సిరిసిల్ల పట్టణ స్వరూపం

| | |
|---|---|
| వార్డులు | : 39 |
| పట్టణ జనాభా | : 1,16,938 |
| పట్టణంలో రోడ్లు | : 276.91 కి.మీ |
| బీటీ రోడ్లు | : 40.33 కి.మీ |
| సీసీ రోడ్లు | : 137.44 కి.మీ |

# కిలో ధర రూ.కోటి



హైదరాబాద్: ఒక్క గ్రాము రూ.10 వేలు.. కిలో ధర రూ.కోటి. ఇదేదో బంగారం అంతకంటే ఖరీదైన వస్తువు విలువ కాదు.. విదేశాల నుంచి తెస్తున్న కొత్త రకం గంజాయి ధర. రాజధానిలో ఇప్పటివరకూ గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతుండగా కొత్తగా హైడ్రోపోనిక్ గంజాయి దర్యాప్తు సంస్థలకు చిక్కుతోంది. మత్తు పదార్థాలకు పెరుగుతున్న డిమాండ్‌తో అంతర్జాతీయ డ్రగ్ ముఠాలు ఈ మత్తు పదార్థాన్ని గుట్టుగా నగరానికి చేరవేస్తున్నాయి. ఇప్పటికే ఆంధ్రా- ఒడిశా సరిహద్దులు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి గంజాయి.. గోవా, బెంగళూరు, ముంబయి నుంచి డ్రగ్స్ రవాణా జరుగుతుండగా ఏకంగా విదేశాల నుంచి ప్రత్యేక గంజాయి రావడం ఆందోళన కలిగిస్తోంది. నెలరోజుల వ్యవధిలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.53 కోట్ల గంజాయిని నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ), డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలను దాటుకుని వినియోగదారులకు చేరుతున్న సరకు అంతకు రెట్టింపు ఉంటుందని అధికారుల అంచనా.

**హైడ్రోపోనిక్ గంజాయి అంటే..?**

సాధారణంగా గంజాయి మొక్కల్ని మారుమూల ప్రాంతాల్లో నేలపై సాగు చేస్తుంటారు. పంట చేతికి రావడానికి 4నెలలు అంతకంటే ఎక్కువ సమయం పడుతుంది. హైడ్రోపోనిక్ గంజాయిని మట్టికి బదులు ప్రయోగశాలల్లో పెంచుతారు. రహస్య ప్రాంతాల్లో ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ఉష్ణోగ్రతను నియంత్రించే విధానంలో సూక్ష్మ పోషకాలున్న ద్రవ పదార్థాలను మొక్కలకు అందిస్తుంటారు. దీనివల్ల మొక్క వేగంగా పెరిగి పంట చేతికొస్తుంది. ప్రత్యేక పద్ధతుల్లో పోషకాలు అందించడం ద్వారా ఇందులో మత్తు శాతం ఎక్కువగా ఉంటుంది. సాధారణ గంజాయితో పోలిస్తే హైడ్రోపోనిక్ గంజాయిలో 30శాతం మత్తు అధికంగా, కొకైన్‌తో సమానంగా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

**విదేశాల నుంచి దిగుమతి**

ఈ కొత్త రకం మత్తు పదార్థం విదేశాల నుంచి.. ముఖ్యంగా థాయ్‌లాండ్ నుంచి వస్తోంది. ఇటీవల రెండుసార్లు పట్టుబడ్డ సరకు అక్కడి నుంచే వచ్చినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని దేశాల్లో నిషేధం లేకపోవడంతో సాగు చేయిస్తున్న స్మగ్లింగ్ ముఠాలు దాన్ని ముఖ్యంగా మహిళలతో భారత్‌కు రవాణా చేయిస్తున్నాయి.

ఇటీవల పట్టుబడిన ఉదంతాలు..

30 జులై 2025: శంషాబాద్ విమానాశ్రయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఓ మహిళను అదుపులోకి తీసుకుని బ్యాగుల్ని తనిఖీ చేయగా 40కిలోల సరకు పట్టుబడింది.

12 ఆగస్టు 2025: విమానాశ్రయంలో ప్రయాణికురాలి లగేజీని తనిఖీ చేయగా రూ.13 కోట్ల 13 కిలోల సరకు లభించింది. దీన్ని బ్యాంకాక్‌నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తించారు.

# నిరభ్యంతరం.. ఇక సులభతరం



హైదరాబాద్: ప్రొవిజినల్ ఎన్‌వోసీ, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీని అగ్నిమాపకశాఖ సులభతరం చేసింది. వేర్వేరు దశల్లో స్క్రూటినీ ప్రక్రియలో మార్పులు చేసింది. కొందరి అధికారులపైనే భారం వేయకుండా అనుమతుల జారీ ప్రక్రియలో పని విభజనను అవలంబిస్తుండటంతో తక్కువ సమయంలోనే సర్టిఫికెట్లు చేతికందుతున్నాయి.

**పకడ్బందీగా నిబంధనల అమలు**

నిర్మాణాలు ప్రారంభించే ముందు ప్రివిలేజ్ ఎన్‌వోసీ, నిర్మించిన తర్వాత డిజైన్ ఆధారంగా రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారా..? అని పరిశీలించిన అనంతరం అగ్నిమాపకశాఖ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేస్తోంది. ఈ క్రమంలో దరఖాస్తులో వివరాల నమోదు సమయంలో ఏఏ ధ్రువపత్రాలు సమర్పించాలో, ఎన్‌బీసీ మార్గదర్శకాలు ఏమున్నాయో వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తున్నారు. గతంలో సమన్వయం లోపంతో ప్రక్రియ ఆలస్యమయ్యేది. ఉదాహరణకు..ఓ ఖాళీ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించాలనుకుంటే.. ముందుగా సైట్‌ప్లాన్, బేస్‌మెంట్ ఫ్లోర్‌ప్లాన్, గ్రౌండ్‌ఫ్లోర్ ప్లాన్, టెర్రస్‌ప్లాన్, సెక్షన్ ప్లాన్, ఎలివేషన్ ప్లాన్ తదితర వివరాలు, చిత్రాలను అప్‌లోడ్ చేసేలా నిబంధనలు మార్చారు. హైరైజ్ బిల్డింగులకు అయితే అగ్నిమాపక వాహనాలు వెళ్లేలా మార్గం ఏర్పాటు తదితర నిబంధనలు పాటించాలి.

**నాలుగు దశలకు బదులుగా..**

గతంలో ఎన్‌వోసీ జారీ ప్రక్రియ ఆయా ప్రాంతాలకు కేంద్రీకృతంగానే జరిగేది.. కొందరి అధికారులపైనే భారం పడేది. ప్రస్తుతం అన్నిజోన్లలోని అధికారులు ఎన్‌వోసీలు జారీ చేసేలా పని విభజన చేశారు. ఉదాహరణకు ఐటీ ప్రాంతంలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉండటంతో నిర్దేశిత సమయంలో అధికారి పని పూర్తి చేయకపోతే.. మరో అధికారికి బదిలీ చేస్తారు. గతంలో నాలుగు దశల్లో స్క్రూటినీ చేసేవారు.. ఇప్పుడా విధానానికి స్వస్తి పలకడంతో సమయం ఆదా అవుతోంది.

# సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 'సెస్' జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్లు గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించారు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది.సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

# వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం


సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

చురకలు



# చిన్నారులకు సన్నబియ్యం

అల్లవరం : కూటమి అధికారంలోకి రాగానే చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇక నుంచి రోజూ రుచికరమైన పౌష్టికాహారం అందనుంది. త్వరలోనే కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనికి సంబంధించి యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

**ప్రక్షాళన దిశగా..**

ఇప్పటికే మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్పు చేశారు. పలు రకాల పుస్తకాలు, వస్తువులను అందిస్తున్నారు. కేంద్రాల వద్దే కూరగాయలు పండించి వాటినే విద్యార్థులకు వండి పెట్టేలా కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసేందుకు రూ.10వేల ప్రోత్సాహకాన్ని అందించారు. తాజాగా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సన్నబియ్యం అందించేందుకు నిర్ణయించారు.

**ప్రభుత్వ బడుల మాదిరిగానే..**

క్యూఆర్ కోడ్‌తో ఉన్న సన్నబియ్యం బస్తాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అందించనున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈక్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎన్ని బస్తాలు దిగుమతి చేశారనే విషయాన్ని ఆన్‌లైన్‌లో నమోదు



చేయాల్సి ఉంటుంది.

**ఎక్కడి నుంచైనా..** అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పోషకాహారాన్ని ఇకపై ఎక్కడి నుంచైనా పొందేలా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు కేంద్రాలకు వచ్చిన వారికి మాత్రమే పోషకాహారం అందిస్తున్నారు. రానివారు ఆ నెలకు సంబంధించి పోషకాహార కిట్లు కోల్పోతున్నారు. ఇకపై ఈ రకమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదు. పోషణ్ ట్రాకర్ యాప్‌లోనే మైగ్రేషన్ ఆప్షన్‌ను ప్రవేశ పెట్టారు. దీంతో సరకులు ఎక్కడి నుంచైనా పొందే అవకాశం ఏర్పడనుంది.

**ఎంతోమందికి మేలు–విజయకుమారి, ఐసీడీఎస్, పీడీ** మైగ్రేషన్ ఆప్షన్ కల్పించడంతో ఎంతో మంది లబ్ధిదారులకు మేలు జరగనుంది. ఉపాధి నిమిత్తం, కాన్పులకు పుట్టింటికి వెళ్లిన వారికి అక్కడే నేరుగా పోషకాహారం తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. కేంద్రాలకు సన్నబియ్యం సరఫరాపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

# చెత్త బండి.. సరకులు ఇస్తుంది..!

అమలాపురం: ఇంట్లో వ్యర్థాలు పడేసేందుకు చెత్త బండి ఎప్పుడు వస్తుందా..? అని ఎదురు చూస్తాం. అదే బండి చెత్త తీసుకుని సరకులు ఇస్తుందంటా నమ్ముతారా..? స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఓ పంచాయతీలో ఇలా చేస్తున్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో స్వచ్ఛ రథం పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి ఆగస్టు 15న శ్రీకారం చుట్టారు. త్వరలోనే జిల్లాలోని మరో మూడు చోట్ల ఈ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా ఇటీవల ప్రతిపాదనలు పంపారు.

**ఎలా సాగుతుందంటే..**

అమలాపురం మండలం కామనగరువు పంచాయతీకి స్వచ్ఛ రథాన్ని కేటాయించారు. ఈ వాహనంతో పంచాయతీలోని ప్రతి కాలనీకి వెళ్లి నిరుపయోగంగా ఉండే తడి, పొడి చెత్త, వస్తువులుంటే తెచ్చి ఇవ్వాలని ప్రచారం చేస్తున్నారు. ప్లాస్టిక్, పాత వస్తువులు, పొడి చెత్తకు సమానమైన నిత్యావసరాలను అందిస్తున్నారు. దీనికి 'స్వచ్ఛ బంధు' పేరిట సిబ్బందిని నియమించి నిధుల ఆధారంగా రూ.25వేల వరకు గౌరవ వేతనంగా ఇస్తున్నారు.

**మరో మూడు చోట్ల..**

జిల్లాలోని రాజోలు, రామచంద్రపురం, కొత్తపేటలో ఈ వాహనాలను కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈ వాహనాలు అందుబాటులోకొస్తే చెత్త వస్తువుల సేకరణ పెరగనుంది.

**ఈ వస్తువులు తీసుకుంటారు..**

ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, పుస్తకాలు, పాల ప్యాకెట్ల కవర్లు, అట్టలు, ప్యాకింగ్ కవర్లు, నూనె డబ్బాలు, గాజు సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, కంప్యూటర్లు, కీబోర్డులు, సీడీలు, చరవాణులను తీసుకుంటున్నారు. రోజూ కనీసం 250 కేజీలు సేకరించేలా ప్రణాళికలను రూపొందించి ముందుకు సాగుతున్నారు.

**పక్కాగా అమలు చేస్తున్నాం–డి.శాంతలక్ష్మి, డీపీవో**

పర్యావరణ హితంగా గ్రామాల్ని తీర్చిదిద్దడంతోపాటు చెత్త నుంచి సంపద సృష్టికి స్వచ్ఛ రథం ఉపయోగపడుతుంది. ప్రస్తుతం జిల్లాలోని కామనగరువులో ఈ కార్యక్రమం జరుగుతుంది. త్వరలోనే రాజోలు, కొత్తపేట, రామచంద్రపురం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు పంపాం.

# ముందుకు సాగని మూడు రాష్ట్రాల దారి

ఆలూరు : జిల్లా మీదుగా వెళ్లే మూడు రాష్ట్రాల రహదారి పనులు ముందుకుసాగడం లేదు. కర్ణాటక రాష్ట్రం హగరి నుంచి జిల్లాలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలం మాధవరం, తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల వరకు జాతీయ రహదారి–167 నిర్మాణానికి 2017లో శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ.220 కోట్లు మంజూరు చేసింది.

పనులు చేపట్టేందుకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు జిల్లాలో హాలహర్వి మండలం చింతకుంట గ్రామం నుంచి ఆదోని వరకు పనులు ప్రారంభించి పూర్తిచేశారు. మధ్యలో కొన్ని పనులు చేయకుండా వదిలేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారి వెంట నిత్యం మూడు వేల వాహనాలు వెళ్తుంటాయి.

ఆంధ్ర– కర్ణాటక రాష్ట్రాలను కలిపే వంతెన నిర్మాణ పనులు చింతకుంట వద్ద ఆగిపోయాయి. ఐదు పిల్లర్ల వరకే పనులు చేశారు. మరో ఐదు పిల్లర్లు నిర్మించాల్సి ఉంది.

హాలహర్వి మండలం కామినహాలు– మెదేహాలు మధ్య రహదారి కోతకు గురైంది. ఇక్కడ రెండు వంతెనల వద్ద సుమారు 200 మీటర్ల మేర రోడ్డు వేయాల్సి ఉంది.

ఆలూరు పట్టణంలో కొంత వరకే రహదారి వేశారు. డివైడర్లు వేయకుండా అలాగే వదిలేశారు.

ఆలూరు పట్టణంలో ఇరువైపులా రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. పట్టణంలో ఫుట్‌పాత్ పనులు చేయాల్సి ఉంది.

# మండుతున్న ఖ'నిజం'..!!



విశాఖపట్నం : స్టీల్ ప్లాంటులో కీలక విభాగమైన రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ)ను సరైన ప్రణాళిక లేకుండా నిర్వహిస్తున్నారని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఒప్పంద కార్మికుల తొలగింపు, కన్వేయర్‌ల నిర్వహణ కొరవడటం, కీలక అధికారుల బదిలీ వంటి పరిణామాలు ఆర్ఎంహెచ్‌పీపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా ఉక్కు ఉత్పత్తి వ్యయం పెరుగుతుందంటున్నారు.

**అదనపు ఖర్చుతో:** స్టీలు ప్లాంటు ఏర్పాటు చేశాక మొట్టమొదటిగా నిర్మించిందే ఆర్ఎంహెచ్ ప్లాంటు. నాలుగేళ్లుగా ఇందులో మరమ్మతులు చేయకుండా, విడిభాగాలు అమర్చకుండా నిర్వహణపై చేతులెత్తేశారు. ఎన్ఎండీసీ నుంచి ముడి ఇనుప ఖనిజం రేక్‌ల ద్వారా వస్తుంది. ఒక్కో రేక్‌కు 56 వ్యాగన్స్ ఉండగా, 4వేల టన్నులపైగా ముడి సరకు వస్తుంది. వేగన్ టెప్లర్స్ ద్వారా ఈ ఖనిజాన్ని దిగుమతి చేస్తారు. బాయిలర్ బొగ్గు, లైమ్‌స్టోన్, డోలమైట్ వంటివి ఇక్కడికే వస్తాయి. సింటర్‌ప్లాంట్, థర్మల్‌ప్లాంటు, కోకోవన్, బ్లాస్ట్‌ఫర్నేస్‌లు, ఎస్ఎంఎస్‌కు పంపేందుకు కన్వేయర్లను ఉపయోగిస్తారు. ప్రతిరోజూ ఆర్ఎంహెచ్‌పీ నుంచి కన్వేయర్లపై 25 వేల టన్నుల ఖనిజం వెళ్లాలి. సరైన నిర్వహణ లేక ఐదు వేల టన్నులు మించి వెళ్లడం లేదు. దీంతో టన్నుకు అదనంగా రూ.28 ఖర్చు చేసి డంపర్లతో ప్రతిరోజూ ముడిఖనిజాన్ని బేస్ మిక్స్‌కు తరలిస్తున్నారు.

**సిబ్బంది లేరు... నిర్వహణ చేయరు:** కన్వేయర్స్‌పైనుంచి ముడి సరకు జారిపడగానే వెంటనే శుభ్రం చేయాలి. ఆర్ఎంహెచ్‌పీలో పెద్ద సంఖ్యలో కార్మికులను తొలగించారు. 870 మంది ఒప్పంద కార్మికులున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో కన్వేయర్లపై వెళ్లే ముడిఖనిజం ఎక్కడికక్కడ ఆగిపోయే సమస్యలెక్కువ. ఈ నేపథ్యంలో సాధారణంగా ఉన్న ఒప్పంద కార్మికులతోపాటు అదనంగా మాన్‌సూన్ లేబర్ పేరుతో 120 మందిని నియమించుకుంటారు. అయితే ఉన్నవాళ్లనే తొలగించడంతో... ఈనెల 5వ తేదీ వరకు వీఆర్ఎస్‌కు అనుమతి పొందిన కొందరు ఉద్యోగులతో ఇక్కడి పనులు చేయించారనే ఆరోపణలొస్తున్నాయి. తాజాగా కన్వేయర్ బెల్ట్ తెగడం కూడా కలకలం రేపుతోంది. అది తెగిపోయిందా... కావాలనే చేశారా అన్నది తేలాల్చి ఉంది.

**అగ్గిరాజుకున్నా..**

ఆర్ఎంహెచ్‌పీలోని కోల్ యార్డులో బొగ్గు నిల్వలుంటాయి. ప్రధానంగా బాయిలర్ కోల్ నిల్వల్లో ఎయిర్ గ్యాప్స్ ఉండటం వల్ల ఆక్సిజన్‌తో కలిసి అగ్గిరాజుకుంటుండటం సాధారణం. ఈ మంటలను ఆర్పడానికి, అగ్గిరాజుకోకుండా ఉండటానికి స్ప్రింక్లర్లు, పైపులతో నీటిని చల్లడానికి ప్రతిరోజూ ఒప్పంద కార్మికులుండేవారు. ప్రస్తుతం కార్మికుల కొరతతో బొగ్గు నిల్వలకు మంటలు తీవ్రంగా వ్యాపించే వరకు గుర్తించే పరిస్థితి ఉండటం లేదు. **పర్యవేక్షణ అధికారులను మార్పుచేస్తూ..**

ఆర్ఎంహెచ్‌పీపై అవగాహన ఉన్న పర్యవేక్షణాధికారులు (హెచ్‌వోడీ)లను రోజుల వ్యవధిలో నలుగురిని మార్చేశారు. ఈ నెల 3, 4తేదీల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ ఇన్‌ఛార్జులను తప్పించారు. కన్వేయర్ విధానంపై కనీస అవగాహన లేని ఇతర విభాగాల నుంచి అధికారులను తెచ్చి ఇక్కడ నియమిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పౌరసరఫరాలు మరింత స్మార్ట్



నర్సీపట్నం : రేషన్ డిపోలు స్మార్ట్‌గా మారుతున్నాయి. రేషన్ కార్డులు, ఈ–పోస్ యంత్రాలు ఆధునికత హంగులద్దుకున్నాయి. పాత రేషన్ కార్డులకు బదులు ప్రభుత్వం స్మార్ట్ కార్డులు అందిస్తోంది. 24 మండలాల్లో 1,063 డిపోల పరిధిలో 5,32,340 మంది లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయనున్నారు. వైకాపా ప్రభుత్వం కార్డులను ఆ పార్టీ రంగులతో ముద్రించగా.. కూటమి ప్రభుత్వం ఆధునిక విధానాల దిశగా అడుగులు వేసింది. స్మార్ట్ కార్డులు ఏటీఎం కార్డ్ తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఉన్నాయి. కార్డుకు ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారుడి ఫొటో, చౌక దుకాణం నంబరు ఉంటాయి. రెండో వైపు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. సభాపతి అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా శుక్రవారం నర్సీపట్నంలో లబ్ధిదారులకు కార్డులను అందజేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి చెప్పారు. అనంతరం 1,063 డిపోల పరిధిలో సచివాలయ ఉద్యోగులు, డీలర్లు ఇంటింటికి వెళ్లి కార్డులకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు, చిరునామా, డిపో ఐడీ తెలుసుకోవచ్చు. నర్సీపట్నం నియోజకవర్గంలో 83,799 మంది లబ్ధిదారులకు కార్డులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పౌరసరఫరాల ఉప తహసీల్దారు చందనరేఖ చెప్పారు. జిల్లాలో కొత్త రేషన్‌కార్డులకు 3501 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2 వేలకు పైగా ఆమోదం తెలిపారు.

**ఈ–పోస్‌కూ కొత్త హంగులు**

కార్డులతో డిపోల్లోని ఈ–పోస్ యంత్రాలు సైతం స్మార్ట్‌గా మారనున్నాయి. డిపోల వద్ద ప్రస్తుతం వినియోగిస్తున్న యంత్రాలు సరిగా పనిచేయడం లేదు. కీప్యాడ్‌లు సరిగా పనిచేయకపోవడం, సర్వర్లకు సిగ్నల్ రాకపోవడం, తరచూ ఛార్జింగ్ తగ్గిపోవడంతో సరకులు అందించే క్రమంలో ఇబ్బంది ఎదురవుతోంది. కొత్త ఈ–పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డును స్వైప్ చేసి సరకులను తీసుకోవచ్చు. కొత్త ఈ–పోస్ యంత్రాలను డీలర్లకు ఈనెల 12 నుంచి విడతల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అందించనున్నారు. ఇప్పటికే ఈ యంత్రాలు జిల్లా పౌరసరఫరాల కార్యాలయానికి చేరుకున్నాయి.

**ఇవీ ప్రత్యేకతలు**

కొత్త ఈ–పోస్ టచ్ స్క్రీన్‌తో సరికొత్త సాంకేతికత, సదుపాయాలతో ఉంటుంది. సిమ్ ఉంటుంది. నెట్ లేకపోయినా వైఫై, బ్లూటూత్ అనుసంధానంతో వినియోగించవచ్చు.

స్మార్ట్‌రేషన్ కార్డు స్వైప్ చేయడం ద్వారా ఆటోమేటిక్‌గా కనెక్ట్ అవుతుంది. దీంతో లబ్ధిదారుల పూర్తి వివరాలు వస్తాయి.

బయోమెట్రిక్ సదుపాయం సైతం అందుబాటులో ఉంది. వేలిముద్ర పడకపోతే కెమెరా ద్వారా ఐరిస్ తీసుకుని సరకులు అందిస్తారు.

జీపీఆర్ఎస్ సౌకర్యం వల్ల డేటా నమోదు అవుతుంది.

# వర్షభయం.. వేగం అవశ్యం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున ప్రారంభించిన శివం టు శివం రోడ్డు పనులు మరింత వేగవంతం చేయాల్సి ఉంది. సాధారణంగా ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటాయి. ఆ సమయంలో సువర్ణముఖి నదిలో ప్రవాహ ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. వర్షాల్లోపు వీలైనంత ఎత్తు పెంచే దిశగా వరద కట్ట పనులు వేగంగా చేపట్టాల్సి ఉంది.

**ఏయే పనులంటే..** సువర్ణముఖి ఆనకట్ట నుంచి రామసేతు వంతెన వరకు కనకాచలాన్ని ఆనుకుని వరద కట్ట పనులు చేస్తున్నారు.

చెంబేడు కాల్వకు నీటి మళ్లింపునకు ఇబ్బందులు లేకుండా కాంక్రీటు పనులు చేపట్టారు. ఈ కాల్వను ఆనుకుని ఉన్న కరకట్టను విస్తరించే పనులు మాత్రమే జరుగుతున్నాయి.

అనుసంధాన రోడ్లపై అనిశ్చితి: ప్రస్తుతం శివం టు శివం రోడ్డు ఏర్పాటు నేపథ్యంలో ఆయా వీధుల నుంచి అనుసంధానం రోడ్లపై ఇంకా స్పష్టత రానట్లు తెలుస్తోంది. పట్టణ ప్రజలకు ఎలాంటి అవస్థలు తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్యలకు అవకాశం లేకుండా అనుసంధాన రోడ్లు ఏర్పాటు చేపట్టాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను గతంలో ఆదేశించిన విషయం తెలిసిందే. ఏదీ ఏమైనా ఈ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పట్టణ ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది.

**త్వరితగతిన చేయిస్తాం..**

శివం టు శివం రోడ్డు పనుల అభివృద్ధి సువర్ణముఖి నదికి వరద తాకిడి దృష్ట్యా పనులు మరింత వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించాం. అందుకు తగ్గట్లు పనుల్లో పురోగతి కోసం అధికారులు, గుత్తేదారులకు సూచనలు ఇచ్చాం. అడ్డంకులు ఏర్పడకుండా ప్రణాళిక బద్ధంగా పనులు చేపడుతున్నాం. మురళీధర్‌రెడ్డి, ఈఈ, శ్రీకాళహస్తీశ్వరాలయం

పనుల విలువ: రూ.29 కోట్లు

రహదారి పొడవు: 2.75 కి.మీ.

# ఉల్లి రాసుల్లో కన్నీటి సుడులు

కర్నూలు : కర్నూలు మార్కెట్ యార్డు ఉల్లి సంచులతో నిండిపోయింది. క్వింటా రూ.1200తో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుండటంతో సరకు భారీగా పోటెత్తుతోంది. ఆగస్టు 31 నుంచి కొనుగోళు ప్రారంభించగా ఇప్పటికే వేల టన్నులు కొన్నారు. వాటిని ఏం చేయాలో తెలియక మార్కెట్‌లోనే నిల్వ చేశారు. రైతులు కొత్తగా తెచ్చిన సరకు దించేందుకు అడుగు స్థలం లేదు. వేల టన్నుల సరకు వాహనాల్లోనే ఉంది. కొనుగోలు చేసిన సరకును ఎప్పటికప్పుడు బయటకు తరలించడంలో విఫలమవడం రైతుల పాలిట శాపంగా మారింది.

**60 శాతం మార్కెట్‌లోనే**

మార్క్‌ఫెడ్ ద్వారా ఆగస్టు 31 నుంచి ఈనెల 11వ తేదీ వరకు 3,920 టన్నులు కొనుగోలు చేశారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మరో 268 టన్నులు కొన్నారు. మొత్తం 4,084 టన్నులు కొనుగోలు చేయగా.. ఇందులో 40 శాతం అంటే 1,632 టన్నులే బయటకు తరలించారు. ఇంకా 2,452.00 టన్నుల ఉల్లి నిల్వలు (60 శాతం) ఐదు రోజులుగా వ్యవసాయ మార్కెట్‌లోనే పేరుకుపోయాయి. దీంతో రోజువారీ కొత్తగా వచ్చే సరకు దించేందుకు స్థలం కొరత వేధిస్తోంది.

**కొన్నారు.. కుళ్లబెట్టారు**

తెల్లవారుజామున కురిసిన వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వం కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు తడిసిపోయాయి. రూ.కోట్లు ఖర్చుచేసి



కొనుగోలు చేసిన సరకు షెడ్లలోనే కుళ్లిపోతోంది. ఇప్పటికే వందల బస్తాల ఉల్లి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే 200–300 టన్నుల సరకు పాడైపోయింది. కొనుగోలు చేసిన ఉల్లిని సకాలంలో హైదరాబాద్, కోస్తాంధ్ర, వివిధ ప్రాంతాల్లోని రైతుబజార్లకు, పొరుగు జిల్లాలకు సరఫరా చేయడంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబించారు. ఫలితంగా ఉల్లి నిల్వలు కొండలా పేరుకుపోయాయి. రూ.లక్షల విలువ చేసే సరకు కుళ్లిపోవడంతో పారబోయాల్సి వచ్చింది.

**సరకంతా వర్షార్పణం**

రోజువారీగా మార్కెట్‌కు వచ్చే ఉల్లి వాహనాలను అర్ధరాత్రి 12 గంటలకు మార్కెట్ లోపలికి అనుమతిస్తారు. ఇదే విధంగా బుధవారం అర్ధరాత్రి ఉల్లి వాహనాలను మార్కెట్‌లోకి అనుమతించారు. జంబోషెడ్డు, ఉల్లి షెడ్లలో గత నాలుగైదు రోజులుగా కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు కొండలా పేరుకుపోయాయి. దీంతో రైతులు తెచ్చిన సరకు ట్రాక్టర్లు, ట్రాలీ జీపులు, లారీల్లోనే ఉండిపోయింది.

ఉల్లి నిల్వలను వాహనాల్లోనే ఉంచాలని షెడ్లలోకి దించొద్దని మార్కెట్ కమిటీ అధికారులు రైతులకు తెలిపారు. దీంతో గురువారం ఉదయం 10 గంటల వరకు సరకంతా వాహనాల్లోనే ఉండిపోయింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు కర్నూలులో మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

మార్కెట్ కమిటీ వారు రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేయాలి. గురువారం ఒక్క రైతుకు కూడా మార్కెట్ కమిటీ వారు టార్పాలిన్లు అందజేయలేదు. తడుస్తున్నా పట్టించుకోలేదని రైతులు వాపోయారు.

# ఆదాయ గనులు

నంద్యాల : ఉమ్మడి జిల్లాలో గ్రానైట్ తదితర క్వారీల నుంచి సీనరేజీ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఇటీవల నిర్వహించిన టెండర్లలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పోటీ పడి నెలకు రూ.14.05 కోట్ల చొప్పున చెల్లించేందుకు ముందుకొచ్చింది. రెండేళ్లపాటు ప్రభుత్వానికి సదరు సంస్థ రూ.336 కోట్లు జమ చేయనుంది. ఇందుకు సంబంధించి గనుల శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సదరు సంస్థ ఈనెల 25 నుంచి సీనరేజీ వసూలు చేయనుంది. అప్పటిలోగా కర్నూలు, నంద్యాల జిల్లాలోని క్వారీలను సదరు సంస్థకు భూగర్భ గనుల శాఖ అధికారులు అప్పగించనున్నారు.

**గత ఐదేళ్లలో అధోగతి**

కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో 500 క్వారీలున్నాయి. ఇందులో కంకర, గ్రావెల్‌తోపాటు సున్నపురాయి, సిలికా శాండ్, ఐరన్‌ఓర్, రోడ్ మెటల్, సోప్ స్టోన్స్, వైట్ షెల్, క్వార్ట్జ్, డోలమైట్ తదితర చిన్న క్వారీలు ఉన్నాయి. వీటి నుంచి రాళ్లు, గ్రావెల్ తదితరాలు బయటకు రావాలంటే సీనరేజీ చెల్లించాలి. క్వారీలు పెద్ద నాయకుల చేతిలో ఉ



ండడం, రాజకీయ ఒత్తిళ్లు తీవ్రస్థాయిలో ఉండడం, ఆధిపత్య ధోరణి తదితర కారణాలతో పన్ను వసూళ్లు తగ్గాయి. అధికారులు కొన్నిసార్లు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా గనుల శాఖ పెద్దఎత్తున ఆదాయం కోల్పోతోంది. ఈ పరిస్థితిలో సీనరేజీ వసూలు బాధ్యతను ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అప్పగించింది.

**ఇక నుంచి లెక్క పక్కా**

ఇప్పటివరకు గనుల శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది సీనరేజీ వసూలు చేసేవారు. ఇక నుంచి ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యత తీసుకోనున్నారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ప్రతి నెలా సదరు గుత్తేదారు సంస్థ ఉమ్మడి జిల్లాకు సంబంధించి రూ.14 కోట్లను కచ్చితంగా చెల్లించాల్సి ఉంటుంది. కొలతల ప్రకారం ఎంత ముడి సరకు క్వారీల నుంచి బయటకు వెళ్లిందో స్పష్టంగా లెక్కించి ఆ మేరకు పన్నులు వసూలు చేయనుంది. సీనరేజీ అంచనా వేసిన మేరకు విభాగాల వారీగా సంబంధిత ప్రభుత్వ ఖాతాలకు నెలవారీగా సొమ్మును జమ చేయాల్సి ఉంటుంది. గ్రానైట్, కంకర తదితరాల మాదిరిగానేకాక గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తరలించినా పన్ను కట్టాల్సిందే. సొంత పొలంలో తవ్వకాలు చేసినా సీనరేజీ చెల్లించాల్సిందే.

చురకలు



## మా'గోడ' ఆలకించండయ్యా..!

చిత్తూరు: చిత్తూరు మండలం గువ్వకల్లు పంచాయతీలో ఇళ్లు లేని పేదలకు గత ప్రభుత్వం గుట్టలో ఇంటి స్థలాలు కేటాయించింది. సొంతింటి కల సాకారమవుతుందనే ఆశతో పేదలు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టారు. కాలనీ పక్కనే చిత్తూరు-తచ్చూరు రహదారి నిర్మాణం చేపట్టడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషపడ్డారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వారి ఆశలపై హైవే అధికారులు నీళు చల్లారు. గ్రామానికి దారి లేకుండా ప్రమాదాల నివారణకు అధికారులు నిర్మించిన ప్రహరీ రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వారు పేర్కొంటున్నారు. చిత్తూరు మండలం మీదుగా అనుపల్లె, బండపల్లె, గోపాలపురం, గొల్లపల్లె, ఎగుమాసాపల్లె, దిగుమాసాపల్లె, మత్తుకూరు, ఐనవేడు గ్రామాల గుండా చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి



వెళ్తుంది. రహదారి వెంబడి ప్రహరీ నిర్మించడంతో సమీపంలోని పొలాలకు వెళ్లడానికి దారి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడో దూరంగా ఉండే అండర్‌పాస్‌ల దగ్గరికెళ్లి చుట్టూ తిరిగి రావడంతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. పైగా సర్వీసు రోడ్డు సైతం పూర్తి చేయకపోవడంతో మరింత ఇబ్బందిగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి భూసేకరణ ప్రక్రియలో పొలాలు, గ్రామాలకు ఇరువైపులా దారి సౌకర్యం కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఈ హామీని అధికారులు పూర్తిగా విస్మరించారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.
విజయశేఖర్‌రెడ్డి, గువ్వకల్లు

## ఇలా ఉంటే.. పనులవుతాయా..?

చిత్తూరు : ఐదేళ్ల వైకాపా పాలనలో ఏపీఎస్పీడీసీఎల్ అవినీతి అక్రమాల్లో కూరుకుపోయింది. వైకాపాతో అంటకాగిన అధికారులు ఇష్టానుసారం రూ.కోట్లు మింగేశారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి 15 నెలలు కావస్తున్నా.. ఇంకా వైకాపాతో అంటకాగిన అధికారుల హవానే కొనసాగుతుండటం గమనార్హం. గతేడాది డిసెంబరు నుంచి ఉద్యోగుల ఉద్యోగోన్నతు(పదోన్నతుల)ల ప్రక్రియ ముందుకు సాగలేదు.. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో ఆ శాఖ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

**ఇదీ పరిస్థితి..**ఖాళీల కారణంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్‌డీఎస్ఎస్ ప్రాజెక్టు పనులు ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఐదు ఉమ్మడి చిత్తూరు, కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ముందుకు సాగడం లేదు. పోస్టుల ఖాళీలతో ప్రాజెక్టు పనుల పర్యవేక్షణ



పూర్తిగా కొరవడింది. పనుల్లో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి.. ముందుకెళ్లడంలో సంస్థ విఫలమవుతోందనే ఆరోపణలున్నాయి. కీలకమైన పోస్టులు.. ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తుండటంతో ఆశించిన ప్రగతి లేదని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. విద్యుత్తు వినియోగదారులకు సత్వర మెరుగైన సేవలు కష్టతరంగా మారాయి. కొత్తగా ఉప-కేంద్రాలు, విద్యుత్తు లైన్లు ఏర్పాటు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు సర్వీసుల జారీ సకాలంలో కావడం లేదు.

## కొరవడిన 'చెత్త'శుద్ధి..!

రాజమహేంద్రవరం : జిల్లాలో పలు పట్టణాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా పురపాలికల్లో పారిశుద్ధ్య లోపం, కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, చెత్త నిల్వలతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజారోగ్యం మంచం పడుతోంది. ఆయా పట్టణాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రాంతాలు గుర్తించేలా ప్రత్యేక సర్వే నిర్వహించి అపరిశుభ్ర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్‌లు) గుర్తించారు. దీనికి సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. ఆయా ప్రాంతాల్లో తక్షణం పారిశుద్ధ్య చర్యలు తీసుకోనున్నారు.

**ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకున్నారంటే**



జిల్లాలోని పురపాలికల్లో సచివాలయం వ్యవస్థ సర్వే నిర్వహించింది. దీని కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఆయా డివిజన్ పరిధిలోని సచివాలయం సెక్రటరీతోపాటు పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షక ఉద్యోగి, ఏఎన్ఎం, శానిటరీ ఇన్‌స్పెక్టరు కలిసి పరిశీలించా రు. పురవీధుల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా నిర్ధారించారు. వీటితోపాటు కాలువల్లో పూడికలు తొలగించకపోవడం, మురుగునీరు రహదారిపై ప్రవహించడం, ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడం వంటి వాటిని కూడా ప్రామాణికంగా తీసుకున్నారు. అత్యధికంగా రాజమహేంద్రవరంలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించారు. మరోవైపు మురుగు కాలువలు సైతం అధ్వానంగా ఉన్నాయి.

**యాప్‌లో సమాచారం పొందుపరుస్తూ..**

అపారిశుద్ధ్య ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ నిరంతరం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలువల్లో పూడికలు తొలగించడానికి కార్యాచరణ చేపట్టాలని పురపాలికశాఖ యంత్రాంగా న్ని ఆదేశించింది. ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సమాచారాన్ని యాప్‌లో పొందుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించింది.

# ఉక్కపోత... కుండపోత



అనంతపురం : జిల్లాలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. గత వారం రోజులుగా ఉక్కపోతతో జనం ఉక్కిబిక్కిరయ్యారు. వేసవి కాలాన్ని తలపించింది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. పలు మండలాల్లో భారీ వర్షం కురువడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, చెక్‌డ్యాంల్లో నీటితో కళకళలాడుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురిసింది. సగటున 47.6 మి.మీ వర్షపాతం నమోదైంది. 14 మండలాల్లో 50 మి.మీపైగా వర్షం కురిసింది.

**కొన్ని మండలాల్లో ఇలా..**

యల్లనూరు మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. కణేకల్లులో 94.0, ఉరవకొండ 90.2, పామిడిలో 88.6, గుత్తి 86.2, విడపనకల్లు 79.0, రాప్తాడు 78.4, వజ్రకరూరు 77.8, గుంతకల్లు 74.2, నార్పల 64.6, పుట్లూరు 64.2, శింగనమల 60.2, యాడికి 57.2, కళ్యాణదుర్గం 50.2, పెద్దవడుగూరు 47.0, బుక్కరాయసముద్రం 45.0, తాడిపత్రి 44.2, గార్లదిన్నె 43.4, డి.హీరేహాళ్ 37.2, అనంతపురం అర్బన్ 36.0, అనంతపురం గ్రామీణం 34.2, పెద్దపప్పూరు 31.8, ఆత్మకూరు 30.2, బొమ్మనహాళ్ 27.2, బ్రహ్మసముద్రం 20.0, రాయదుర్గం 16.6, కూడేరు 11.2, శెట్టూరు, కంబదూరు, గుమ్మఘట్ట, బెళుగుప్ప, కుందుర్పి మండలాల్లో చిరుజల్లులు పడ్డాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్‌కుమార్ తెలిపారు.

**258 ఎకరాల్లో పంట నష్టం**

కణేకల్లు మండల పరిధిలో 109 మంది రైతులకు సంబంధించి 247 ఎకరాల్లో వరి, వేరుసెనగ పంటలు దెబ్బతిన్నాయి. వరి 40 ఎకరాలు, వేరుసెనగ 207 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు జేడీఏ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. యాడికి, గుత్తి, తాడిపత్రి మండలాల్లో ఎనిమిది మంది రైతులకు సంబంధించి 11 ఎకరాల్లో టమాటా పంట దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ డీడీ ఉమాదేవి పేర్కొన్నారు.

# ఐసీడీఎస్‌లో ఇష్టారాజ్యం!



అనంతపురం : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారంలోనూ అక్రమార్కులు దోచుకుని తింటున్నారు. నాసిరకం సరకులు సరఫరా చేస్తున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఇదే అదనుగా గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గుడ్డు కనీస సైజు 50 గ్రాములకుపైగా ఉండాలి. 20 నుంచి 30 గ్రాముల బరువు కలిగిన గుడ్లను సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పాలు సరఫరా.. అదనపు పౌష్టికాహారంగా ఇచ్చే కిట్లల్లోనూ చేతివాటం చూపిస్తున్నారు. ఇప్పటికే శ్రీసత్యసాయి జిల్లాలో పురుగులు ఉన్న ఎండు ఖర్జూరాన్ని సరఫరా చేశారు. ఇదే దుస్థితి అనంత జిల్లాలోనూ వెలుగు చూసింది. రాగిపిండి, అటుకులు, చిక్కీ, బెల్లం.. ఇలా ప్రతి దాంట్లోనూ కల్తీ ఉన్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేసినా స్పందించేనాథుడే కరవయ్యాడు. బియ్యం, కందిపప్పు, వంటనూనె సరఫరా పూర్తి స్థాయిలో కేంద్రాలకు చేరడం లేదు.

**సక్రమంగా అమలు కాని మెనూ**

ఉమ్మడి జిల్లాలో 5126 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 3.01 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. గర్భిణి/బాలింతలకు నెలకు 5లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, బియ్యం, కందిపప్పు, నూనె, అదనపు ఆహారం కింద కిలో అటుకులు.. రాగిపిండి 2కిలోలు, ఖర్జూరం, చిక్కీ, బెల్లం 250 గ్రాములు ఇవ్వాలి. 3 ఏళ్లలోపు పిల్లలకు 2.5కిలోల బాలామృతం, 30 కోడిగుడ్లు, 2.5లీటర్ల పాలు, 3-6ఏళ్లలోపు బాలలకు 2.5లీటర్ల పాలు, 25కోడిగుడ్లు, మధ్యాహ్న భోజనం కేంద్రాల్లోనే ఇవ్వాలి. ఈ మెనూ సక్రమంగా అమలు కాలేదు. కోడిగుడ్లను ప్రతి నెలా 1, 10, 15, 25 తేదీల్లో నాలుగు విడతల్లో కేంద్రాలకు సరఫరా చేయాలి. పాలు, కిట్లు నెల మొదటి వారంలోనే ఇవ్వాలి. చాలా చోట్ల అమలు కావడం లేదు. వాటిపై అనంత అర్బన్, గుత్తి, కంబదూరు, ఉరవకొండ, కదిరి, ఓడీసీ, ధర్మవరం, మడకశిర, హిందూపురం.. తదితర ప్రాజెక్టుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతి నెలా సీడీపీఓలు కనీసం 20 రోజులు, సూపర్‌వైజర్లు ప్రతి రోజూ రెండు కేంద్రాలను తనిఖీ చేయాలి. చాలా మంది సీడీపీఓలు అసలు ప్రాజెక్టులకే వెళ్లడం లేదు. సరఫరాలో అక్రమాలకు ఒడిగట్టినా బిల్లులో కోత పెట్టడం లేదు. గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై పేదల కడుపు కొడుతున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**

– నాగమణి, పీడీ, ఐసీడీఎస్

పౌష్టికాహారం సరఫరా, నాణ్యతపై ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా ఫిర్యాదు ఇస్తే విచారణ చేస్తాం. గుత్తేదారులపై చర్యలు ఉంటాయి. సీడీపీఓ, సూపర్‌వైజర్లకు ఆదేశాలు ఇస్తాం. మరింత నిఘా పెడతాం.

# వ్యవసాయానికి స్వస్తి.. పొట్టేళ్ల పెంపకంపై దృష్టి



గోరంట్ల వ్యవసాయానికి స్వస్తిపలికి పొట్టేళ్ల పెంపకంపై దృష్టి మళ్లించారు జిల్లాలోని దక్షిణాది మండలాలకు చెందిన యువ రైతులు. పంటలసాగుతో కష్టాలు, నష్టాలు చవిచూసి విసిగిపోయిన తరుణంలో సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయంగా పొట్టేళ్లను పెంచుతున్నారు. కేవలం మూడు మాసాలు శ్రమిస్తే మంచి లాభాలు గడించవచ్చంటున్నారు.

**గోరంట్ల మండలంలోనే 150..**

శ్రీసత్యసాయి జిల్లాలో గోరంట్ల, చిలమత్తూరు, కొత్తచెరువు, ఓబుళదేవరచెరువు, బుక్కపట్నం మండలాల్లో పొట్టేళ్ల పెంపకం షెడ్లు విపరీతంగా కనిపిస్తున్నాయి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రానివారు కూడా ఈరంగాన్ని ఎంచుకుంటున్నారు. ఈక్రమంలో గోరంట్ల మండలంలోనే 150 షెడ్లకు పైగా వెలిశాయి. సుమారు 20వేలు పొట్టేళ్లు పెంపకం జరుగుతోంది.

**అన్ని సౌకర్యాలతో ఏర్పాటు**

ఈ ప్రక్రియలో మొదట నిర్వాహకుడి ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి షెడ్డును నిర్మించుకుంటారు. అనంతరం కర్ణాటకలోని బళ్లారి, సింధనూను ప్రాంతాల నుంచి పిల్లలను ఒక్కోటి రూ.7 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ కేవలం రెండు మూడు నెలల పాటు మేపి డిమాండ్‌ను బట్టి రూ.20 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రత్యక్ష, పరోక్షంగా గోరంట్ల మండలంలో వెయ్యి కుటుంబాలు ఈరంగం నుంచి ఉపాధి పొందుతున్నాయి. వీటిపెంపకంపై అనుభవం ఉన్న నెల్లూరు జిల్లా వాసులు ఉపాధి కోసం గోరంట్లకు వచ్చారు.

**రైతులకు గిట్టుబాటు..**

పొట్టేళ్లు అనతికాలంలోనే బలిష్టం కావడానికి స్థానికంగా లభిస్తున్న వేరుసెనగ పొట్టు, మొక్కజొన్న గింజలు ఆహారంగా వేస్తున్నారు. దీంతో ఈరెండు పంటలు సాగుచేస్తున్న రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. సీకేపల్లి మండలం నుంచి వేరుసెనగ పొట్టు తీసుకొస్తుండగా, మొక్కజొన్నలు ఈపరిధిలోనే లభిస్తున్నట్లు చెబుతున్నారు.

**రెండేళ్లుగా పెంచుతున్నాను** –శ్యాంసుందర్, ఎంఏ, బీఈడీ, కమ్మవారిపల్లి

గతంలో ఓ విద్యాసంస్థలో ప్రిన్సిపల్‌గా కొంతకాలం పనిచేశాను అయితే సంతృప్తినివ్వలేదు. గోరంట్లకు సమీపంలో సొంతస్థలం ఉండడంతో రూ.15లక్షలు వెచ్చించి శాశ్వతంగా షెడ్డు నిర్మించి రెండేళ్లుగా పెంచుతున్నాను. 300 పొట్టేళ్లు మూడు విడుతల్లో ఎంపికచేసి ప్రతినెలా 100 విక్రయించి.. కొత్తవాటిని తీసుకొస్తున్నా. శ్రమ అయినప్పటికీ గిట్టుబాటు ఉంటోంది. స్థానిక వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు.

## సారథి.. పట్టించుకుంటారా

కొవ్వూరు : దశాబ్దాల సేవలకు ప్రతిరూపం రోడ్‌కం రైలు వంతెన. గోదావరి అంటే ఠక్కున కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది ఈ అద్భుత సేతువు. ఈ ప్రాభవం క్రమంగా మసక బారుతోంది. బాగా పాడైతే.. ప్రజాగ్రహం తోడైతే అత్యవసరంగా, హఠాత్తుగా రాకపోకలను ఆపి రోడ్డు నిర్మాణం లేదా చిన్నపాటి మరమ్మతులు, రంగులు వేయడం తప్ప వంతెన పదికాలాలపాటు ఉండే కార్యాచరణకు నోచుకోవడం లేదు. 2023వ సంవత్సరం చివరిలో 45 రోజులపాటు రాకపోకలను నిలిపివేసి ర.భ.శాఖ ఆధ్వర్యంలో రూ.2.10 కోట్లతో వంతెన పొడవునా సెకండరీ జాయింట్ల మరమ్మతులు చేసి రహదారి నిర్మించారు. రూ.కోట్లు ఖర్చు చేసినా నిర్వహణపట్ల అటు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు .

**శిథిలమై ఇలా..**



2.9 కిలోమీటర్ల పొడవున ఉన్న వంతెన హ్యాండ్ రెయిల్స్ శిథిలస్థితికి చేరాయి. సుమారు 1600 మీటర్ల పొడవున సిమెంటు రెయిలింగ్‌ను తొలగించి మైల్డ్‌స్టీల్ రెయిలింగ్ అమర్చారు. గోదావరి నుంచి పైకి రెయిలింగ్ వరకు చాలా చోట్ల రావి మొక్కలు పెరిగి గోడలను దెబ్బతీస్తున్నాయి. కొవ్వూరు వైపు వంతెన నడకమార్గం (ఫుట్‌పాత్)లో సిమెంటు రాళ్లు ధ్వంసమవుతున్నాయి. రావి, ఇతర పిచ్చి, గడ్డి మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. రాళ్ల మధ్య దూరం పెరిగేలా మారి అటు రెయిలింగ్, నడక మార్గాలను దెబ్బతీసేలా తయారయ్యాయి.

ఓ మోస్తరు వర్షం కురిసినా వంతెనపైకి చేరిన నీరు, మట్టి, ఇతర వ్యర్థాలు నడక మార్గానికి చేర్చి ఉన్న జాలీల నుంచి కిందికి వెళ్లే పరిస్థితి లేదు. వంతెన పొడవునా 180 విద్యుద్దీపాలు పూర్తిగా వెలిగిన సందర్భాలు ఎప్పుడూ లేదు..

జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన ప్రాభవాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని.. రైల్వే, రభశా, సంబంధిత శాఖలను సమన్వయం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పేదలకు గూళ్లు.. పెద్దలకే మేళ్లు

కాకినాడ : గత ప్రభుత్వంలో పేదల పేరుతో మంజూరు చేసిన ఇళ్లతో పెద్దలే బాగుపడ్డారు. ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారులకు గృహాలను నిర్మించి ఇస్తామని నమ్మబలికి గుత్తేదారులకు దోచిపెట్టారు. జిల్లాలో 10 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలను అప్పగిస్తే పది శాతం మాత్రమే పూర్తిచేశారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్, గ్రామీణ్ పథకాల్లో 84,934 ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 10,716 గుత్తేదారులకు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం అందించే రూ.1.80 లక్షలకు తోడు లబ్ధిదారులతో రూ.35 వేలు అదనంగా గుత్తేదారులకు అందజేశారు. ఒక్కో ఇంటిపై రూ.2.15 లక్షలు ఖర్చుచేసినా పూర్తిచేయడంలో విఫలమయ్యారు. సొంతంగా ఇల్లు కట్టినవారికి పునాదుల వరకు రూ.50 వేల బిల్లు చెల్లిస్తే, గుత్తేదారులకు రూ.70 వేలు బిల్లు ఇచ్చారు. బిల్లులు చేసుకుని మిగతా పనులు వదిలేసినవే ఎక్కువ.

**ఇష్టారీతిన కట్టబెట్టేశారు..**

జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణ బాధ్యత 13 గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. కొన్నింటికి అనుభవం లేకపోయినా నేతల సిఫార్సులతో ఇచ్చేశారు. ః కొమరగిరిలో 8,795 ఇళ్ల నిర్మాణాలను అప్పగించారు. అందులో 4,400 ఓ సంస్థకు.. మిగతావాటిని పది సంస్థలకు కట్టబెట్టారు. ఓ సంస్థకు 236 ఇళ్ల బాధ్యతలు అప్పగిస్తే ఒక్కటీ పూర్తిచేయలేదు. మరో సంస్థకు 299 కేటాయిస్తే కేవలం 39 మాత్రమే పూర్తిచేశారు. ఇంకో సంస్థకు 550 ఇళ్ల నిర్మాణం అప్పజెప్పగా 490 ఇళ్లు ప్లింత్ బీమ్ దశలో ఉన్నాయి. ః సామర్లకోటలో 679 ఇళ్లకు 167 మాత్రమే పూర్తిచేశారు. పెద్దాపురంలో 591 ఇళ్లకు 137 పూర్తిచేశారు. 200 గూళ్లు పునాదులతో సరి. ః పండూరు లేఅవుట్‌లో 357 గృహాలకు 11 పూర్తయ్యాయి.

**నోటీసులు ఇచ్చినా..**

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని గుత్తేదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చింది. ఒకరిద్దరు మాత్రమే స్పందించారు. కలెక్టర్ షాన్‌మోహన్ వద్ద ప్రస్తావించగా కొంతమందిని తప్పించి వేరేవారికి అప్పగించినట్లు చెప్పారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా చూస్తామన్నారు.

## ఆశల వారధి.. దాటని తీరిది

సఖినేటిపల్లి : తీరప్రాంత ప్రజల చిరకాల కోరికైన సఖినేటిపల్లి-నరసాపురం వంతెన నిర్మాణం అందని ద్రాక్షలా మారింది. సుమారు ఏడు దశాబ్దాల నుంచి ప్రభుత్వాలు మారుతున్నా ఏవిధమైన కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సఖినేటిపల్లి-నరసాపురం వశిష్ఠ గోదావరి రేవులోని పంటుపై ప్రతిరోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. వరదల కారణంగా పంటు ఆగిపోతే ఇబ్బందులు పడాల్సిందే. 1960లో నీలం సంజీవరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే అల్లూరి సత్యనారాయణరాజు ఇక్కడ వారధి నిర్మించాలని ప్రతిపాదనలు తెచ్చారు. 1985లో చేగొండి హరిరామ జోగయ్య, 2003లో మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఫ్లోటింగ్ బ్రిడ్జికి భూమిపూజ చేశారు. 2008లో సీఎంగా రాజశేఖర్‌రెడ్డి రూ.192.40 కోట్లతో ప్రతిపాదనలు చేయగా రూ.67.50 కోట్ల అంచనాతో భూమిపూజ చేశారు. 2016లో ఎమ్మెల్యే మాధవనాయుడు పలువురు ఎమ్మెల్యేలను, ఎంపీలను తీసుకుని కేంద్రమంత్రి నితిన్‌గడ్కారీ వద్దకు వెళ్లి డీపీఆర్ మంజూరు చేయించారు. 2020లో సీఎం జగన్ హయాంలో రామేశ్వరం(సఖినేటిపల్లి)-రాజులంకకు(నరసాపురం) మార్చి రూ.450 కోట్లు మంజూరు చేశారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.580 కోట్లు మంజూరు చేసింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో చర్చించి వంతెన నిర్మాణానికి కృషి చేస్తున్నామని జాతీయ రహదారి నిర్మాణ సంస్థ(భీమవరం) డీఈ శ్రీనివాసరావు తెలిపారు. నిర్మిస్తే ప్రయోజనాలు కోనసీమ వాసులు నరసాపురం, మచిలీపట్నం, ఒంగోలు మీదుగా ప్రయాణం చేయడానికి, పశ్చిమగోదావరి వాసులు అమలాపురం, కాకినాడ వెళ్లడానికి సులువైన మార్గం.

రెండు జిల్లాల తీరప్రాంతాల్లో మత్స్యసంపదను చెన్నై, హౌరా వరకు తక్కువ సమయంలో తరలించొచ్చు. అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి చెందుతుంది. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు(అంతర్వేది, పేరుపాలెం) అభివృద్ధి వేగంగా జరిగి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

## అధనం ఇచ్చేయాల్సిందే

కర్నూలు : వైకాపా ప్రభుత్వ హయాంలో పేదలకు అనువుగాని ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలిచ్చారు. దీనికితోడు గృహ నిర్మాణాలు ప్రారంభించకుంటే పట్టాలు రద్దు చేస్తామని హడావుడి చేశారు. సాయం తక్కువగా ఉండటం.. స్థలాలు జనావాసాలకు దూరంగా ఉండటం.. ఎలాంటి వసతులు లేకపోవడంతో చాలామంది గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. కొంతమంది ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మధ్యలోనే ఆపేశారు.

**నగదు జమ చేసినా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల చొప్పున అదనపు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. వీరిలో చాలామంది గృహ నిర్మాణాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో 'నిర్మాణాలు చేపట్టండి.. లేదా అదనపు సాయం, అడ్వాన్స్ రూపంలో పొందిన మొత్తం చెల్లించండి' అంటూ గృహ నిర్మాణ సంస్థ అధికారులు లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు.

**రికవరీకి చర్యలు**

వివిధ దశల్లో ఆగిపోయిన పక్కా గృహాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కింద అదనపు సాయం ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం



నిర్ణయించింది. ఈ ఏడాది మార్చిలో ఉమ్మడి జిల్లాలో 8,021 మంది లబ్ధిదారులకు రూ.11.88 కోట్ల మేర సాయం మంజూరు చేసింది. వీరిలో 1,400 మంది నిర్మాణాలు చేపట్టారు. మిగిలినవారు మొదలు పెట్టలేదు. నగదు జమ చేసి ఐదు నెలలవుతున్నా నిర్మాణాల్లో కదలిక లేకపోవడం గమనార్హం.

ఈ క్రమంలో గృహ నిర్మాణాల్లో పురోగతి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అదనపు సాయం పొందినవారికి గృహ నిర్మాణ సంస్థ అధికారులు గత పది రోజులుగా తాఖీదులు జారీ చేస్తున్నారు. నగదు రికవరీకి చర్యలు తీసుకుంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఆప్షన్-1, 2 కింద ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకొచ్చిన లబ్ధిదారులకు 2022-23లో రూ.10 వేలు, రూ.20 వేల చొప్పున నగదు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 5 వేల మందికిపైగా ఇలా నగదు తీసుకున్నారు. వీరంతా ఇళ్లు నిర్మించుకోవడం లేదు. వారి వద్ద నగదు అలాగే ఉండిపోయింది.

ఈ ఏడాది మార్చిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొచ్చిన లబ్ధిదారులకు అందించిన అదనపు సాయం (రూ.కోట్లలో)

## నానో.. లాభాలెన్నో

ఆత్మకూరు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది. అధిక దిగుబడుల పేరుతో రైతులు ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నారు. ఫలితంగా పొలాలన్నీ నిస్సారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటి వినియోగాన్ని దశలవారీగా తగ్గించేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా గుళికల రూపంలో ఉండే యూరియా, డీఏపీ స్థానంలో ద్రవరూప నానో యూరియా, డీఏపీలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 6,27,788, రబీలో 3,42,792 హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. ప్రధానంగా పత్తి, వరి, మిరప, మొక్కజొన్న, వేరుసెనగ, కంది తదితర పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ఎకరా వరి పైరుకు సగటున 160 కిలోల యూరియా వాడాలి. కానీ 400 కిలోల నుంచి 500 కిలోలు వాడుతున్నట్లు వ్యవసాయాధికారుల పరిశీలనలో తేలుతోంది. మోతాదుకు మించి వినియోగిస్తుండటంతో పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా సోకుతోంది.

**ప్రయోజనం ఎంతో..**

బస్తా యూరియా ధర రూ.266 కాగా.. బయట దుకాణాల్లో అదనంగా వసూలు చేస్తున్నారు. నారో యూరియా 500 మి.లీ. డబ్బా రూ.225కే లభిస్తుంది. డీఏపీ బస్తా కొత్త ధర రూ.1,400. నానో డీఏపీ సీసా రూ.600 మాత్రమే. ఎకరాకు అర లీటరు ద్రావణం సరిపోతుంది.

**అవగాహన కరవవడంతో..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నానో యూరియా, డీఏపీలను ఒక్క శాతం మంది రైతులు కూడా వినియోగించట్లేదని అధికారులు చెబుతున్నారు. వీటిని ప్రభుత్వం రెండేళ్ల కిందటే మార్కెట్‌లో అందుబాటులోకి




తీసుకొచ్చింది. అవగాహన లేకపోవడంతో రైతులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

**రికార్డుస్థాయిలో వినియోగం**

రసాయన ఎరువుల వినియోగంలో నంద్యాల జిల్లా రికార్డు సృష్టించింది. 2024-25లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో, దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్రమే ప్రకటించింది. నంద్యాల జిల్లాలో ప్రధానంగా వరి సాగు అధికం. ఎకరా సాగుకు 3 బస్తాల యూరియా వేయాల్సి ఉండగా సుమారు 10 బస్తాల వరకు వినియోగిస్తున్నారు. 2024-25లో యూరియా, డీఏపీ, ఎంవోపీ తదితర 3.75 లక్షల టన్నుల ఎరువులను రికార్డు స్థాయిలో వినియోగించారు. 2.38 లక్షల మెట్రిక్ టన్నుల వినియోగంతో కర్నూలు జిల్లా ఐదో స్థానంలో నిలిచింది.

# ఆయకట్ట భద్రమేనా



ఆలూరు : జిల్లాలో దిగువకాల్వ కింద ఖరీఫ్, రబీ సీజన్ల కింద 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. జిల్లాలో 135 కి.మీ. నుంచి 250 కి.మీ. వరకు కాలువ ఉంది. ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల మీదుగా కాలువ ప్రవహిస్తూ ప్రజల అవసరాలను తీరుస్తోంది. పశ్చిమ ప్రాంతంలో 32 తాగునీటి కుంటలు ఉండగా 120 గ్రామాలకు నీరు అందుతోంది. ఈసారి జలాశయం గేట్ల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వ అధికంగా ఉంచకుండా ఖరీఫ్ పంటలకు సాగు నీరు అందిస్తున్నారు. జిల్లా ప్రజలకు తుంగభద్ర జలాశయమే ఆధారం. అలాంటి కీలకమైన ప్రాజెక్టుకు సంబంధించిన గేట్లు మొరాయిస్తుండటంతో రైతులు, ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతేడాది ఇదే సమయంలో ప్రాజెక్టులోకి వరద నీరు అధికంగా చేరడంతో 19వ గేటు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో తాత్కాలిక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మరో ఏడు గేట్లు ప్రమాదంలో ఉన్నట్లు తేలింది. గేట్లు పైకి ఎత్తడం, దించడంలో సమస్యలు తలెత్తితే మిగిలిన గేట్ల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. అంతేగాకుండా దిగువ, ఎగువ కాలువలకు సైతం నీటిని ఎక్కువగా విడుదల చేసే అవకాశం ఉంటుంది.

**సాగుదారుల్లో ఆందోళన**

ప్రస్తుతం పశ్చిమ ప్రాంతంలో ఎల్లెల్సీ కింద రైతులు పంటలు సాగు చేశారు. తుంగభద్ర జలాశయం నిండడంతో పంటలు పండించుకునే అవకాశముందని భావించారు. ప్రస్తుతం తుంగభద్ర ప్రాజెక్టు గేట్లు ప్రమాదకరంగా ఉండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు కిందకు వదిలేస్తే పంటలన్నీ దెబ్బతింటాయని పేర్కొంటున్నారు. రబీ పంటలకు సాగు నీరు అందించేదిలేదని బోర్డు అధికారులు ముందుగానే తెలియజేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు గేట్ల పరిస్థితి నేపథ్యంలో ఖరీఫ్ రైతులు ఆవేదనలో మునిగిపోయారు.

**లైనింగ్ పనుల్లో అక్రమాలు**

గతేడాది దిగువ కాలువకు లైనింగ్ పనులు చేపట్టారు. పనులు నాసిరకంగా చేయడంతో చాలా ప్రాంతాల్లో నీరు లీకైంది. గతేడాది 120 కి.మీ. వద్ద కర్ణాటక రాష్ట్రం బరదనహళ్లి సమీపంలో కాలువకు రంధ్రం పడింది. కర్నూలు జిల్లా పరిధిలోని 158 కి.మీ. బాపురం పరిధిలో లీకేజీ ఏర్పడింది. లైనింగ్ పనులను గుత్తేదారులు నాసిరకంగా పనులు చేయడంతో ఈ సమస్యలు తలెత్తాయి. ప్రస్తుతం కాలువకు అధిక నీరు విడుదల చేస్తే ఆ ప్రవాహాన్ని తట్టుకుని కాల్వ గట్లు నిలబడతాయా? అన్నది సందేహంగా మారింది.

## మట్టి తవ్వేయ్.. చూడరు అమ్మేయ్



ఎమ్మిగనూరు: ఎర్రమట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వందల ఎకరాల్లో భూములతోపాటు కొండలను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో దాదాపు రెండు వందల ఎకరాల్లో పలువురు అక్రమార్కులు ఎర్రమట్టి తవ్వి తరలించి సొమ్ము చేసుకున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలోనూ దందా అలానే కొనసాగుతోంది. మాసుమాన్‌దొడ్డి కొండ సమీపంలో ఎడమ వైపు ప్రాంతంలో ఎర్రమట్టిని పెద్దఎత్తున ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఎమ్మిగనూరులో ప్రాంతంలో వేసిన నాన్ లేఅవుట్లలో రహదారులు నిర్మించేందుకుగాను దీనిని ఉపయోగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు మట్టిని ఇతరులకు రూ.1000కు అమ్ముతున్నారు. ప్రతిరోజూ ట్రాక్టర్లలో పెద్దఎత్తున మట్టి తరలుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రెవెన్యూ,. పోలీసు అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి.

**బనవాసి ఫారంలోనూ ఇదే తంతు** బనవాసి ఫారంలో దాదాపు 1,500 ఎకరాల భూములున్నాయి. వీటిల్లో వేప, టేకు, ఎర్రచందనం, ఇతర చెట్లను పెద్దఎత్తున పెంచారు. ప్రస్తుతం నవోదయ సమీపంలో ఉన్న చెట్ల ప్రాంతంలో ఎర్రమట్టిని తవ్వి తరలిస్తున్నారు. పశువైద్య కార్యాలయం, రాగిమాన్‌దొడ్డి రహదారిలోని టేకు, నీలగిరి చెట్ల ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. ఫారం వెనుక భాగంలోని భూముల్లో 6 ఎకరాల్లో తవ్వేశారు.

**సొమ్ము చేసుకుంటూ..**బనవాసి ఫారం భూముల్లో 22 ఏళ్ల కిందట అప్పట్లో రూ.2.50 కోట్లు వెచ్చించి అటవీ శాఖ ఆధ్వర్యంలో కానుగ, చింత, వేప, తుమ్మ, ఇతర మొక్కలు నాటారు. ఫారం భూములు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్నాయి. ఈ ప్రాంతంలో విలువైన చెట్లను ధ్వంసం చేసి మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడ ట్రాక్టరు ఎర్రమట్టిని రూ.1,800 వరకు అమ్ముకుంటున్నారు. రాగిమాన్‌దొడ్డి ప్రాంతంలోని కొండలో సుమారు 17 ఎకరాల్లో ఎర్రమట్టిని తరలించి చదును చేసేయడం గమనార్హం. హనుమాపురం వద్ద 14 ఎకరాల్లో ఎర్రమట్టిని తవ్వి తరలించారు. ఇకనైనా అధికారులు స్పందించి విస్తృతంగా దాడులు జరిపి ఎర్రమట్టి తరలింపును అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

## బాధ్యతలు పెంచి.. పర్యవేక్షణ మరిచి



ఆళ్లగడ్డ: ఉమ్మడి జిల్లాలోబీసీ వసతిగృహాలకు వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒక్కో హాస్టల్‌లో వందల మంది విద్యార్థులు ఉంటున్నారు. ఒక్కో అధికారికి రెండు మూడు వసతిగృహాల బాధ్యతలు అప్పగించడంతో విద్యార్థులపై పర్యవేక్షణ కరవవుతోంది. కర్నూలు జిల్లాలో 47 బీసీ వసతిగృహాలుండగా సుమారు 30 మంది సంక్షేమాధికారులు మాత్రమే ఉన్నారు. నంద్యాల జిల్లా పరిధిలో 33 హాస్టళ్లు ఉండగా.. 21 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంకనూ 29 మంది సిబ్బంది కొరత ఉంది. ఫలితంగా పలువురికి రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఎవరు ఎక్కడ ఉంటున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం కరవైంది. **ఎవరూ దృష్టి సారించక**

ఉమ్మడి జిల్లాలో ఒక్కొక్కరు కనీసం రెండు వసతిగృహాల బాధ్యతలు చూసుకోవాల్సి వస్తోంది. ఒక వసతిగృహ బాధ్యతలు చూసుకోవడమే కష్టంగా మారిన నేపథ్యంలో రెండు, మూడు బాధ్యతలు అప్పగించడంతో వారు న్యాయం చేయలేకపోతున్నారు. ఆ ప్రభావం విద్యార్థుల చదువుపైనా పడుతోంది. మెనూ సక్రమంగా అమలుకావడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో కొందరు పర్యవేక్షించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**దూరాభారమే** చాగలమర్రి మండలం చిన్నవంగలిలోని రెగ్యులర్ వార్డెన్‌కు ఉయ్యాలవాడ వసతిగృహ బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు గ్రామాల మధ్య 35 కి.మీ. దూరం ఉంది. ఫలితంగా ఈ రెండింటిని చూసుకోవడం కష్టంగా మారింది.కర్నూలు నగర పరిధిలో బీసీ వసతిగృహ బాధ్యతలు చూసుకునే సంక్షేమాధికారికి 50 కి.మీ. దూరంలో ఉన్న సి.బెళగల్‌లోని వసతిగృహ బాధ్యతలు అదనంగా అప్పగించారు. నందికొట్కూరు బీసీ వసతిగృహ బాధ్యతలు చూసుకునే వార్డెన్‌కు కి.మీ. దూరంలో.. 170 మంది విద్యార్థులున్న కొత్తపల్లి బీసీ వసతి గృహ బాధ్యతలు సైతం చూసుకోవాల్సి ఉంటుంది. కొత్తపల్లి-నందికొట్కూరు మధ్య దూరం 45 కి.మీ. దూరం ఉంది. నిత్యం రాకపోకలు సాగించాలంటే అవస్థలే.ఆదోని మండలం పెద్దహరివాణం అధికారికి హొళగుంద మండలం ఇంగతహాల్ హాస్టల్ బాధ్యతలను అప్పగించారు.

## దశ తిరిగిన దద్దణాల

బనగానపల్లి : మండల పరిధిలోని దద్దణాల చెరువు నిండుకుంది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక తక్కువ నీటి నిల్వతో ఉండేది. చెరువు దుస్థితిపై ప్రచురితమైన వరుస కథనాలకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందించారు. మంత్రి రూ.27లక్షల సొంత నిధులు వెచ్చించి ఎత్తిపోతల పథకం పునఃప్రారంభించారు. దీంతో బనగానపల్లి సమీపంలోని ఎస్సార్బీసీ కాల్వ వద్ద రూ.20 కోట్లతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులోకి నీటిని మళ్లించారు. వర్షం నీటితోపాటు ఎత్తిపోతల నీరు చెరువులోకి రావడంతో ప్రస్తుతం పుష్కలంగా నీరు ఉండి నిండుకుండను తలపిస్తోంది. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో చెరువులో నీరు ఉండటంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా పాలనలో నిర్లక్ష్యం**

వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చెరువు అభివృద్ధికి నోచుకోలేదు.



ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు ఆరు నెలలకు పైగా సాగునీరు వస్తుంది. వర్షం నీటితో పాటు ఎత్తిపోతల నుంచి చెరువుకు నీరు చేకూరడంతో వచ్చే రబీ పంటలకు ఉపయోగపడనుంది. చెరువు కింద ఈ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, వరి, కంది, పత్తి పంటలు సాగు చేశారు.

**ప్రయోజనం ఇలా..**

దద్దణాల చెరువులో పుష్కలంగా నీరంటే 1,550 ఎకరాలకు సాగునీరు అందుతుంది. సమీపంలోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. సుమారు 5 వేల మంది రైతులు ప్రయోజనం పొందుతారు. పాతపాడు, జోలాపురం, మీరాపురం, సాధుకొట్టం, మాదాసుపల్లె, యాగంటిపల్లె, పెద్దరాజుపాలెం, చిన్నరాజుపాలెం, కృష్ణగిరి, చెర్లోకొత్తూరు, పసుపుల తదితర గ్రామాలకు వేసవిలో సైతం తాగునీటి ఇబ్బందులు తీరుతాయి. బనగానపల్లి పట్టణానికి సైతం వేసవిలో తాగు నీటి ఇబ్బందులు తొలగిపోతాయి.

## బతుకులు కూలిపోతాయ్

బనగానపల్లి: మండల పరిధిలోని యాగంటి ఆలయం నుంచి కటికవానికుంట మీదుగా మద్దిలేటి స్వామి ఆలయానికి ప్రతిరోజూ వందలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. మద్దిలేటి స్వామి ఆలయం వెళ్లాలంటే దగ్గరి దారి కావడం.. 10 కి.మీ. ఉండటంతో జనం నిత్యం వెళుతుంటారు. ప్రతి శుక్ర, శనివారాల్లో రద్దీ తీవ్రంగా ఉంటుంది. చాలామంది యాగంటి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న తర్వాత బేతంచెర్ల మండలం.. ఆర్ఎస్ రంగాపురం పరిధిలోని మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్తుంటారు. యాగంటి కొండల్లో 3 కి.మీ. మేర మలుపుల ప్రాంతం ఉంది. రక్షణ గోడ నిర్మించినప్పటికీ



కొన్ని ప్రాంతాల్లో దెబ్బతింది. ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో పలువురు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

**ఎవరూ పట్టించుకోక..**మూడు నెలల కొందట ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ముందే మలుపులు.. దీనికితోడు రక్షణ గోడ అక్కడక్కడా దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. అయినప్పటికీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఈ మార్గంలో పలువురు వాహనదారులు వేగంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే అదుపు తప్పి లోయలో పడిపోయే పరిస్థితి. రక్షణ గోడలు కూలిపోయిన చోట రాళ్లు పెట్టి చేతులు దులిపేసుకోవడం గమనార్హం. దీనికితోడు వీధి దీపాలు కరవయ్యాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించేలా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

## ఫ్యూజు పోయినా చుక్కలే!

ఒంగోలు : విద్యుత్తు శాఖలో సిబ్బంది కొరత కారణంగా సేవల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. చిన్నపాటి ఫిర్యాదుల పరిష్కారానికీ రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తప్పని నిరీక్షణ...**సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు మినహా గత పదేళ్లుగా ఎలాంటి ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరు విద్యుత్తు స్తంభం ఎక్కి మరమ్మతులు చేపట్టేందుకు వీల్లేదు. దీంతో




ఏ సమస్య తలెత్తినా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్ల కోసం నిరీక్షించక తప్పడం లేదు. సిబ్బంది కొరత కారణంగా వీరికి రెండు మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించారు. దీంతో వినియోగదారుల నుంచే వచ్చే ఫిర్యాదులను సరిగా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఎనర్జీ అసిస్టెంట్లు సైతం పనిచేసే చోట నివాసం ఉండకపోవడంతో పల్లెల్లో రాత్రివేళ ఫ్యూజు పోయినా వేసేవారు కరవయ్యారు.

# మట్టిని మింగేస్తున్నారు!

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగుతోంది. కొందరు నాయకుల అండతో చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ... నిత్యం వందలాది లారీల్లో తరలిస్తున్నారు. ఎవరైనా స్థానికులు అభ్యంతరం తెలిపితే దాడులకూ తెగబడుతున్నారు. వై.పాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో ఈ దందా సాగుతోంది.

**ఆయకట్టుకు ముప్పు...**

పుల్లలచెరువు మండలం మల్లపాలెంలో నరజాముల తండా మధ్యలోని చీమలదిన్నె చెరువులో మూడు భారీ జేసీబీలను ఏర్పాటు చేసి... రోజుకు 300 నుంచి 350 టిప్పర్ల మట్టిని అడ్డగోలుగా ఓ రహదారి నిర్మాణానికి తరలిస్తున్నారు. గత కొన్నాళ్లుగా ఈ దోపిడీ సాగుతున్నా, స్థానికులు



అభ్యంతరం తెలుపుతున్నా అధికారులు మాత్రం ఇటుగా కన్నెత్తి చూడడం లేదు. ఈ వ్యవహారంలో మండల స్థాయి నాయకుడొకరు అంతా తానై వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చెరువు కింద దాదాపు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుత తవ్వకాలతో నీరు నిలవక సేద్యం సాగించలేని దుస్థితి నెలకొంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒక్కరూ పట్టించుకోరు...**

త్రిపురాంతకం, వై.పాలెంలోని పెద్ద చెరువులతో పాటు మురారిపల్లె, మరికొన్ని గ్రామాల్లోని జల వనరుల్లోనూ మట్టి దోపిడీ సాగుతోంది. ఆయా శాఖల వారీగా మామూళ్లు వెళ్తుండడంతో ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ రాంబాబును సంప్రదించగా... జేఈతో పరిశీలన చేయించి మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రిస్తామని తెలిపారు.

# ఎట్టకేలకు కాలువలకు కొత్త కళ

ఒంగోలు : ఎన్నో ఏళ్ల రైతన్నల ఎదురుచూపులు ఫలించాయి. ఎట్టకేలకు సాగర్ కాలువల కట్టలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో కనీసం చిల్ల చెట్లు కూడా తొలగించకపోవడంతో కట్టలు రూపురేఖలు కోల్పోయాయి. ఒంగోలు బ్రాంచి ప్రధాన కాలువతో పాటు వివిధ మేజర్, మైనర్ కాలువల పరిధిలో ప్రస్తుతం చురుగ్గా పనులు జరుగుతున్నాయి. 2024లో కొత్త ప్రభుత్వం సాగర్ అద్దంకి బ్రాంచి తదితర మేజర్ కాలువల మరమ్మతులు నిర్వహించింది. అయితే అప్పట్లో సకాలంలో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపకపోవడంతో ఓబీసీ పరిధిలో పనులు చేపట్టలేదు. దీనిపై పలు వార్తలు ప్రచురితం కావడంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. **రూ.5.2 కోట్లతో.. :** ఓబీసీ పరిధిలో దర్శి, చీమకుర్తి, సంతనూతల పాడు, ఒంగోలు సబ్ డివిజన్ల పరిధిలో సుమారుగా రూ.5.2 కోట్లతో 89 పనులు ప్రతిపాదించి కాలువల



కట్టలపై చిల్ల చెట్లు, కాలువల్లో పూడిక తొలగింపు చేపడుతున్నారు. ఓబీసీ పరిధిలో చీమకుర్తి నుంచి రామతీర్థం జలాశయం వరకు కొద్ది నెలల కిందట ప్రవాస భారతీయు లు నల్లూరి శేషయ్య సహకారంతో ఒకవైపు కట్టపై చిల్లచెట్లు తొలగిం చారు. ప్రస్తుతం రెండోవైపు కట్టపైన వ్యర్థాలు, చిల్లకంప తొలగిస్తున్నా రు. ఒంగోలు బ్రాంచి కాలువ, చీమకుర్తి ఒకటి, రెండు, కారుమంచి మేజర్ కాలువ కట్టలపై గ్రానైట్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోవడంతో పనుల నిర్వహణ కష్టసాధ్యంగా మారింది. త్వరలో రామతీర్థం నుంచి దిగువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేశారు.

# ప్లాట్లు.. ఇవేం పాట్లు..!

సర్పవరం : కాకినాడ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మెకానిక్ షెడ్‌లను తరలించేందుకు నాటి ప్రభుత్వం 1993లో ఏపీఐఐసీ ద్వారా సర్పవరంలో 18 ఎకరాల భూమి సేకరించి ంది. 2000లో ఏపీఐఐసీ నుంచి ప్లాట్ల యజమానులు కొనుగోలు చేసిన భూమిలో ఆటోనగర్ ఏర్పడింది. 2016 నుంచి సుమారు 7.62 ఎకరాల భూమిని దేవాదాయశాఖ 22 ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లు నిలిపివేశారు. అప్పట్నుంచి ఆస్తులున్నా.. ఇక్కడి వారంతా పేదలుగానే మిగిలిపోయారు.

**వేర్వేరు సర్వేనంబర్ల నమోదుతో ఇబ్బందులు**

ఈ భూములకు రెవెన్యూశాఖ సర్వే నంబరును 104/2 గా నమోదు చేయగా, ఏపీఐఐసీ ఆటోనగర్ యజమానులకు అమ్మినప్పుడు సర్వే నంబరును 104–పార్టుగా నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయడంతో వివాదం మొదలైంది. సర్వే నంబరు 104 దేవాదాయశాఖ నిషేధిత జాబితాలో ఉండడంతో 2016 నుంచి రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి, 7.62 ఎకరాల్లో సుమారు 60 మంది వాహనాల మరమ్మతుల షెడ్లు, స్పేర్ పార్టులు, చిన్నపాటి పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. ప్లాట్లు అమ్ముకునేందుకు, బ్యాంకు రుణాల తాకట్టుకు పనికిరావడం లేదని వాపోతున్నారు. ఇక్కడే సర్పవరం భావనారాయణస్వామి ఆలయానికి చెందిన భూములు కూడా ఉండడం వివాదానికి కారణమైంది. సర్వే నంబరు 104లో 8.05 ఎకరాలు, 122లో 5.5 ఎకరాలు, 105/4లో 0.38 ఎకరాలు ఉన్నాయి. **అప్పు పుట్టడం లేదు..** – పెమ్మాడి శ్రీనివాసకుమార్‌మాకు ఇచ్చిన ప్లాట్లున్న భూమిని 2016లో దేవాదాయశాఖ నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. భూహక్కులేక బ్యాంకు రుణాలూ పుట్టడం లేదు. వ్యాపారాలు సరిగా లేవని ప్లాట్లను అమ్ముదామన్నా కుదరడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఫలితం ఉండడం లేదు. **సంయుక్త సర్వేతో పరిష్కారం**– ఎ.రమణారెడ్డి, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, కాకినాడ ఆటోనగర్ భూములను దేవాదాయశాఖ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని లేఖలు రాశాం. రెవెన్యూ, ఏపీఐఐసీ, దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో సంయుక్త సర్వే చేయించాలని కలెక్టర్ కోరారు. త్వరలోనే పరిష్కారం చూపుతాం.

# జోరుగా మార్కెట్ ఆధునికీకరణ

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు జోరందుకున్నాయి. నాలుగు నెలల్లో పూర్తిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మార్కెట్ ఆధునికీకరణ పనుల కోసం సర్కారు రూ.155.30కోట్లు మంజూరు చేసింది. తొలి విడతలో రూ.114.36 కోట్లతో 21 పనులు, రెండో విడతలో రూ.40.94కోట్లతో రెండు పనులు చేపట్టాలని నిర్ణయించింది. నిర్మాణ పనులను 'ఎజిలిటీ అండ్ భూమి ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్ సంస్థ'కు అప్పగించింది. పనులను వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచూ పర్యవేక్షిస్తున్నారు.

**ఆరు షెడ్ల నిర్మాణం**

మార్కెట్లో ఆరు పెద్ద షెడ్ల నిర్మాణం మొదలైంది. పునాదుల వరకు పనులు పూర్తయ్యాయి. నాలుగు నెలల్లో షెడ్లను నిర్మించాల్సి ఉంది. ఐదు షెడ్లలో పంటల క్రయవిక్రయాలు జరగనున్నాయి. ఆరో షెడ్డును రెండంతస్తుల్లో నిర్మిస్తారు. కింది భాగంలో లావాదేవీలు, మొదటి అంతస్తులో రైతు విశ్రాంతి భవనం, హమాలీలు, దడవాయిల కార్యాలయాలుగా వినియోగించనున్నారు.

**రెండో దశలో కమీషన్ కార్యాలయాలు**

పరిపాలన భవనాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. దీని పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్కెట్‌లో అగ్నిమాపక యంత్రాలు, నీటిసరఫరా వ్యవస్థ, హైమాస్క్ లైట్లు, అండర్‌గ్రౌండ్ సంపులు, ప్రహరీ, సెక్యూరిటీ గార్డుల గదులు, ఎంట్రీ గేట్లు నిర్మిస్తారు. రెండో దశలో రెండు కమీషన్ ఏజెంట్ల కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు.

**ఆధునిక హంగులతో..**

ఏడో షెడ్డులో ప్రత్యేకంగా శీతల గిడ్డంగిని నిర్మిస్తారు. ఇందులో రైతులు సుమారు లక్ష మిరప బస్తాలు నిల్వ చేసుకునే అవకాశముంటుంది. ఏదైనా మార్కెట్ ప్రాంగణంలో ఏసీ గిడ్డంగి నిర్మించటం ఇదే ప్రథమం. వీటితో పాటు అధునాతన సౌకర్యాలతో మూడు శౌచాలయాలు నిర్మిస్తున్నారు. రైతులు, వ్యాపారులు, కార్మికుల దాహార్తి తీర్చేందుకు ఒక్కొక్కటి సుమారు 2వేల లీటర్ల సామర్థ్యంతో నాలుగు ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. 5వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకు, రెండు వే బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. మార్కెట్ ఆధునికీకరణ పనులు పూర్తయితే రైతుల భవిష్యత్తు అవసరాలకు ఇబ్బంది ఉండదు. గతంలో మాదిరిగా తమ పంట ఉత్పత్తులను రోడ్లపై విక్రయించుకునే దుస్థితి తలెత్తదు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మం మార్కెట్ దేశానికి ఆదర్శంగా నిలవబోతోంది. శీతల గిడ్డంగిలో రైతులు నామమాత్రపు రుసుముతో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే వెసులుబాటు దొరుకుతుంది. – యరగర్ల హనుమంతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఖమ్మం

# గుమ్మం దాటితే గుండెల్లో దడదడ..




రాజమహేంద్రవరం జిల్లాలోని పురపాలికల్లో వీధి కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. పిల్లలు, పెద్దలనే తేడా లేకుండా రోడ్డుపై కనిపించిన వారందరిపై దాడులకు దిగుతున్నాయి. అర్బన్ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీసం రోజుకు 10 నుంచి 15 మంది వరకూ బాధితులు రేబిస్ వ్యాక్సిన్ కోసం వస్తున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏకంగా 30 నుంచి 40 కుక్క కాటు కేసులు వస్తున్నాయి. వీరిలో పిచ్చికుక్కల బారినపడిన వారూ ఉంటున్నారు. గత ఐదేళ్లతో పోలిస్తే ప్రస్తుతం వీధి కుక్కల సంఖ్య రెట్టింపు పెరిగినట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వంలో వీటి నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కనీసం యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్ర చికిత్సల విషయంలోనూ ముందుకెళ్లలేదు. వీటితోపాటు వ్యాక్సినేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటా సైతం విడుదల చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. ఇటీవల జిల్లాలో ఏబీసీ శస్త్ర చికిత్సల నిమిత్తం 19,218 వీధి కుక్కలను గుర్తించగా, వాటిలో 6635 వాటికి మాత్రమే ఆపరేషన్లు పూర్తి చేశారు. కనీసం జిల్లాలో 30 శాతం మేర పైబడి ఆపరేషన్లు జరగని పరిస్థితి ఏర్పడింది.

**కోర్టు సూచనలతో..**

అర్బన్ ప్రాంతాల్లో వీధి కుక్కల నియంత్రణలో చర్యలు తీసుకోవాలని తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇందుకోసం కొత్త మార్గదర్శకాలను విడుదల చేయాల్సి ఉంది. వాస్తవానికి జంతు రక్షణ విభాగం ద్వారా పురపాలికల్లో వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిత్యం ఏబీసీ ఆపరేషన్లు, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా ఏబీసీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిధులు విడుదల చేయాలి. ప్రస్తుతం కొత్త మార్గదర్శకాల ప్రకారం వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, నియంత్రణపై నివేదిక ఇవ్వాల్సి ఉంది. కేంద్రం పూర్తిస్థాయిలో స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# సంతేబిదనూరులో 'ఆయుష్' తీశారు



హిందూపురం : ప్రాచీన ఆయుర్వేద వైద్యానికి ఇటీవల కాలంలో ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. అందులో భాగంగా లక్షలాది రూపాయలతో వెచ్చించి హిందూపురం గ్రామీణ మండలం సంతేబిదనూరులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను నిర్మించారు. పంచకర్మ వంటి చికిత్సలు అవసరమైన పరికరాలను, ఇతరత్రా వస్తువులను కొనుగోలు చేసి ఆసుపత్రికి సరఫరా చేశారు. ఆసుపత్రిలో వీటి ఏర్పాటుకు దాదాపు రూ.50 లక్షలు వెచ్చించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది చొరవ చూపడంతో ఆసుపత్రి సుందరంగా రూపుదిద్దుకొంది. ఎలాంటి ప్రచారం లేకపోయినా వైద్యం పొంది, ఉపశమనం పొందిన వారిలో ఒకరి నుంచి మరొకరికి ఇలా ఇక్కడి వైద్య సేవలు గురించి తెలియడంతో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరిగింది. రోగుల సంఖ్యకు అనుగుణంగా ఏడాదికి ఆసుపత్రికి రూ.12 లక్షలు విలువైన మందులు సరఫరా అవుతున్నాయి. ఇక్కడి వైద్యం, సౌకర్యాల కారణంగా రాయలసీమలోనే సంతేబిదనూరు ఏకైక ఆయుర్వేద వైద్యశాలగా తలమానికంగా మారింది. ఇక్కడే గతంలో జిల్లా కలెక్టర్‌గా పని చేసిన అధికారితో పాటు అనేక మంది అధికారులు, ప్రముఖులు వైద్యం చేయించుకొన్నారంటే ఇక్కడ ఎలాంటి వైద్య సేవలు అందాయి అనడానికి ఉదాహరణగా నిలుస్తాయి.

**డిస్పెన్సరీలకు పది లోపే రోగులు**

వైకాపా ప్రభుత్వం హయాంలో ఆయుష్ వైద్యుల నియామకాలు చేపట్టలేదు. దీంతో జిల్లాలో వైద్యులు లేక అనేక ఆయుర్వేద డిస్పెన్సరీలు ఖాళీగా ఉన్నాయి. సాధారణంగా డిస్పెన్సరీలకు 10 మంది లోపు రోగులే వైద్యానికి వస్తారు. ఇవేమి ఆలోచించకుండా, ఏమీ పట్టించుకోకుండా ఆయుష్ విభాగంలో పని చేసే వైద్యులను, సిబ్బంది బదిలీలలను ఉన్నతాధికారులు జూన్‌లో నిర్వహించారు. దీంతో ఇక్కడ పనిచేసే వైద్యురాలు సైతం చిన్న సెంటర్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడికి వచ్చే రోగులకు సేవలు దూరమయ్యాయి. తమ ఆసుపత్రికి వైద్యులను నియమించడం లేదా, బదిలీ అయిన వైద్యురాలిని డిప్యూటేషన్‌పై పంపాలని స్థానికులు, రోగులు ఆందోళనకు దిగినా వారి ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు.

**వైద్యురాలి బదిలీ కావడంతో..**

ఈ ఆయుర్వేద వైద్యశాలలో ఒక్క వైద్యురాలు, కాంపౌండర్, ఇద్దరు థెరపిస్టులు, ఇద్దరు యోగా శిక్షకులు పని చేసేవారు. అయితే వైద్యురాలు, కాంపౌండర్ రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. దీంతో వైద్యం చేసేవారు, మందులు అందించే వారు లేక ఒక్కసారిగా వైద్య సేవలు నిలిచిపోయాయి.

**వెనుదిరిగిపోతున్నా..**

– జయసుధ, మడకశిర

నేను రుమటాయిడ్ అర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నా. అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొన్నా నయం కాకపోవడంతో కొన్నేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాను. మంచి చికిత్సలు చేశారు. మళ్లీ చికిత్స కోసం వస్తే డాక్టర్ లేరని చెప్పారు. వెనుదిరిగి వెళ్తున్నాను. వెంటనే డాక్టర్‌ను నియమిస్తే బాగుంటుంది.

# వైకాపా కక్ష.. కూటమి రక్ష



కాకినాడ : తెదేపా ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టిన వివిధ పనులకు గత వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా కక్షకట్టింది. పూర్తయిన పనులకు బిల్లులు ఆన్‌లైన్‌లో పొందుపర్చినా తీసేసింది. తెదేపా ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకూడదనే దురుద్దేశంతో ఆపేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రానీయకుండా చిన్న గుత్తేదారులను ఇబ్బందుల పాలు చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే ఈ బిల్లులపై దృష్టిసారించింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సారథ్యంలో గత తెదేపా ప్రభుత్వంలో పూర్తయిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించడానికి మార్గం సుగమం చేసింది. డ్వామా అధికారుల ద్వారా అప్పట్లో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను తయారు చేయించి, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయించారు. త్వరలో వీటిని చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. **6,818 పనులు పూర్తయినా..** కాకినాడ జిల్లాలో 2014–19 మధ్య జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో 6,818 పనులు పూర్తి చేశారు. ఆరు నియోజకవర్గాలు, మూడు మండలాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, సంపద సృష్టికేంద్రాలు, పశువుల షెడ్లు, వర్మీకంపోస్టు యార్డులు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి పనులు పూర్తి చేశారు. వీటికి సంబంధించి రూ.5,01,76,704 బిల్లులు చెల్లించలేదు. గుత్తేదారులు గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. చాలా మంది అప్పులు పాలయ్యారు. కూటమి చొరవతో వీరందరికీ త్వరలో బిల్లులు నేరుగా చెల్లించనున్నారు.

# దుర్గం టు బిహార్

కళ్యాణదుర్గం: కొందరు అక్రమార్కులు కలపను యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వృక్ష సంపదను సంరక్షించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పలు రకాల చెట్లకు సంబంధించి కలప లారీల్లో బిహార్‌లోని పేపర్ మిల్లులు, ఇతర పరిశ్రమలకు లారీల్లో తరలిపోతోంది. కొందరు దీన్నే ఆదాయ వనరుగా మార్చుకుని దందా కొనసాగిస్తుండటం గమనార్హం. కళ్యాణదుర్గం నుంచి బిహార్‌కు 1,970 కిలోమీటర్ల దూరం.. సుమారు 32 నుంచి 38 గంటల సమయంలో చేరుకొంటారు. కళ్యాణదుర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు ఏడు లారీల్లో కలపను అక్రమ రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఇక్కడి వాటికి గిరాకీ

స్థానిక కలపకు ఇతర రాష్ట్రాల్లో గిరాకీ ఉండడంతో అనుమతులు లేకుండా కొందరు అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తున్నారు. ఇతర



రాష్ట్రాల వ్యాపారులతో ఉన్న ఒప్పందాల మేరకు సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకొని... స్థానికంగా కొనుగోలు చేసిన దుంగలను కళ్యాణదుర్గంలోని వ్యాపారులకు చేరుస్తారు. వాటిని కొన్నాళ్లపాటు నిల్వచేసి ఒక్కో లారీలో 20 నుంచి 25 టన్నుల మేరకు లోడ్‌చేసి తరలిస్తున్నారు. చెట్ల రకాలు, దుంగల బరువు, సైజును బట్టి ధర నిర్ణయిస్తారు. టన్నుకు రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలుకుతోంది.

**అనుమతులు లేకుండానే...**

చెట్లు నరకాలంటే తహసీల్దారు, అటవీశాఖ అధికారుల నుంచి అనుమతి, ధ్రువపత్రాలు పొందాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు టన్నుకు కొంత మొత్తం ప్రభుత్వానికి చెల్లించాకే అనుమతులు జారీ అవుతాయి. వ్యాపారులు నిబంధనలు పట్టించుకోకుండా యథేచ్ఛగా చెట్లను నరికి అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

**పరిశీలించి.. తగిన చర్యలు తీసుకుంటాం**

– రామచంద్రుడు, ఇన్‌ఛార్జి రేంజర్, అటవీశాఖ


వ్యవసాయ క్షేత్రాలు, పట్టా భూముల్లో చెట్లు నరకాలన్నా.. సదరు రైతు పట్టాదారు పాసుపుస్తకం తీసుకొచ్చి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అటవీ, రెవెన్యూ శాఖల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. ఎవరైనా వాటిని అతిక్రమించి చెట్లను నరికినా, ఇష్టానుసారంగా వ్యవహరించినా కఠినచర్యలు తప్పవు. కలప అక్రయ వ్యాపారం మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

# ఆక్రమణలు.. ఊర చెరువంత!

ఒంగోలు: ఒంగోలు నగరం నడిబొడ్డున రూ.వందల కోట్ల విలువైన స్థలం ఆక్రమణలో ఉన్నా అధికార యంత్రాంగం కిమ్మనడం లేదు. ఎకరాల మేర భూమి పరాధీనమైనా పట్టించుకోవడం లేదు. పేదలు పాకలు వేసుకుని తలదాచుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ... కొందరు బడాబాబులు దుకాణాలు నిర్మించి రూ.వేలకు వేలు అద్దెలు వసూలు చేస్తున్నారు. వివిధ పార్టీల నాయకులు, కొందరు అధికారులు, వ్యాపారులు ఇందులో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమాలు నిగ్గుతేల్చినా...**

అప్పట్లో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ఊరచెరువు కాలక్రమంలో ఆక్రమణలకు గురైంది. ఏళ్ల క్రితం కొందరు పేదలు ఇక్కడ తలదాచుకోవడంతో అప్పట్లో పట్టాలు ఇచ్చారు. ఈ క్రమంలో పేదల మాటున కొందరు పెద్దలు ఆక్రమణలకు తెరలేపారు. పట్టా ఇచ్చిన స్థలానికి రెండు మూడింతల ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించారు. నగరం నడికూడలిగా మారడంతో ఇతర పట్టా స్థలాలను సైతం కొనుగోలు చేసి వాణిజ్య సముదాయాలు నిర్మించారు. వాటిని



అద్దెలకు ఇచ్చి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. వాస్తవానికి పట్టా స్థలంలో నిర్మాణానికి నగర పాలక సంస్థ అనుమతులు ఉండవు. దీంతో ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. ఆక్రమణలు తారస్థాయికి చేరడంతో పదేళ్ల క్రితమే అవినీతి నిరోధక శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఉన్న భవనాలు, ఆక్రమణలెన్ని తదితర అంశాలను విచారించి నివేదిక అందజేశారు. అప్పట్లోనే 108 అనధికార నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించి... చర్యలకు సిఫారసు చేశారు. పట్టాలిచ్చిన స్థలం కంటే రెండింతలు ఆక్రమణదారుల చెరలో ఉంది. ఈ విషయమై కొందరు కోర్టులను సైతం ఆశ్రయించారు.

**పైసా ఆదాయం లేదు...**

పట్టా స్థలంలో భారీ భవంతులు నిర్మించినా... నిర్మాణ పనుల రూపేణా నగర పాలక సంస్థకు రూపాయి ఆదాయం వచ్చింది లేదు. రేకుల షెడ్లుగా చూపి సాధారణ పన్నులు సైతం అరకొరగానే చెల్లిస్తున్నారు. మరోవైపు అద్దెలు మాత్రం భారీగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఊర చెరువులో ఖాళీగా ఉన్న స్థలాన్ని క్రీడా మైదానంగా వినియోగించేందుకు ఓ అడుగు ముందుకు పడింది. పరాధీనమైన భూముల పరిరక్షణకూ యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## తడి అందాలతో చెమటలు పట్టిస్తున్న నభా నటేష్!

గ్లామర్ వలకబోయడమే ట్రెండ్ గా పెట్టుకున్న కొంతమంది హీరోయిన్స్ ఎప్పటికప్పుడు అందాలు ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే పనిలో పడ్డారు. అందులో భాగంగానే చాలామంది హీరోలు గ్లామర్ ఫోటోలతో నెటిజన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. కొంతమంది వ్యక్తిగత విషయాలతో పాపులారిటీ సంపాదించుకుంటే.. మరి కొంతమంది సినిమాల ద్వారా క్రేజ్ పొందుతున్నారు. ఇంకొంతమంది ఇలా గ్లామర్ ఫోటోలతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తన అందాలతో అభిమానులను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది ప్రముఖ బ్యూటీ నభా నటేష్. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను ఆకట్టుకునే ఈమె.. తాజాగా చీరకట్టులో సరికొత్త అందాలతో అందరినీ మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా నభా నటేష్ ను ఈ ఫోజ్ లో చూసేసరికి కుర్రాళ్ళు సైతం తట్టుకోలేకపోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. నేవీ బ్లూ కలర్ చీర కట్టుకొని అందాలతో మెస్మరైజ్ చేసింది. బ్లూ కలర్ చీర కట్టుకొని అందుకు తగ్గట్టుగా జువెలరీ ధరించిన ఈమె.. మెడను బోసిగానే ఉంచేసింది. జుట్టును వదిలేసి నీటిలో కదులుతూ ఫోటోలకు ఫోజులిచ్చింది. నభా నటేష్ తాజాగా తడి అందాలతో షేర్ చేసిన ఈ ఫోటోలలో ఆమె నడుము, ఎద అందాలు హైలెట్ గా నిలిచాయి. మొత్తానికి అయితే ఈమె షేర్ చేసిన ఈ తడి అందాల



ఫోటోలు ప్రతి ఒక్కర్ని ఆకట్టుకుంటున్నాయని చెప్పవచ్చు. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. 1995 డిసెంబర్ 11న కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లా శ్రింగేరిలో జన్మించిన ఈ ముద్దుగుమ్మ.. మంగళూరులో ఇన్ఫర్మేషన్ సైన్స్ లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసింది. మోడల్ గా కెరియర్ ను ఆరంభించింది. ఆ తర్వాత 2015లో శివరాజ్ కుమార్ తో కలిసి కన్నడ మూవీ 'వజ్రకాయ' అనే చిత్రం ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే బ్లాక్ బాస్టర్ విజయాన్ని అందుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఫెమినా మిస్ ఇండియా బెంగళూరు 2013లో టాప్ టెన్ లో ఒకరిగా కనిపించి అందరిని మెప్పించింది. నభా నటేష్ సినిమాల విషయానికొస్తే.. 2018లో 'నన్ను దోచుకుందువటే' అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. ఈ సినిమాలో సుధీర్ బాబు హీరోగా నటించారు. 2018లో విడుదలైన ఈ సినిమా పరవాలేదు అనిపించుకుంది. ఆర్.ఎస్.నాయుడు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హిందీలో 'ప్యార్ కి జీత్' పేరుతో డబ్బింగ్ చేశారు. ఈ సినిమా తర్వాత అదుగో అనే చిత్రంలో కూడా నటించింది. కానీ పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. ఆ తర్వాత డిస్కో రాజా, సోలో బ్రతికే సో బెటర్, డార్లింగ్ వంటి చిత్రాలలో నటించింది. ప్రస్తుతం నిఖిల్ తో కలిసి 'స్వయంభు' అనే సినిమాలో నటిస్తోంది. ఇక ఇందులో సంయుక్త మీనన్ కూడా హీరోయిన్గా నటిస్తోంది.

## క్లాసిక్ డాన్సర్ గా సాహెూ బ్యూటీ!

స్టార్ హీరోలకు జోడీగా నటిస్తూ సోలోగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం ఆషామాషీ కాదు. హీరోయిన్ గా వచ్చిన గుర్తింపును ఉమెన్ సెంట్రిక్ చిత్రాలతో కొనసాగించడం అన్నది సక్సెస్ మీదనే ఆధారపడి ఉంటుంది. సోలో నాయికగా నటించే క్రమంలో ఎక్కడ తేడాలు జరిగినా? హీరోయిన్ అవకాశాలకే ఎసరొ స్తుంది. వైఫల్యం అన్నది ఎలాంటి పరిస్థితులకైనా దారి తీస్తుంది. ఈ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ ముందు కెళ్లడం అన్నది అందరికీ సాధ్యం కాదు. ఈ విషయంలో శ్రద్ధా కపూర్ మాత్రం పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకుని ముందుకెళ్తోంది. ఓ వైపు కమర్శియల్ సక్సెస్ లు అందుకుంటూ మరోవైపు లేడీ ఓరియేంటెడ్ చిత్రాలతోనూ బాక్సాఫీస్ ని షేక్ చేయడం ఆమె కే చెల్లింది. స్త్రీ 2 తో 800 కోట్ల క్లబ్ లో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తదు పరి చిత్రాలు కూడా అంతే ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేసుకుంటోంది. జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన



మహారాష్ట్ర నృత్యకళాకారిణి, గాయని వితాబాయి బావుమంగ్ నారాయణ్ జీవితంలో నటి స్తుందనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉట్టేకర్ టేకప్ చేయడంతో మరింత ప్రతి ష్టాత్మకంగా మారింది. తాజాగా ఈ పాత్ర కోసం శ్రద్ధా కపూర్ శిక్షణ కూడా మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. క్లాసికల్ డాన్సర్ పాత్ర కోసం అందుకు అవసరమైన శిక్షణ తీసుకుంటుందని తెలిసింది. ఓ ప్రముఖ క్లాసికల్ డాన్సర్ ఆధ్వ ర్యంలో లక్ష్మణ్ ట్రైనింగ్ ఇప్పిస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర సంస్కృతిని జాతీయ స్థాయికి తీసు కెళ్లడానికి చిత్ర బృందం ప్రయత్నిస్తుంది. %-%ఛావా%-%తో గొప్ప దేశ భక్తిని చాటిన దర్శకుడిగా లక్ష్మణ్ పేరు ట్రెండింగ్ లో నిలిచిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే ఇలాంటి కథాంశంతో ముందుకు రావడంతో మరోసారి లక్ష్మణ్ పేరు నెట్టింట హాట్ టాపిక్ అవు తున్నాడు. ప్రస్తుతం శ్రద్ధా కపూర్ ప్రాజెక్ట్ కు సంబంధించి వర్క్ షాప్ లకు హాజరవుతోంది. ప్రీ ప్రొడక్షన్ పనులన్నింటిని పూర్తి చేసి నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టడానికి సన్నాహాలు చే స్తున్నారు. అయితే ఈ సినిమా నిర్మాణ సంస్థ పేరు ఇంకా తెరపైకి రాలేదు. ఈ నెలాకరుకల్లా అన్ని వివరాలు అధికారికంగా బయటకు వస్తాయని సమాచారం.




## సోషల్ మీడియాలో నయా ట్రెండ్.. హీరోల బనానా పోస్టర్లు ఫుల్ వైరల్




ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా నానో బనానా , నానో బనానా ట్రెండ్ నడుస్తోంది. ఒక వ్యక్తికి ఫుల్ సంబంధించిన ఫొటోను కంప్యూటర్ డెస్క్ టాప్ పై మూడు విధాలుగా చూపించే త్రీ డీ బొమ్మే ఈ నానో బనానా. ఇందులో బ్యాక్ సైడ్, మిడిల్ అండ్ లెఫ్ట్ సైడ్ ఇలా మూడు బొమ్మలు ఒకే ఫొటోనూ ఒరిజినల్ ఫొటోలాగా చేస్తుంది. ఇది పూర్తిగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) జనరేటెడ్ విధానం. మనుషుల ఫొటోలను ఏఐతో 3%ఐ% బొమ్మలుగా డిజైన్ చేస్తుంది. సోషల్ మీడియా యూజర్లంతా ఇప్పుడు ఇదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు. ఈ క్రమంలోనే సినీ తారలు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకుల నుండి ఇన్ఫ్లుయెన్సర్లు అందరి ఫొటోలను ఈ ట్రెండ్ లో భాగం చేస్తున్నారు. ఇలా డిజైన్ చేసిన ఫొటోలను ఎక్స్ (గతంలో ట్విట్టర్), ఫేస్ బుక్ , ఇన్స్టాగ్రామ్ లలో పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభాస్ రాజాసాబ్, పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా, జూనియర్ ఎన్టీఆర్ డ్యాన్స్ స్టెప్పులు, రామ్ చరణ్ పెద్ది, అల్లు అర్జున్ ఇలా టాలీవుడ్ బడా స్టార్లందరి తమతమ సినిమాలకు సంబంధించి ఫొటోలతో బనానా ట్రేండ్ క్రియేట్ చేస్తున్నారు. ఫ్యాన్స్ ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ హైలైట్ చేస్తున్నారు. ఇవి తెగ వైరల్ అవుతూ.. ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అయితే ఈ నానో బనానా ట్రెండ్ గూగుల్ ఇటీవల ఈ AI సాధనాన్ని ప్రారంభించింది. దీనిని అధికారికంగా జెమినాఐ 2.5 ఫ్లాష్ ఇమేజ్ అని పిలుస్తారు. ఇది యూజర్ల ఫొటోను రియాలిస్టిక్ యాక్షన్ ఫిగర్ లాంటి డిజైన్గా మార్చడానికి అనుమతిస్తుంది. దీంతో ఈ ఫొటోలు స్టోర్ లో చూసే బొమ్మల లాగా కనిపిస్తాయి. కాగా, జెమిని యాప్ , %+శీశీస్త్రశ్రీవాూ×% ద్వారా ఈ టూల్ ఆగస్టు 26 2025న విడుదలైంది. ఇది నెటిజన్లందరూ ఫ్రీగానే యూజ్ చేయవచ్చు. ఎలాంటి ప్రీమియం అక్కర్లేదు. ఇటీవల ఫేమస్ గిబ్లి ట్రెండ్ లాగానే, ఇప్పుడు నానో బనానా ఇమేజ్ లు కూడా నెటిజన్ల దృష్టిని త్వరగా ఆకర్షించాయి. ఎందుకంటే అవి ప్రొఫెషనల్ గా, ఫన్నీగా కనిపిస్తున్నాయి. ఎవరైనా తమ ఇమేజ్ ను, సెలబ్రిటీని లేదా కల్పిత పాత్రను క్రియేట్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్కరికీ క్రియేటివిటీని చూపించేందుకు ఈ ట్రెండ్ అవకాశాన్ని ఇస్తుంది.

## బోల్డ్ స్టెప్ తీసుకోబోతున్న అమీర్ ఖాన్.. పే-పర్-వ్యూ పై అంత నమ్మకం ఏంటి సామీ!



బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ సినిమాల విషయంలో చాలా పర్ఫెక్ట్ గా ఉంటారు. ఇప్పటివరకు ఈయన ఖాతాలో ఉన్న రికార్డుని ఎవరూ చెరపలేకపోయారు కూడా. అలా 'దంగల్' మూవీతో రూ. 2000 కోట్ల కలెక్షన్లను సాధించి బాక్సాఫీస్ ని షేక్ చేసిన అమీర్ ఖాన్.. తన సినిమాల విషయంలో అప్పుడప్పుడు తీసుకునే నిర్ణయాలు అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఉంటాయి. అలా అమీర్ ఖాన్ ఈ ఏడాది నటించిన 'సితారే జమీన్ పర్ ' మూవీని థియేటర్లలో విడుదల చేశాక.. యూట్యూబ్లో విడుదల చేయాలనే ఒక షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. అయితే చాలామంది హీరోల సినిమాలు థియేటర్లలో విడుదలయ్యాక ఓటీటీ ప్లాట్ఫామ్స్ లో విడుదలవుతాయి. కానీ సితారే జమీన్ పర్ మూవీని మాత్రం అమీర్ ఖాన్ ఓటీటీ ఫ్లాట్ ఫాం కి కాకుండా యూట్యూబ్లో విడుదల చేసి సక్సెస్ అయ్యారు. ఇక సితారే జమీన్ పర్ మూవీకి కోట్లు ఇవ్వడానికి ఓటీటీ ప్లాట్ఫామ్స్ ముందుకి వచ్చినప్పటికీ ఆ పద్ధతిలో పోకుండా సరికొత్త నిర్ణయాన్ని తీసుకొని యూట్యూబ్ లో పే - పర్ - వ్యూ మోడల్ ని ఎంచుకున్నాడు.

అయితే తాజా ఇంటర్వ్యూలో అమీర్ ఖాన్ పే-పర్- వ్యూ అనే ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. "నేను చేసిన సితారే జమీన్ పర్ మూవీని యూట్యూబ్లో చూడడం కోసం 100 రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఒక యూజర్ ఈ సినిమాకి 100 రూపాయలు పెట్టి సినిమా చూడడం ప్రారంభిస్తే.. 48 గంటల వరకు యూట్యూబ్లో ఈ సినిమా అందుబాటులో ఉంటుంది. 48 గంటలు ముగిశాక ఈ సినిమాని చూడాలంటే మళ్ళీ డబ్బులు చెల్లించాల్సిందే.. అయితే పే-పర్- వ్యూ వెూడల్ అనేది ఇప్పుడు జనాల్లోకి ఎక్కువగా వెళ్లకపోయినప్పటికీ.. మెల్లిమెల్లిగా ఈ ట్రెండ్ ఇండస్ట్రీలో కొనసాగుతుంది.. దీనివల్ల మనం ఎక్కువగా డబ్బులు ఆశించలేము.. అయితే పే-పర్-వ్యూ మోడల్ ని ఓ సినిమా కోసం ఎంచుకుంటే.. ఆ సినిమా ఉదాహరణకు X మొత్తాన్ని వసూలు చేస్తే.. మనం 20%శ% వసూలు చేస్తున్నాం. ఇది ఒక మంచి విషయమే అయినప్పటికీ ఓటీటీ ప్లాట్ఫారం ద్వారా సంపాదించే సంప్రదాయ మార్గంతో పోల్చినట్లయితే మనం ఎక్కువ ఆదాయాన్ని సంపాదించలేము.. కానీ పే - పర్ - వ్యూ మోడల్ ద్వారా ఆదాయం ఎక్కువగా వస్తుంది.. కానీ ఈ మోడల్ ఓటిటి ప్లాట్ఫారంలో అందించినంత వేగంగా డబ్బును అందించలేదు.. పే-పర్-వ్యూ మోడల్ ద్వారా ఒక సినిమాని.. అందులో ఉండే కంటెంట్ అలాగే స్టార్ విలువను బట్టి యూట్యూబ్లో X మొత్తానికి అమ్ముడు అవుతాయి. కానీ ఈ పే-పర్- వ్యూ మోడల్ లో ఒకేసారి ఎక్కువ డబ్బు రాదు. ఇది ఎక్కువ రోజులు పని చేసే నెమ్మది గల ప్రక్రియ.. అలాగే ఓటీటీ ఫ్లాట్ ఫాం ద్వారా వచ్చే ఒత్తిడి లాంటి పరిస్థితులకు లొంగిపోకుండా ఈ యూట్యూబ్ ద్వారా మనకంటూ ఒక ప్రత్యేకమైన స్పేస్ సంపాదించుకోవాలనేదే నా ఉద్దేశం. అందుకే నేను ఈ పే-పర్-వ్యూ మోడల్ ని ఎంచుకున్నాను" అంటూ అమీర్ ఖాన్ చెప్పుకొచ్చారు.. అయితే అమీర్ ఖాన్ ఈ పద్ధతిని ఎంచుకోవడానికి కారణం గతంలో ఆయన సినిమాల హక్కులను ఓటీటీకి అమ్మాక సినిమా విషయంలో పూర్తిగా స్వేచ్ఛ కోల్పోతాడు. అందుకోసమే ఇలా ఆదాయం అనేది ఎక్కువ రోజులకు వచ్చినా చాలు కానీ స్థిరమైన ఆదాయాన్ని సృష్టించాలి అనే ఉద్దేశంతో ఈ ఆలోచన తీసుకున్నట్టు తెలుస్తోంది.

## బ్లాక్ డ్రెస్ లో మతులు పోగొడుతున్న సంయుక్త!

సంయుక్త మీనన్.. ప్రముఖ హీరోయిన్ గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె.. మలయాళ కుట్టి అయినప్పటికీ తెలుగులో ఇప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా పేరు సొంతం చేసుకుంది. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూ మరింత బిజీగా మారిన సంయుక్త మీనన్.. ఇప్పుడు వరుస పెట్టి సినిమాలలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తెలుగులో ఐదు ప్రాజెక్ట్ లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈమె.. తమిళ్, హిందీ, మలయాళం భాషల్లో ఒక్కొక్క చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పలు సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. మరొకవైపు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఒలకబోస్తోంది. అందులో భాగంగానే తాజాగా బ్లాక్ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చిన ఈమె.. తన కళ్ళతో చూసే ఆడియన్స్ హృదయాలను దోచుకుంటోంది అని చెప్పవచ్చు. తాజాగా థైస్ అందాలు కనిపించేలా బ్లాక్ డ్రెస్ ధరించిన ఈ ముద్దుగుమ్మ.. జుట్టును అలా గాలికి వదిలేసి మరింత మత్తెక్కిస్తోంది. మొత్తానికి అయితే సంయుక్త మీనన్ తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయని చెప్పవచ్చు. సంయుక్త మీనన్ విషయానికి వస్తే.. 2016లో 'పాప్ కార్న్' అనే చిత్రం ద్వారా మలయాళ సినీ ఇండస్ట్రీలోకి నటిగా అడుగు



పెట్టింది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఆ తర్వాత తెలుగులో 'భీమ్లా నాయక్' సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో పవన్ కళ్యాణ్, రానా నటించగా.. రానా భార్యగా తన నటనతో మెస్మరైజ్ చేసింది. ఆ తర్వాత కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన 'బింబిసారా' సినిమాతో పూర్తిస్థాయి హీరోయిన్ గా ప్రేక్షకులకు పరిచయమైన సంయుక్త మీనన్ .. ఆ తర్వాత ధనుష్ హీరోగా వచ్చిన 'సార్' సినిమాతో మరొకసారి ఆకట్టుకుంది. ఇందులో చాలా సాంప్రదాయంగా టీచర్ పాత్రలో కనిపించి అందరిని ఆకట్టుకుంది.. ఇకపోతే సంయుక్త అమాయకంగా నటించడమే కాదు 'విరూపాక్ష' వంటి చిత్రాలతో భయపెట్టగలను అని కూడా మరొకసారి నిరూపించింది. ఇందులో మెగా మేనల్లుడు సాయిధరమ్ తేజ్ హీరోగా నటించారు. ఆయన రీ ఎంట్రీలో వచ్చిన ఈ సినిమా ఇటు సంయుక్త మీనన్ కి కూడా మంచి గుర్తింపును అందించింది. ఒక సంయుక్త మీనన్ ప్రస్తుతం వరుస పెట్టి సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.. అందులో భాగంగానే తెలుగులో శర్వానందా 37వ సినిమాలో అవకాశం అందుకున్న ఈమె.. అటు నిఖిల్ హీరో వస్తున్న 'స్వయంభూ' సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తోంది. అంతేకాదు బిఎస్ఎస్ 12 సినిమాలో కూడా అవకాశాన్ని అందుకుంది సంయుక్త మీనన్. ఇక ఒకవైపు తెలుగులో నటిస్తున్న ఈమె మరొకవైపు హిందీలో 'మహారాగ్ని: క్వీన్ ఆఫ్ క్వీన్స్' అనే సినిమాలో అవకాశాన్ని అందుకుంది. అలాగే రామ్ అనే మలయాళం చిత్రంతో పాటు ఒక తమిళ్ సినిమాలో కూడా హీరోయిన్ గా అవకాశాన్ని అందుకుంది.

## సరైన డైరెక్టర్ చేతిలో పడ్డ సాయిపల్లవి

ప్రస్తుతం సౌత్ ఇండియన్ హీరోయిన్లలో బెస్ట్ యాక్టర్ల లిస్టు తీస్తే.. అందులో సాయిపల్లవి పేరు ముందు వరసలో ఉంటుంది. గ్లామర్ విషయంలో చాలామంది హీరోయిన్లతో పోలిస్తే సాయిపల్లవి వెనుకబడి ఉంటుంది. కేవలం పెర్ఫామెన్స్తోనే ఆమె భారీగా అభిమాన గణాన్ని సొంతం చేసుకుంది. ఏ పాత్ర చేసినా.. తన మార్కు నటనతో దాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుందామె. గత ఏడాది 'అమరన్' సినిమా అంత పెద్ద హిట్ అయిందంటే.. అందులో సాయిపల్లవి నటన ఓ ముఖ్య కారణం అనడంలో సందేహం లేదు. పెర్ఫామెన్స్ విషయంలో సాయిపల్లవి నుంచి వాడుకున్నోళ్లకు వాడుకున్నంత అని చెప్పొచ్చు. ప్రస్తుతం 'రామాయణం' లాంటి మెగా మూవీలో సీత పాత్ర చేస్తుండడంతో తన నటన మరో స్థాయిలో ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇదే సమయంలో ఈ టాలెంటెడ్ యాక్ట్రెస్ ఒక గొప్ప దర్శకుడితో సినిమా కమిటవ్వడం ఆసక్తి రేకెత్తిస్తోంది. అతనే.. వెట్రిమారన్. 'పొల్లాదవన్'తో మొదలుపెడితే



వెట్రిమారన్ ప్రతి సినిమా ఒక క్లాసిక్. ఆయన చిత్రాల్లో హీరోయిన్ల పాత్రలు కూడా చాలా బలంగా, పెర్ఫామెన్స్కు మంచి స్కోప్ ఇచ్చేలా సాగుతాయి. చివరగా 'విడుదల-2' చిత్రంతో పలకరించిన వెట్రివూరన్.. తమిళ స్టార్ హీరో శింబుతో ఓ సినివూ చేయబోతున్నాడు. ధనుష్తో తాను తీసిన బ్లాక్ బస్టర్ మూవీ 'వడ చెన్నై' తరహా కథతోనే ఈ సినిమాను తెరకెక్కించనున్నాడు. ఇందులో సాయిపల్లవిని కథానాయికగా ఎంచుకున్నట్లు సమాచారం. వెట్రిమారన్తో సాయిపల్లవి ఇంతకుముందే పని చేసింది. నెట్ ఫ్లిక్స్ కోసం చేసిన 'పావ కథైంగల్'లో ఒక ఎపిసోడ్లో ఆమె లీడ్ రోల్ చేయగా.. వెట్రిమారన్ డైరెక్ట్ చేశాడు. ఆ ఆంథాలజీ ఫిలింలో ఈ ఎపిసోడే హైలైట్గా నిలిచింది. సాయిపల్లవి నటన, వెట్రిమారన్ డైరెక్షన్ హైలైట్గా నిలిచాయి. ఇప్పుడు ఈ కాంబినేషన్లో ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిలిమే రాబోతుండడం వీళ్లిద్దరి అభిమానులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చేదే. మరి సాయిపల్లవి కోసం వెట్రిమారన్ ఎలాంటి పాత్ర డిజైన్ చేశాడో.. అందులో ఆమె ఎలాంటి ఇంపాక్ట్ వేస్తుందో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536